
'అవినీతి, అసత్య వార్తలు
క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 29

శుక్రవారం 21-4-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ II
విజయవాడ
శుక్రవారం ॥ 21-4-2023

న్యూస్‌మేకర్


సొంతగా రచనలు చేయగలిగేవారు అనువాదాలు చేయరు. భాష బాగా వచ్చినంత మాత్రాన అనువాదం చేయలేరు. దానికి నైపుణ్యం, కొంత నిస్వార్థం కావాలి. తమిళ రచయిత్రి నందిని కృష్ణన్ చేసిన 'పొన్నియిన్ సెల్వన్' ఇంగ్లిష్ అనువాదం ఏప్రిల్ 24న మార్కెట్లోకి రానుంది. నవలలోని పాతకాలపు తమిళాన్ని నేటి యువతకు అందేలా అనువాదం చేయడం సులువు కాదు. తమిళంలోని ఉత్తమ నవలలను సవాలుగా తీసుకుని నందిని ఇంగ్లిష్‌లో అనువాదం చేస్తోంది. ఆమెకు వస్తున్న గుర్తింపు ఆ రంగంలో రాణించాలనుకునే స్త్రీలు గమనించదగ్గది.

అనువాద వారధి


నందిని కృష్ణన్



దాదాపు 2500 పేజీలు ఉండే ఐదు భాగాల భారీ ప్రఖ్యాత తమిళ నవల 'పొన్నియిన్ సెల్వన్'ను ఇంగ్లిష్‌లో అనువాదం చేయబూనడం సాహసం. కాని ఈ క్లాసిక్‌ను అనువాదం చేయడానికి చాలా మంది ట్రై చేస్తూనే వచ్చారు. ముగ్గురు నలుగురు సఫలీకృతులయ్యారు. అయితే ఎప్పటికప్పుడు కొత్త జనరేషన్‌కు తగ్గట్టుగా అనువాదం చేయడానికి ఎవరో ఒకరు ముందుకు వస్తూనే ఉన్నారు. ఇప్పుడు నందిని కృష్ణన్ వంతు. ఆమె చేసిన ఈ నవల అనువాదం మొదటి భాగం పూర్తయ్యింది. ఏప్రిల్ 24న విడుదల కానుంది. వెస్ట్‌ల్యాండ్ బుక్స్ దీనిని ప్రచురిస్తుంటే 'పొన్నియిన్ సెల్వన్'ను రెండు భాగాల సినిమాగా తీస్తున్న దర్శకుడు మణిరత్నం ఈ కార్యక్రమానికి ప్రోత్సాహకుడిగా ఉన్నాడు.



'పొన్నియిన్ సెల్వన్ నవల 75 ఏళ్ల క్రితం నాటిదని గుర్తు లేనంతగా అనునిత్యం తమిళ సాహిత్యంలో కలగలిసిపోయింది. కల్కి రాసిన ఈ నవలలోని భాషను, పై అర్థాన్ని, లోపలి అర్థాన్ని అర్థం చేసుకుని అనువాదం చేయడం చాలా జటిలం. అయినా చేశాను. పాఠకులు సులభంగా చదువుకోవడానికి, చేత బట్టుకోవడానికి వీలుగా ఇంగ్లిష్‌లో ఐదు కంటే ఎక్కువ భాగాలుగా విభజించి పుస్తకాలుగా తేనున్నాము' అని తెలిపింది నందిని కృష్ణన్.

ఎవరీ నందిని కృష్ణన్?

నందిని కృష్ణన్ చెన్నైలో స్థిరపడిన నాటకకర్త, రచయిత్రి, స్టేజ్ యాక్టర్ కూడా. లండన్‌లో, ఢిల్లీలో జర్నలిస్ట్‌గా పని చేసింది. ఆ తర్వాత చెన్నై నుంచి వెబ్, ప్రింట్ మీడియాలలో పని చేయడం మొదలుపెట్టింది. హాస్యం రాస్తుంది. పెద్దలు కుదిర్చే పెళ్లిళ్లకు ప్రాధాన్యం ఇచ్చే భారతీయ వైవాహిక వ్యవస్థపై విమర్శను పెడుతూ వివాహమైన స్త్రీలను, పురుషులను ఇంటర్వ్యూ చేసి 'హిచ్డ్: ది మోడర్న్ అండ్ అరేంజ్డ్ మేరేజ్' పుస్తకం తెచ్చింది. ట్రాన్స్ మెన్ జీవితాల ఆధారంగా 'ఇన్‌విజిబుల్ మెన్' పుస్తకం రాసింది. పెరుమాళ్ మురుగన్ నవలలను ఇంగ్లిష్‌లో అనువాదం చేయడం ద్వారా అనువాద రంగంలో ప్రవేశించింది. ఇప్పుడు 'పొన్నియిన్ సెల్వన్' అనువాదం చేస్తోంది. నందిని కృష్ణన్ ఇంట్లో ఎప్పుడూ వీధి కుక్కలు ఉంటాయి. వాటిని సాకుతుంటుంది. పిల్లులను కూడా. 'కుక్కలు, పిల్లులు, వేల కొద్ది పుస్తకాలు అంతే మా ఇల్లు' అని చెబుతుంది.

కత్తి మీద సాము

'అనువాదం చేయడం కత్తి మీద సాము' అంటుంది నందిని. 'సొంత రచనైతే అలా ఒక సమాధి స్థితికి వెళ్లి రాసుకుంటూ పోతాము. అనువాదం అలా కాదు. అప్రమత్తంగా ఉండాలి. ఎదుటివారు చదివితే అది కేవలం అనువాదం అనిపించకూడదు. అదే సమయంలో ఒరిజినల్ నవల తాలూకు పరిమళం దానిలో ఉండాలి. అనువాదం పూర్తి చేశాక ఎవరిదో కన్నబిడ్డను మనం సాకాం... ఇక దీనితో రుణం చెల్లిపోయింది అన్న బాధ తప్పదు' అంటుంది నందిని.

'అనువాదకులు స్వయంగా రచయితలు కాకపోవడం వల్ల కొన్ని అనువాదాలు చెడిపోతాయి. ఎందుకంటే వాళ్లు ప్రతి మాటా కచ్చితంగా అనువాదం చేస్తూ కృతకంగా మారుస్తారు. అనువాదకులు స్వయంగా రచయితలైనా కూడా కొన్ని అనువాదాలు చెడిపోతాయి. ఎందుకంటే వారు తమ సృజనశక్తిని కూడా కలుపుతారు. అది తప్పు. వేరొకరు గీసిన బొమ్మను నకలు చేసేటప్పుడు మనం పికాసో అంతటివాళ్లమైనా ఆ బొమ్మలో మన గొప్పదనం చూపకూడదు. అనువాదం అయినా అంతే' అంటుంది నందిని కృష్ణన్.

మంచి అనువాద రుసుము

'అనువాదంలో రాణించాలంటే మంచి డబ్బు కూడా మనకు ఆఫర్ చేయాలి. తగిన డబ్బు లేకుండా అనువాదం చేయడం అనవసరం' అంటుంది నందిని. 'కొంతమంది కల్లబొల్లి మాటలు చెప్పి అనువాదం చేయించుకోవాలనుకుంటారు. వారి నుంచి జాగ్రత్తగా ఉండాలి. నేను రోజుకు ఆరేడు గంటలు అనువాదం చేస్తాను. ఒక పదానికి బదులు ఎన్ని పదాలు వాడొచ్చో అవసరమైతే లిస్ట్ రాసుకుంటాను. ఒరిజినల్‌ని చదువుతూ, అనువాదాన్ని చదువుకుంటూ పని ముగిస్తాను. పెరుమాళ్ మురుగన్ లాంటి రచయితలు పల్లెల్లో మరీ కొన్ని వర్గాలు మాత్రమే వాడే మాటల్ని ఉపయోగించి రాస్తారు. వాటికి ఇంగ్లిష్ మాటలు ఉండవు. డిక్షనరీలు కూడా ఉండవు. అందుకే అవసరమైతే ఒరిజినల్ రచయితనే సంప్రదిస్తూ డౌట్లు క్లియర్ చేసుకుంటూ అనువాదం ముగించాలి' అంటుంది నందిని.

నందిని లాంటి అనువాదకులు తెలుగులో కూడా ఉంటే మన క్లాసిక్స్ కూడా ప్రపంచ పాఠకులకు తప్పక చేరుతాయి. అనువాదకులకు గుర్తింపునూ తెచ్చిపెడతాయి.

ఫ్యాషన్

సమ్మర్ స్టైల్







అత్యంత వేడిగా ఉండే ఈ సీజన్‌లో తాజాగా వికసించడానికి, స్టైల్‌ని రీస్టైల్ చేయడానికి, ఈ టైమ్‌లెస్ క్లాసిక్ డ్రెస్సులు సరైన ఎంపిక. సమ్మర్ ఫ్యాషన్ ట్రెండ్‌లు ఎప్పుడూ స్టైల్‌కు దూరంగా ఉండవు. వాటిని మళ్ళీ మళ్లీ ధరించవచ్చు. క్యాజువల్ వేర్‌గానూ, పార్టీవేర్‌గానూ ఈ డ్రెస్సులతో సమ్మర్ స్టైల్‌ని సౌకర్యంగా మెరిపించవచ్చు.

ఆఫ్ షోల్డర్ టాప్స్

ట్యూబ్ టాప్స్, ఆఫ్ షోల్డర్స్, బ్రాలెట్స్, బ్యాండో టాప్స్ వంటి వేసవి స్నేహ పూర్వక దుస్తులను ఏ బాటమ్‌కైనా అందాన్నివ్వగలవు. ఈ ట్రెండ్ మిమ్మల్ని అప్రయత్నంగానే స్టైలిష్‌గా కనిపించేలా చేస్తాయి.

పూల ప్రింట్లు

తాజాగా వికసిస్తున్న పూల ప్రింట్లు గల డ్రెస్సులు స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంటాయి. వేడి వాతావరణంలో కూడా కంటికి, మనసుకు ఆహ్లాదాన్నిస్తాయి. ఈ ప్రింట్స్ ఉన్నప్పుడు ఇక డ్రెస్ పైకి ఇతర అలంకారాలేవీ వాడక్కర్లేదు.

బటన్ డౌన్ షర్ట్

క్యాజువల్ లుక్‌తోనే స్టైలిష్‌గా కనిపించే వాటిలో తెల్లటి కాటన్ షర్ట్ ఎంపిక సరైనది. డే అండ్ నైట్ పార్టీలకూ అనుకూలమైనది. ఈ కాటన్ షర్ట్స్‌కి బాటమ్‌గా ట్రౌజర్స్, పలాజో స్టైల్ ప్యాంట్స్ కూడా ఎంచుకోవచ్చు.

కంఫర్ట్ కుర్తీ

సింపుల్‌గా అనిపించే 'ఎ'లైన్ కాటన్ కుర్తీలు, నీ లెంగ్త్ బాటమ్స్ ఈ సీజన్‌కి బాగా నప్పుతాయి. వీటిలోనే లాంగ్ అండ్ షార్ట్ కుర్తీలు ఎంచుకోవచ్చు. ప్లెయిన్, ప్రింట్ ఎవరి ఎంపిక ఎలా ఉన్నా కలర్స్ విషయంలో లేత రంగులకు ప్రాముఖ్యం ఇవ్వడం మంచిది.

బెల్ స్లీవ్స్

వదులుగా ఉండే ఫ్రాక్స్, కుర్తీలు ఈ సీజన్‌లో ఎక్కువగా ట్రెండ్‌లో ఉంటాయి. బెల్ స్లీవ్ టాప్స్, బ్లౌజ్‌లు, ఫ్రాక్స్, కఫ్తాన్లు, హారమ్ ప్యాంట్స్ మేనికి గాలి తగిలేలా ఉండి, హాయి కలిగిస్తాయి. సౌకర్యంగానూ ఉండటంతో పాటు స్టైల్‌గానూ కనిపిస్తాయి. ఇవి వేసవిలో ట్రెండీ లిస్ట్‌లో అగ్రస్థానంలో ఉంటాయి.

రుచుల నెలవంక

అమావాస్య వెళ్లి పోయింది...
నెలవంక కోసం ఎదురు చూపు మొదలైంది.
చంద్ర దర్శనం నేడు కావచ్చు... లేదా రేపు కావచ్చు.
'ఈద్ ఉల్ ఫిత్ర్' వేడుకకు ఇంటిని సిద్ధం చేద్దాం.
మన 'వంటిల్లు'లో కొలువుదీరిన రుచులను చూద్దాం.

పాకిస్థానీ షీర్ కుర్మా



కావలసినవి: సన్న సేమ్యా – పావుకేజీ; వెన్న తీయని పాలు – లీటరు; చక్కెర – పావుకేజీ; నెయ్యి – కప్పు; జీడిపప్పు – అర కప్పు ; బాదం – అర కప్పు ; పిస్తా – పావు కప్పు; గులాబీ రెక్కలు– గుప్పెడు, యాలకులు – పది.

తయారీ: ★ జీడిపప్పు, బాదం, పిస్తాలను తరగాలి. బాణలిలో నెయ్యి వేడి చేసి వీటన్నింటినీ వేసి సన్నమంట మీద దోరగా వేయించాలి. వేగిన తర్వాత గిన్నెలోకి తీసి పక్కన పెట్టుకోవాలి. మిగిలిన నెయ్యిలో సేమ్యా వేసి వేగిన తరవాత పాలు పోసి కలుపుతూ మరిగించాలి. యాలకులను నలగ్గొట్టి పాలలో వేయాలి. పదిహేను నిమిషాల పాటు మరిగిన తర్వాత చక్కెర వేసి అడుగు పట్టకుండా గరిటతో కలుపుతూ మరిగించాలి. ఖీర్ చిక్కబడిన తర్వాత ముందుగా వేయించి పక్కన పెట్టుకున్న గింజలను, పూలరెక్కలను వేసి కలిపి దించేయాలి.

ఖీమా వడ



కావలసినవి: మటన్ ఖీమా– అర కేజీ ; ఉల్లిపాయ – 3 (ఒకటి పెద్ద ముక్కలుగా తరగాలి, రెండింటిని సన్నగా తరగాలి) ; వెల్లుల్లి రేకలు – పది ; అల్లం– అంగుళం ముక్క ; లవంగాలు – 4 ; దాల్చిన చెక్క – రెండంగుళాల ముక్క ; మిరియాలు – అర టీ స్పూన్ ; సోంపు– పావు టీ స్పూన్ ; పచ్చిమిర్చి– 3 లేదా 4 ; ఉప్పు– టీ స్పూన్ లేదా రుచిని బట్టి; శనగపిండి – పావు కప్పు ; కోడిగుడ్డు – 1 ; కొత్తిమీర కట్ట– 1 (శుభ్రం చేసి సన్నగా తరగాలి) ; పుదీన కట్ట –1 (శుభ్రం చేసి వలిచి పెట్టుకోవాలి) ; నూనె– 2 కప్పులు.

తయారీ: ★మటన్ ఖీమాను శుభ్రం చేసి పక్కన పెట్టుకోవాలి. ★ మిక్సీ జార్‌లో ఉల్లి పెద్దముక్కలు, వెల్లుల్లి రేకలు, అల్లం, లవంగాలు, దాల్చిన చెక్క, మిరియాలు, సోంపు, పచ్చిమిర్చి, ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. చివరగా ఖీమా కూడా వేసి ఒకసారి తిప్పి ఆపేయాలి. ★ ఈ మిశ్రమాన్ని ఒక పాత్రలోకి తీసుకుని అందులో కోడిగుడ్డు సొన, శనగపిండి వేసి కలపాలి. ఇప్పుడు పుదీన, కొత్తిమీర, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి కలపాలి. అవసరమైతే మరికొంత ఉప్పు కలుపుకోవచ్చు. ★బాణలిలో నూనె వేడి చేయాలి. అరచేతులకు రెండు చుక్కల నూనె రాసుకుని ఖీమా మిశ్రమాన్ని నిమ్మకాయంత తీసుకుని వడల్లా వత్తి నూనెలో వేసి మీడియం మంట మీద రెండు వైపులా కరకరలాడేటట్లు కాల్చాలి. మిశ్రమం అంతటినీ ఇలాగే వడలు చేసుకోవాలి. ఖీమా వడలను స్నాక్‌గా తినాలంటే పుదీనా చట్నీ మంచి కాంబినేషన్. సైడ్ డిష్‌గా సాంబార్ రైస్‌లోకి తింటే కూడా బాగుంటాయి.

చెట్టినాడ్ మటన్ కొళంబు



కావలసినవి: మటన్– అర కేజీ ; ఉల్లిపాయ ముక్కలు – కప్పు ; పచ్చిమిర్చి– 4 (నిలువుగా చీరాలి); కరివేపాకు రెమ్మలు –పది ; టొమాటో ముక్కలు – కప్పు ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; పసుపు– అర టీ స్పూన్ ; కశ్మీరీ మిరప్పొడి– 2 టీ స్పూన్‌లు ; నూనె– 4 టేబుల్ స్పూన్‌లు.

మసాలా కోసం: జీడిపప్పు – టేబుల్ స్పూన్ ; ఎండు మిర్చి –8 ; జీలకర్ర – టీ స్పూన్ ; సోంపు– టీ స్పూన్ ; లవంగాలు – 3 ; దాల్చిన చెక్క – అంగుళం ముక్క ; మిరియాలు– 2 టీ స్పూన్‌లు ; వెల్లుల్లి తరుగు – టీ స్పూన్ ; ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు ; తాజా కొబ్బరి తురుము – 2 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ★ మటన్‌ను శుభ్రంగా కడిగి పెట్టాలి. ★ మసాలా కోసం తీసుకున్న జీడిపప్పు, ఎండుమిర్చి, జీలకర్ర, సోంపు, లవంగాలు, చెక్క, మిరియాలను మందపాటి బాణలిలో సన్న మంట మీద ఒక మోస్తరుగా వేయించాలి. చల్లారిన తర్వాత మిగిలిన మసాలా దినుసులతో పాటు మిక్సీలో గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి. ★ ప్రెషర్ కుక్కర్ పెనంలో నూనె వేడి చేసి అందులో ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, కరివేపాకు వేసి వేయించాలి. ఉల్లిపాయలు దోరగా వేగిన తరవాత టొమాటో ముక్కలు వేసి రెండు– మూడు నిమిషాల పాటు మీడియం మంట మీద మగ్గనివ్వాలి. ఇందులో పసుపు, కశ్మీరీ మిరప్పొడి వేసి కలపాలి. ఇప్పుడు ముందుగా సిద్ధం చేసుకున్న గరం మసాలా పేస్ట్ వేసి రెండు నిమిషాల సేపు వేయించిన తర్వాత మాంసం ముక్కలు వేసి కలిపి రెండు కప్పుల నీటిని పోసి మూత పెట్టి దాదాపు అరగంట సేపు ఉడికించాలి. ★ కుక్కర్ ప్రెషర్ తగ్గిన తరవాత మెల్లగా మూత తీసి చూడాలి. నీరు మరీ తక్కువగా అనిపిస్తే అరకప్పు నీటిని పోయాలి. ఉప్పు కూడా సరిచూసుకుని అవసరమైతే కలుపుకుని చివరగా కొత్తిమీర తరుగు చల్లాలి. ఒకవేళ నీటిని పోస్తే మళ్లీ స్టవ్ మీద పెట్టి కర్రీ మరిగే స్థితికి వచ్చే వరకు కలుపుతూ ఉడికించాలి.

ఆఫ్ఘన్ మటన్ బిర్యానీ



కావలసినవి: మటన్– కిలో ; బాసుమతి బియ్యం – ముప్పావు కిలో ; లవంగాలు– పది ; దాల్చిన చెక్క – మూడంగుళాల ముక్కలు రెండు ; ఉప్పు – 2 టీ స్పూన్‌లు ; అల్లం వెల్లుల్లి పేస్ట్ – టేబుల్ స్పూన్ ; నీళ్లు– 8 కప్పులు ; నూనె– కప్పు ; ఉల్లిపాయ ముక్కలు – 100 గ్రా ; యాలకులు – 8 ; జీలకర్ర– టీ స్పూన్ ; క్యారట్ తురుము– పావు కేజీ ; కిస్‌మిస్ – అర కప్పు ; పైన్ నట్స్ లేదా బాదం – అరకప్పు, ఖర్జూరాలు ; పది.

తయారీ: ★ మటన్ ముక్కలను శుభ్రంగా కడగాలి. బియ్యాన్ని కడిగి మునిగేటట్లు నీటిని పోసి పక్కన ఉంచాలి. ★ మందపాటి పెద్ద పాత్రలో మాంసం ముక్కలు, ఒక దాల్చిన చెక్కను పలుకులు చేసి వేయాలి. సగం లవంగాలు, ఉప్పు, అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసి కలిపి నీటిని పోసి ఉడికించాలి. ముక్క ఉడకడానికి దాదాపు ముప్పావు గంట పడుతుంది. ★ బియ్యంలో నీటిని వడపోసి చిల్లుల పాత్రలో వేసి రెండు నిమిషాల సేపు ఉంచాలి. ★ మరొక పెనంలో రెండు టేబుల్ స్పూన్‌ల నూనె వేడి చేసి పైన్ నట్స్ లేదా బాదం, కిస్‌మిస్, క్యారట్‌లను వేయించి పక్కన ఉంచాలి. ★ ఇప్పుడు పెద్ద పెనం పెట్టి నూనె వేడి చేసి ఉల్లిపాయ ముక్కలను ఎర్రగా వేయించి అందులో మరో దాల్చిన చెక్క పలుకులు, మిగిలిన సగం లవంగాలు, యాలకులు, జీలకర్ర వేయాలి. ఇవి కొద్దిగా వేగిన తరవాత ఉడికించిన మాంసాన్ని నీరు ఇతర దినుసులతో సహా ఇందులో వేయాలి. ఉడకడం మొదలైన తర్వాత బియ్యాన్ని వేసి కలిపి మూత పెట్టాలి. మీడియం మంట మీద ఉడికించాలి. పది నిమిషాల్లో ఉడుకుతుంది. మధ్యలో ఓ సారి జాగ్రత్తగా మసాలా దినుసులు సమంగా కలవడం కోసం బియ్యం విరగకుండా కలపాలి. ★ ఇప్పుడు ముందుగా వేయించి పెట్టుకున్న క్యారట్, కిస్‌మిస్ మిశ్రమాన్ని, ఖర్జూరాలను బిర్యానీ మీద సమంగా పరిచినట్లు అమర్చి గట్టిగా మూత పెట్టి, మంట తగ్గించాలి. ఏడెనిమిది నిమిషాలకు బిర్యానీ రెడీ అవుతుంది. వేడిగా ఉన్నప్పుడే రైతాతో తింటే చాలా రుచిగా ఉంటుంది.

బ్యూటిప్స్

రోజంతా తాజాగా!

చర్మం కాస్త డల్‌గా... జీవం కోల్పోయినట్టుగా ఉంటే ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవచ్చు.



➡ ఒంటికి చెమట పట్టేలా చేసే రన్నింగ్, జాగింగ్, వాకింగ్ వంటివి తప్పనిసరిగా రోజులో 20 నిమిషాలైనా చేయాలి. చెమట ద్వారా స్వేదరంధ్రాలలో చేరిన మురికి విడుదల అవుతుంది. యోగా వల్ల రక్తప్రసరణ మెరుగై చర్మం ఆరోగ్యంగా నిగనిగలాడుతుంది.



➡ చర్మం పొడిబారుతోంది అంటే సరైన నిద్రకు దూరంగా ఉన్నారని అర్థం చేసుకోవాలి. రోజూ ఎనిమిది గంటల నిద్ర లేకపోతే కళ్ల కింద వలయాలు ఏర్పడతాయి. ఉదయం, రాత్రి పడుకునే ముందు వేలి కొసలతో తేనె అద్దుకొని కళ్ల కింద ఉబ్బుగా ఉన్న చోట రాయాలి. అలాగే ముఖమంతా తేనె రాసి, మృదువుగా రుద్దాలి. తర్వాత చల్లటి నీళ్లతో కడిగేయాలి. ఇలా వారంలో మూడు సార్లు చేస్తే చర్మకాంతి పెరుగుతుంది.

➡ రోజూ రాత్రి పడుకునే ముందు ఆలివ్ ఆయిల్‌లో ముంచిన దూది ఉండతో ముఖమంతా రాయాలి. అదే ఉండతో కాస్త ఒత్తిడి పెడుతూ మసాజ్‌లా చేయాలి. దీంతో ముఖంపైన దాగున్న దుమ్ము కణాలు, శుభ్రపరిచినా మిగిలిన మేకప్ సులువుగా వదిలిపోతుంది. తర్వాత ముఖాన్ని ఫేస్ వాష్‌తో శుభ్రపరుచుకొని మాయిశ్చరైజర్ రాసుకోవాలి.

➡ నీటి శాతం ఎక్కువ ఉండే పుచ్చకాయ, దోసకాయ, ఆరెంజ్, స్ట్రాబెర్రీ వంటి పండ్లను తినాలి.

➡ చర్మం జీవం లేనట్టుగా కనిపిస్తే రోజూ తగినన్ని నీళ్లు తాగడం లేదని అర్థం. అందుకని రోజూ 8 గ్లాసుల నీళ్లు తప్పనిసరిగా తాగాలనే నియమం పాటించాలి. అలాగే, రోజులో మూడుసార్లు సబ్బు లేకుండా కేవలం మంచినీళ్లతో ముఖాన్ని శుభ్రపరిచి, మాయిశ్చరైజర్ రాయాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తే చర్మం సహజకాంతితో కళకళలాడుతుంది.

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 29

శుక్రవారం 21-4-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



సిరాజ్ సూపర్ షో

పంజాబ్ కింగ్స్‌పై 24 పరుగుల తేడాతో బెంగళూరు విజయం - 13లో



ఆఖరి గంటలో కొనుగోళ్లు

స్వల్ప లాభాలతో గట్టెక్కిన సూచీలు.. సెన్సెక్స్ లాభం 66 పాయింట్లు - 13లో



రాహుల్ గాంధీకి ఎదురుదెబ్బ

పరువు నష్టం కేసులో విధించిన శిక్షపై స్టే కోరుతూ కాంగ్రెస్ నేత రాహుల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సూరత్ కోర్టు తిరస్కరించింది.

వివరాలు 6లో ▸



బుద్ధుని బోధనలే మార్గదర్శకాలు

ప్రపంచం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు బుద్ధుడి బోధనలు చక్కని పరిష్కారాలు చూపగలవని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



ఐదుగురు జవాన్ల వీరమరణం

జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఉగ్రవాదుల దాడిలో ఐదుగురు జవాన్లు వీర మరణం పొందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



గోవాలో ఎస్‌సీవో భేటీకి బిలావల్

గోవాలో మే 4, 5 తేదీల్లో జరిగే షాంఘై సహకార సంస్థ సమావేశానికి పాక్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో హాజరుకానున్నారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్


రాగిజావ బదులు చిక్కీలు



ప్రస్తుతం ప్రభుత్వ స్కూళ్లు ఉదయం 11.15 గంటల వరకే నిర్వహిస్తుండటం, విద్యార్థులు ఇళ్లకు వెళ్లే ముందు మధ్యాహ్న భోజనం పెడుతున్నందున వారికి వేరేగా రాగి జావను అందించే బదులు చిక్కీలు ప్రతిరోజూ ఇవ్వాలని పాఠశాల విద్యా శాఖ నిర్ణయించింది. రాగి జావ పంపిణీని తిరిగి వచ్చే విద్యాసంవత్సరం ఆరంభం నుంచి చేపట్టనున్నారు.

వివరాలు 14లో ▸

దేశవ్యాప్తంగా మంచి రోడ్లు వేయించింది నేనే




1998లో అప్పటి ప్రధాని వాజ్‌పేయికి సలహా ఇచ్చి, దేశ వ్యాప్తంగా మంచి రోడ్లు వేయించింది తానేనని టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పారు. తనను 420 అని తిడుతుంటే మీకెందుకు కోపం రావడం లేదని ప్రజలను ప్రశ్నించారు.

వివరాలు 10లో ▸

ఫ్యాక్ట్‌చెక్

'గేటు'పై ఈనాడు అడ్డగోలు అబద్ధాలు



వరద ఉధృతికి కొట్టుకుపోయిన పులిచింతల గేటు బిగింపు పనులు, మరమ్మతులు తుదిదశకు చేరుకున్నాయని తెలుసుకున్న 'ఈనాడు' ఆదరాబాదరగా ఓ అడ్డగోలు కథనాన్ని అచ్చేసి చంకలు గుద్దుకుంది. మరో 15 రోజుల్లో గేటు బిగింపు పూర్తి కానుండగా 30% పనులే జరిగాయంటూ పచ్చి అబద్ధాలను ప్రచురించింది.

వివరాలు 2లో ▸

వడివడిగా 'వెలిగొండ'

సాకారమవుతున్న ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల దశాబ్దాల కల

- 2021 జనవరి 13 నాటికే తొలి టన్నెల్, హెడ్ రెగ్యులేటర్ పనులు పూర్తి చేయించిన సీఎం జగన్
- 2022-23లో 5.52 కి.మీల పొడవున రెండో సొరంగం పనులు పూర్తి
- ఇందులో ఇంకా 1.8 కి.మీలే మిగులు.. అవి ఆగస్టుకు పూర్తి
- నల్లమల సాగర్‌కు నీటిని తరలించేలా 23 కి.మీల పొడవున ఫీడర్ ఛానల్ రెడీ
- రూ.868.27 కోట్లతో పునరావాసంపై దృష్టి
- శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను ఈ ఏడాదే నల్లమలసాగర్‌కు తరలింపు
- శ్రీశైలం నుంచి 43.5 టీఎంసీలను తరలించి 3 జిల్లాల్లోని 4,47,300 ఎకరాలకు 'వెలిగొండ' ఫలాలు.. అలాగే 15.25 లక్షల మందికి తీరనున్న దాహార్తి
- 1995 నుంచి 2004 మధ్య వెలిగొండకు చంద్రబాబు కేవలం రూ.పది లక్షలే వ్యయం
- 2004 నుంచి రూ.3,581.57 కోట్లు వ్యయం చేసి సింహభాగం పనులు పూర్తి చేయించిన వైఎస్సార్
- మళ్లీ 2014 నుంచి 2019 మధ్య ప్రాజెక్టు పేరుతో బాబు దోపిడీ
- సీఎం జగన్ వచ్చాక రెండో సొరంగం పనులకు రివర్స్ టెండరింగ్
- రూ.61.76 కోట్లు ఆదా.. పనులు చకచకా



వెలిగొండ రెండో టన్నెల్‌లో ముమ్మరంగా జరుగుతున్న పనులు

ఆలమూరు రామగోపాలరెడ్డి, వెలిగొండ ప్రాజెక్టు నుంచి 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి

ప్రకాశం, పొట్టిశ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లోని దుర్భిక్ష ప్రాంతాల ప్రజల దశాబ్దాల స్వప్నం వెలిగొండ ప్రాజెక్టు శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వెలిగొండ ప్రాజెక్టులో అంతర్భాగమైన నల్లమలసాగర్‌కు నీటిని తరలించడానికి వీలుగా 18.8 కి.మీల పొడవున మొదటి సొరంగం, హెడ్ రెగ్యులేటర్ పనులను 2021 నాటికే ప్రభుత్వం పూర్తిచేసింది. కన్వేయర్ బెల్ట్ తెగిపోతుండటం, టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం)లో సమస్యలు ఉత్పన్నమవుతుండటంతో.. ఓ వైపు టీబీఎంతో సొరంగం తవ్వుతూనే మరోవైపు మనుషులతో తవ్వకం పనులు చేపట్టాలని జలవనరుల శాఖ అధికారులు, కాంట్రాక్టు సంస్థకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతేడాది దిశానిర్దేశం చేశారు. దీంతో 2022-23లో 5.52 కి.మీల పొడవున సొరంగం తవ్వి.. ప్రాజెక్టు చరిత్రలోనే రికార్డు సృష్టించారు. మరోవైపు.. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే నల్లమల సాగర్ పూర్తయింది. దీని నుంచి తీగలేరు కెనాల్‌ను అనుసంధానిస్తూ 550 మీటర్ల పొడవున సొరంగం పనులను ఇటీవల ప్రభుత్వం పూర్తిచేసింది. అలాగే, తీగలేరు కెనాల్‌కు నల్లమలసాగర్ నుంచి

మిగతా 2వ పేజీలో ▶

సకల సౌకర్యాలతో అంగన్‌వాడీలు

అన్ని విధాలా తీర్చిదిద్దేలా చర్యలు: సీఎం జగన్

- సదుపాయాలపై సచివాలయాల నుంచి సమాచారం
- చేపట్టాల్సిన పనుల ప్రతిపాదనలతో నివేదిక ఇవ్వండి
- 10 వేల అంగన్‌వాడీల్లో నాడు–నేడు పనులు ప్రారంభం
- మిగతా 45 వేల అంగన్‌వాడీల్లో ప్రాధాన్యత క్రమంలో పనులు
- పెన్షన్ల తరహాలోనే పకడ్బందీగా 'సంపూర్ణ పోషణ' పంపిణీ
- ప్రతి అంగన్‌వాడీపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ
- అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ పోస్టుల భర్తీకి చర్యలు
- మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖపై సమీక్షలో సీఎం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించి, వాటిని సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖపై గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో

మిగతా 2వ పేజీలో ▶

> రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై మరింత శ్రద్ధ పెట్టాలి. పిల్లల ఎదుగుదలను పర్యవేక్షించే పరికరాల (గ్రోత్ మానిటరింగ్ ఎక్విప్‌మెంట్)ను ప్రతి కేంద్రంలో వెంటనే ఏర్పాటు చేయాలి. ఫలానా సదుపాయం లేదనిపించుకోకుండా పూర్తి సమాచారం తెప్పించుకోవాలి. చేపట్టాల్సిన పనుల గురించి వివరిస్తూ ఒక నివేదిక రూపొందించి అందజేయాలి.
>
> - ముఖ్యమంత్రి వైఎస్ జగన్

వివేకా హంతకుల్ని నడిపిస్తున్నదెవరు?

నేనే నరికి చంపానన్న దస్తగిరి... ఎల్లో మీడియాకు ఓ సెలబ్రిటీ

- కుట్రదారుడనే ఆరోపణలున్న బీటెక్ రవితో ఇంటర్వ్యూ 'షో'లు
- బాబు, బీటెక్ రవి, దస్తగిరి, ఆదినారాయణ రెడ్డితో సునీత కుటుంబం సాన్నిహిత్యం
- 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో కుట్రపూరితంగా వివేకాను దెబ్బతీసిన చంద్రబాబు
- గెలవటానికి కావాల్సినంత మద్దతు ఉండటంతో వివేకాకు టిక్కెట్టిచ్చిన జగన్
- వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభాలకు గురిచేసి బీటెక్ రవిని గెలిపించిన బాబు
- 2019 ఎన్నికల్లో వివేకా అడ్డు తొలగించుకునేందుకు ముందస్తు పన్నాగం
- రెండో వివాహంతో వివేకా కుటుంబంలో ఆస్తి, వారసత్వ విభేదాలు
- వివేకా హత్య...అనంతరం గుండెపోటు కథ...అంతా ఎల్లో స్కెచ్చే
- కుటుంబ సభ్యుల ద్వారానే కుట్ర అమలు... అదే బాబు మార్కు పన్నాగం
- గుండెపోటుతో మరణించారని చెప్పిన వివేకా పెద్దబావమరిది శివప్రకాశ్ రెడ్డి
- అదే విషయాన్ని మీడియాకు చెప్పిన అప్పటి టీడీపీ మంత్రి ఆదినారాయణ రెడ్డి
- అవినాశ్ రెడ్డికి ఫోన్ చేసింది కూడా శివప్రకాశ్ రెడ్డే... దాంతో అక్కడకు అవినాశ్
- అప్పటికే అక్కడ వివేకా పీఏ కృష్ణారెడ్డి సహా పలువురు వ్యక్తులు
- డ్రైవర్ తనను కొట్టాడంటూ రక్తపు మరకలతో వివేకా రాసిన లేఖ కృష్ణారెడ్డి చేతిలో..
- ఆ లేఖను, ఫోన్‌ను రహస్యంగా ఉంచాలని, ఎవ్వరికీ ఇవ్వవద్దని చెప్పిన సునీత
- ఆ లేఖ బయటపెట్టి ఉంటే అది హత్యేనని అప్పటికప్పుడే తెలిసేది

4లో


ఏది నిజం?

వచ్చే నెలలో ఉద్యోగుల బదిలీలు

- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకూ అవకాశం
- పెండింగ్ డీఏలకు సంబంధించి ఈ నెలలో ఉత్తర్వులు
- ఉద్యోగుల సమస్యలపై సీఎం జగన్ సానుకూల స్పందన
- ఏపీజీఈఎఫ్ చైర్మన్ వెంకట రామిరెడ్డి వెల్లడి

2లో

స్టీల్‌ప్లాంట్ ఈఓఐకు 29 బిడ్లు



విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రతిపాదించిన ఆసక్తి వ్యక్తీకరణ(ఈఓఐ) గడువు ముగిసింది. మొత్తం 29 బిడ్లు దాఖలైనట్లు సమాచారం. అయితే.. ఈఓఐ ప్రక్రియలో పాల్గొంటామని ఇటీవల ప్రకటించి హడావుడి చేసిన తెలంగాణ ప్రభుత్వం చివరికి ఈ బిడ్‌లో పాల్గొనలేదు. ఇందుకు గల కారణాలను తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెల్లడించలేదు.

2లో

'మార్గదర్శి'లో కొనసాగుతున్న సోదాలు

- వరుసగా రెండో రోజూ 7 బ్రాంచీల్లో తనిఖీలు
- 15 అంశాలకు సంబంధించి అవకతవకలు గుర్తింపు

- వివరాలు 10లో



ఏలూరు మార్గదర్శి కార్యాలయంలో సోదాలు చేస్తున్న సీఐడీ అధికారులు



ప్రపంచంలో అత్యధిక 'ఓటర్లు' మనకే ఉన్నారు..!

ప్రజలందరి నమ్మకం మీపైనే..

- సీఎం జగన్‌కు ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు ప్రశంసలు
- నౌపడ సభలో సీఎం ప్రసంగం అత్యద్భుతమంటూ ట్వీట్



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు ప్రశంసలు కురిపించారు. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి మూలస్తంభమైన మూలపేట పోర్టుకు బుధవారం శంకుస్థాపన చేసిన తర్వాత.. సీఎం జగన్ నౌపడలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆ ప్రసంగాన్ని వైఎస్సార్‌సీపీ ట్విట్టర్‌లో పోస్టు చేసింది. దానిని అంబటి రాయుడు రీట్వీట్ చేస్తూ.. 'మన సీఎం వైఎస్ జగన్ ప్రసంగం అత్యద్భుతం. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ పూర్తిగా నమ్మేది, విశ్వసించేది మిమ్మల్నే సర్' అంటూ కొనియాడారు.

నేడు 48 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 48 మండలాల్లో శుక్రవారం తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురువారం ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని 14 మండలాల్లో, విజయనగరం జిల్లాలో 9, గుంటూరు జిల్లాలో 7, కాకినాడ జిల్లాలో 7, కృష్ణాలో 4, ఎన్టీఆర్‌లో 4, అల్లూరి సీతారామరాజు, పల్నాడు, విశాఖపట్నం జిల్లాల్లో ఒక్కొక్క మండలం చొప్పున తీవ్ర వడగాడ్పులు వీస్తాయని పేర్కొన్నారు. గురువారం అనకాపల్లి జిల్లాలో 8, విజయనగరంలో ఒక మండలంలో తీవ్ర వడగాడ్పులు వీచాయని, మరో 51 మండలాల్లో వడగాడ్పులు నమోదైనట్లు చెప్పారు. గురువారం తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలంలోని రాయలచెరువులో 44.7 డిగ్రీలు, నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని నందవరం 44.6, విజయనగరం జిల్లా నెల్లిమర్లలో 44.5, చిత్తూరు జిల్లాలోని నింద్రలో 44.3, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వేపినాపి, అక్కమాంబపురంలలో 44.3 డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

'పోలవరం'ను పరిశీలించిన కేంద్ర జల్‌శక్తి, పీపీఏ బృందం



ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న కేంద్ర జల్‌శక్తి, పీపీఏ బృందం సభ్యులు

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను కేంద్ర జల్‌శక్తి, పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. కేంద్ర జల్‌శక్తి అండర్ సెక్రటరీ సతీష్‌కుమార్, అసిస్టెంట్ సెక్షన్ అధికారి రామన్ చంబర్, పీపీఏ సీఈవో శివనందన్‌కుమార్, సభ్యులు ఎం.రఘురామ్, పి.దేవేందర్‌లు ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన చేశారు. తూర్పుగోదావరి జిల్లా అంగలూరు వద్ద నిర్మాణంలో ఉన్న నేవిగేషన్ సిస్టమ్‌కు సంబంధించిన పనులను, టన్నెల్ నిర్మాణం, కాలువల తవ్వకం పనులను పరిశీలించారు. పి.రెగ్యులేటర్ పనులను కూడా పరిశీలించి జలవనరులశాఖ అధికారులను అడిగి పనులు జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. వీరికి ప్రాజెక్టు పనుల వివరాలను పోలవరం ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి, సీఈ సుధాకర్‌బాబు, ఎస్‌ఈ నరసింహమూర్తి వివరించారు.

వచ్చే నెలలో ఉద్యోగుల బదిలీలు: కాకర్ల



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏపీజీఈఎఫ్) చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన సీఎంను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పెండింగ్ డీఏలకు సంబంధించి ఈ నెలలో ఉత్తర్వులు జారీ చేస్తామని సీఎం హామీ ఇచ్చారని చెప్పారు. మేలో ఉద్యోగుల సాధారణ బదిలీలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సీఎంవో అధికారులను ఆదేశించారని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు కూడా ఈ బదిలీల్లో అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

నేడు నెలవంక కనబడితే 22న రంజాన్ పండుగ

సాక్షి, హైదరాబాద్: శుక్రవారం నెలవంక కనిపిస్తే శనివారం రంజాన్ ఉంటుందని, లేని పక్షంలో ముస్లింలు ఆదివారం పండుగను జరుపుకోవాలని రుహియతే హిలాల్ కమిటీ ప్రతినిధి ముఫ్తీ మహ్మద్ ఖలీల్ అహ్మద్ చెప్పారు. రుహియతే హిలాల్ కమిటీ (నెలవంక నిర్ధారణ కమిటీ) శుక్రవారం దీనిపై స్పష్టతనిస్తుందని పేర్కొన్నారు. కాగా, ఇస్లాంలో రంజాన్ చివరి శుక్రవారానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ఈ రోజు ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి దేవుని ఆశీస్సులు పొందుతారు. జుమ్మతుల్ విదాను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని అన్ని మసీదుల్లో తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రత్యేకంగా మక్కా మసీదు, పబ్లిక్ గార్డెన్స్‌లోని రాయల్ మసీదులో జుమ్మతుల్ విదా ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.

'గేటు'పై ఈనాడు అడ్డగోలు అబద్ధాలు

- 15 రోజుల్లో పులిచింతల గేటు బిగింపు పూర్తి
- అది తెలిసీ హడావిడిగా రామోజీ బురద రాతలు



ఫ్యాక్ట్‌చెక్

సాక్షి, అమరావతి: వరద ఉధృతికి కొట్టుకుపోయిన పులిచింతల గేటు బిగింపు పనులు, మరమ్మతులు తుదిదశకు చేరుకున్నాయని పసిగట్టిన 'ఈనాడు' ఆదరాబాదరగా ఓ అడ్డగోలు కథనాన్ని అచ్చేసి చంకలు గుద్దుకుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏదో ఒక వంటకాన్ని సిద్ధం చేయాలనే ఆదుర్దాతో 'పులిచింతల గేటు ఏర్పాటు ఎప్పటికి?' అంటూ బురద చల్లేందుకు ప్రయత్నించింది. మరో 15 రోజుల్లో గేటు బిగింపు పూర్తి కానుండగా 30 శాతం పనులే జరిగాయంటూ పచ్చి అబద్ధాలను ప్రచురించింది. గేట్ల బిగింపు పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి. కాలినడక వంతెన పనులు 70 శాతం పూర్తి కాగా 23 పియర్ల కాంటిలివర్ భాగంలో కాంక్రీట్ గ్రౌటింగ్ కూడా పూర్తైంది.

ఈనాడు ఆరోపణ: వరదలకు కొట్టుకుపోయిన 16వ గేటు స్థానంలో కొత్తది ఏర్పాటు, మరమ్మతుల పనులకు పరిపాలన ఆమోదం కోసం 9 నెలల సమయం పట్టింది.

వాస్తవం: ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి నిపుణుల కమిటీని నియమించింది. ప్రాజెక్టు పరిస్థితిపై సాంకేతికంగా మదింపు చేసి మిగిలిన 23 గేట్ల పనితీరును నిశితంగా పరిశీలించిన నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చింది. మిగిలిన పియర్స్ కాంటిలివర్ భాగంలో కాంక్రీట్ గ్రౌటింగ్ చేయాలని సూచించింది. కమిటీ సూచనల మేరకు జలవనరుల శాఖ రూపొందించిన అంచనాలకు ప్రభుత్వం పరిపాలన అనుమతి ఇచ్చింది. నిపుణుల కమిటీతో సమగ్ర అధ్యయనం జరిపించింది. పనులను రెండు భాగాలుగా విభజించి బెకెమ్ సంస్థకు అప్పగించారు. కాలినడక వంతెన పనులను స్వప్న కన్‌స్ట్రక్షన్స్‌కు కేటాయించారు.

ఆరోపణ: నిధులు ఇవ్వక పోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది.

వాస్తవం: గేట్లకు సంబంధించి రూ.1.59 కోట్లు, కాలినడక వంతెన పనులకు సంబంధించి రూ.1.29 కోట్ల బిల్లులను ప్రభుత్వం త్వరలో చెల్లించనుంది.

ఆరోపణ: గేటు తయారీ, బిగింపులో ఆలస్యం జరుగుతోంది.

వాస్తవం: గేటు తయారీలో అతి ప్రధానమైన ట్రూనియన్ బుష్ బేరింగ్‌లను జపాన్ నుంచి ప్రభుత్వం దిగుమతి చేసుకుంది. గేటును పియర్స్‌కు బిగించడానికి అవసరమైన కాంక్రీట్ పనులు 90 శాతం పూర్తయ్యాయి. క్యూరింగ్‌కు 15 రోజులు పడుతుంది. గేటు తయారీ పూర్తయింది. మిగిలిన పియర్స్ కాంటిలివర్ భాగంలో కాంక్రీట్ గ్రౌటింగ్ పూర్తయింది. 15 రోజుల్లో గేటు బిగింపు పూర్తి కానుండగా 'ఈనాడు' 30 శాతం పనులే పూర్తయినట్లు అవాస్తవాలు అచ్చేసింది. కాలినడక వంతెన పనుల్లో కూడా 70 శాతం (16వ గేటు వరకూ) పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. లీకేజీలకు అడ్డుకట్ట వేయడానికి ప్రతి గేటుకు స్టాప్‌లాగ్ గేటు అమర్చి రబ్బర్ సీళ్లను అమర్చే పనులు చేపట్టారు. ప్రణాళికాబద్ధంగా వాటిని పూర్తి చేసి ఈ సీజన్‌లో పూర్తి సామర్థ్యం మేరకు 45.77 టీఎంసీలను నిల్వ చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

వడివడిగా 'వెలిగొండ'

▶ మొదటి పేజీ తరువాయి

నీటిని విడుదల చేయడానికి వీలుగా హెడ్ రెగ్యులేటర్ పనులను వేగవంతం చేసింది. తూర్పు ప్రధాన కాలువను నల్లమలసాగర్‌తో అనుసంధానం చేస్తూ 150 మీటర్ల పొడవున సొరంగం పనులను ఇటీవలే పూర్తిచేసిన ప్రభుత్వం.. హెడ్ రెగ్యులేటర్ నిర్మాణ పనులకూ శ్రీకారం చుట్టింది. యుద్ధప్రాతిపదికన తొలిదశ పనులను పూర్తిచేసి.. ఈ ఏడాది నల్లమలసాగర్‌కు శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను తరలించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వడివడిగా అడుగులేస్తున్నారు.

చంద్రబాబు వెలి'గొండంత' దోపిడీ

విభజన నేపథ్యంలో 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. వెలిగొండ ప్రాజెక్టును దోపిడీకి అడ్డాగా మార్చుకున్నారు. అప్పటి నుంచి 2019 వరకు రూ.1,414.51 కోట్లు ఖర్చుచేసినా పనుల్లో ఎలాంటి ప్రగతి కన్పించకపోవడమే ఇందుకు నిదర్శనం. జీఓ–22 (ధరల సర్దుబాటు), జీఓ 63 (పనుల పరిమాణం ఆధారంగా బిల్లుల చెల్లింపు)ను వర్తింపజేసి.. కాంట్రాక్టర్లకు ఉత్తినే రూ.650 కోట్లకు పైగా దోచిపెట్టారు. 2017 నాటికే వెలిగొండను పూర్తిచేస్తామని ప్రకటించి.. టీబీఎంల మరమ్మతుల కోసం కాంట్రాక్టర్లకు రూ.66.44 కోట్లను ఇచ్చేసి, కమీషన్లు దండుకున్నారు. మళ్లీ 2018, 2019 నాటికి పూర్తిచేస్తామన్న చంద్రబాబు.. కమీషన్లు వసూలుచేసుకుని, ప్రాజెక్టు పనులను గాలికొదిలేశారు.

సీఎం జగన్ హయాంలో వడివడిగా..

మహానేత వైఎస్ చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసే దిశగా సీఎం వైఎస్ జగన్ ఆది నుంచి చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్నారు. మొదటి సొరంగం పనుల్లో మిగిలిన 2.883 కిమీల పనులను 2019, నవంబర్‌లో ప్రారంభించి.. కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ 2021, జనవరి 13 నాటికి పూర్తి చేయించారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి మొదటి సొరంగం ద్వారా నల్లమలసాగర్‌కు నీటిని విడుదల చేసే హెడ్ రెగ్యులేటర్ పనులను పూర్తిచేయించారు.



రెండో టన్నెల్‌ను తవ్వుతున్న కార్మికులు

- రెండో సొరంగంలో మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని 2019 ఎన్నికలకు ముందు పెంచేసిన చంద్రబాబు.. వాటిని అధిక ధరలకు సీఎం రమేష్‌కు కట్టబెట్టి, ప్రజాధనాన్ని దోచిపెట్టారు. కానీ, సీఎం జగన్ వీటిని రద్దుచేసి.. రివర్స్ టెండరింగ్ నిర్వహించారు. రూ.61.76 కోట్లు తక్కువకు పూర్తిచేసేందుకు ముందుకొచ్చిన మేఘా సంస్థకు పనులు అప్పగించారు.
- రెండో సొరంగంలో టీబీఎంకు కాలంచెల్లడంతో రోజుకు ఒక మీటర్ పని జరగడం కష్టంగా మారింది. దీంతో.. మనుషుల ద్వారా పనులు చేయించాలని అధికారులకు సీఎం జగన్ చెప్పడంతో అక్కడ మనుషులతో సొరంగాన్ని తవ్విస్తున్నారు.
- ఇక 2022–23లో రెండో సొరంగంలో 5.52 కిమీల పొడవున సొరంగం తవ్వారు. ఇది వెలిగొండ ప్రాజెక్టు చరిత్రలో రికార్డని ఆ పనులను పర్యవేక్షిస్తున్న ఏఈ అనుదీప్ 'సాక్షి'కి చెప్పారు. ప్రస్తుతం రోజుకు 12 మీటర్ల మేర పనులు చేస్తున్నామని.. ఆగస్టు నాటికి రెండో సొరంగంలో మిగిలిన 1.889 కిమీల పనులను పూర్తిచేస్తామన్నారు.
- మరోవైపు.. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి సొరంగాల ద్వారా విడుదల చేసిన నీటిని నల్లమలసాగర్‌కు తరలించేందుకు 23 కిమీల పొడవున తవ్విన ఫీడర్ ఛానల్‌ను పటిష్ఠం చేసే పనులను చేపట్టామని.. ఆగస్టు నాటికి వాటిని పూర్తిచేస్తామని ఆ పనులను పర్యవేక్షిస్తున్న డీఈ ఆవుల లక్ష్మి చెప్పారు.
- అలాగే, నల్లమలసాగర్ నుంచి తీగలేరు కెనాల్, తూర్పు ప్రధాన కాలువకు నీటిని విడుదలచేసే హెడ్ రెగ్యులేటర్ పనులు ఆగస్టు నాటికి పూర్తిచేస్తామని ఈఈ రమణ తెలిపారు.

పునరావాసం పనులు వేగవంతం

నల్లమలసాగర్‌లో 11 గ్రామాలు ముంపుకు గురవుతాయి. వీటిల్లోని 7,318 నిర్వాసిత కుటుంబాల్లో ఇప్పటికే 96 కుటుంబాలకు పునరావాసం కల్పించారు. మిగతా 7,222 నిర్వాసిత కుటుంబాలకు రూ.868.27 కోట్లతో పునరావాసం కల్పించే పనులను వేగవంతం చేశారు. అలాగే, వెలిగొండ ప్రాజెక్టు కోసం 24,158.56 ఎకరాల భూమి అవసరం. ఇందులో ఇప్పటికే 20,760.47 ఎకరాల భూమిని సేకరించారు. మిగిలిన భూమిని సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రాజెక్టు పనులకు ఇప్పటిదాకా రూ.679.79 కోట్లను వ్యయంచేసి.. పనులను సీఎం వైఎస్ జగన్ పరుగులు పెట్టిస్తున్నారని అధికార వర్గాలు చెబుతున్నాయి.

వెలి'గొండంత' చిత్తశుద్ధి..

వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లోని వర్షాభావ ప్రాంతాల్లో 4,47,300 ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడంతోపాటు.. అక్కడి 30 మండలాల్లోని 15.25 లక్షల మంది దాహార్తిని శాశ్వతంగా తీర్చవచ్చు. అందుకే ఈ ప్రాజెక్టును ఆ మూడు జిల్లాల ప్రజల వరదాయినిగా అభివర్ణిస్తారు.

- నిజానికి.. 1996లో లోక్‌సభ మధ్యంతర ఎన్నికల్లో గట్టెక్కేందుకు ఆ ఏడాది మార్చి 5న గొట్టిపడియ వద్ద నాటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేసినా పనులు చేపట్టలేదు.
- పైగా.. 1995 నుంచి 2004 వరకూ ఈ ప్రాజెక్టుకు కేవలం రూ.పది లక్షలు మాత్రమే ఖర్చుచేశారు. అదీ శంకుస్థాపన సభ కోసమే.
- 2004లో మహానేత వైఎస్సార్ అధికారంలోకి వచ్చాక.. ఈ ప్రాజెక్టును జలయజ్ఞంలో చేపట్టారు.
- శ్రీశైలం నుంచి నల్లమలసాగర్‌కు రోజుకు 3,001 క్యూసెక్కులు తరలించేందుకు ఒక సొరంగం తవ్వేలా 1994లో డీపీఆర్‌ను మహానేత వైఎస్ సమూలంగా మార్చేశారు. కృష్ణా నదిలో వరద ప్రవాహం రోజులు తగ్గిన నేపథ్యంలో.. రోజుకు 11,583 క్యూసెక్కులు తరలించేలా రెండు సొరంగాలు తవ్వేందుకు డీపీఆర్‌ను తయారుచేయించారు.
- ఇలా శ్రీశైలానికి వరద వచ్చే 43 రోజుల్లోనే వెలిగొండలో అంతర్భాగమైన నల్లమలసాగర్‌ను నింపాలన్నది మహానేత వైఎస్ ఆలోచన.
- జలయజ్ఞంలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టుకు రూ.3,581.57 కోట్లు ఖర్చుచేసి.. నల్లమలసాగర్‌తో పాటు సొరంగాల్లో సింహభాగం పనులు పూర్తిచేయించారు. సొరంగాలను నల్లమలసాగర్‌ను అనుసంధానం చేసేలా 23 కిమీల పొడవున 11,585 క్యూసెక్కులను తరలించేందుకు ఫీడర్ ఛానల్ పనులను చేయించారు. తీగలేరు కెనాల్, తూర్పు ప్రధాన కాలువ, గొట్టిపడియ కెనాల్ పనులను చేపట్టారు.

ఇంజినీరింగ్ అద్భుతం..

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కొల్లంవాగు ద్వారా రోజుకు 11,583 క్యూసెక్కులు తరలించేలా కొల్లంవాగు కుడివైపున ఉన్న కొండను తొలచి, 2 సొరంగాలు (టన్నెల్–1 ద్వారా 3,001 క్యూసెక్కులు, టన్నెల్–2 ద్వారా 8,582 క్యూసెక్కులు) తవ్వి.. ప్రకాశం జిల్లాలో పశ్చిమాన నల్లమల పర్వతశ్రేణుల్లో కొండల మధ్య ఖాళీ ప్రదేశాలను కలుపుతూ కాంక్రీట్ డ్యామ్‌లు నిర్మించడం ద్వారా 53.85 టీఎంసీలు నిల్వచేసేలా నల్లమలసాగర్ సహజసిద్ధంగా రూపుదిద్దుకుంటోంది. ఇది ఇంజినీరింగ్ అద్భుతంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఇక్కడ తవ్వుతున్న సొరంగాలు ఆసియాలోనే అతిపెద్ద నీటిపారుదల సొరంగాలు.

వెలిగొండ ప్రాజెక్టు సొరంగాల తవ్వకం పనులు ఇలా..

టన్నెల్	పొడవు (కిమీలలో)	2004-2014 మధ్య		2014-19 మధ్య		2019 నుంచి		మిగిలిన పని	
		పొడవు (కి.మీ.)	వ్యయం (రూ.కోట్లు)	పొడవు (కి.మీ.)	వ్యయం (రూ.కోట్లు)	పొడవు (కి.మీ.)	వ్యయం (రూ.కోట్లు)	పొడవు (కి.మీ.)	వ్యయం (రూ.కోట్లు)
టన్నెల్-1	18.800	11.586	469.37	4.331	284.36	2.883	181.47	-------	10.00
(రోజుకు సగటున తవ్వకం మీటర్లలో)		5.53		2.41		4.12			
టన్నెల్-2	18.800	8.747	410.30	2.355	136.37	5.809	183.09	1.889	335.00
(రోజుకు సగటున తవ్వకం మీటర్లలో)		4.79		1.31		4.30			

నోట్: వెలిగొండ ప్రాజెక్టు మొదటి సొరంగం తవ్వకం పనులు 2021, జనవరి 13న పూర్తయ్యాయి.

ఈ ఏడాదే తొలిదశ పూర్తి



ఈ ప్రాజెక్టు తొలిదశను ఈ ఏడాదే పూర్తిచేసేందుకు పనులను వేగవంతం చేశాం. ఇప్పటికే తొలి సొరంగం పూర్తయింది. ఫీడర్ ఛానల్ సిద్ధంగా ఉంది. నల్లమలసాగర్ పూర్తయింది. నిర్వాసితులకు పునరావాసం కల్పించి.. సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు ఈ ఏడాది పది టీఎంసీలను నల్లమలసాగర్‌లో నిల్వచేస్తాం. ఆ తర్వాత 30 టీఎంసీలు.. చివరగా 53.85 టీఎంసీలను నిల్వచేస్తాం.

– సి. నారాయణరెడ్డి, ఈఎన్‌సీ

మహానేత ముందుచూపునకు నిదర్శనం

శ్రీశైలంలో 840 అడుగుల నీటి మట్టం నుంచే సొరంగాల ద్వారా వెలిగొండ ప్రాజెక్టులో అంతర్భాగమైన నల్లమలసాగర్‌కు నీటిని తరలించవచ్చు. 879 అడుగుల స్థాయిలో శ్రీశైలంలో నీరునిల్వ ఉంటే.. పూర్తి సామర్థ్యం మేరకు రోజుకు 11,583 క్యూసెక్కులను నల్లమలసాగర్‌కు తరలించవచ్చు. శ్రీశైలానికి వరద వచ్చే 40–43 రోజుల్లోనే నల్లమలసాగర్‌ను నింపేలా ప్రాజెక్టు డిజైన్‌ను మార్చడం మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముందుచూపునకు తార్కాణం.

– మురళీనాథ్‌రెడ్డి, సీఈ, ప్రకాశం జిల్లా

సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధివల్లే..

ముఖ్యమంత్రి జగన్ చిత్తశుద్ధివల్లే వెలిగొండ ప్రాజెక్టు పూర్తవుతోంది. టీబీఎంలకు కాలం చెల్లడం, కన్వేయర్ బెల్ట్‌లు పనిచేయకపోవడంవల్ల సొరంగాల తవ్వకం 2014 నుంచి ముందుకు కదల్లేదు. మనుషుల ద్వారా సొరంగాలను తవ్వాలని సీఎం జగన్ నిర్ణయంవల్లే ఇప్పుడు ఆ పనులు పూర్తవుతున్నాయి. 2022–23లో రెండో సొరంగంలో 5.52 కిమీల పొడవున తవ్వాం. ప్రాజెక్టు చరిత్రలో ఇదో రికార్డు.

– అబూ తలీమ్, ఎస్‌ఈ

స్టీల్‌ప్లాంట్ ఈఓఐకు 29 బిడ్లు

బిడ్ దాఖలు చేయని 'సింగరేణి'

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రతిపాదించిన ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) గడువు గురువారం ముగిసింది. గడువు ముగిసేసరికి మొత్తం 29 బిడ్లు దాఖలైనట్లు సమాచారం. స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన ముడి వనరులు (ఐరన్ ఓర్, కోకింగ్ కోల్) ఇవ్వడం ద్వారా స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులను తీసుకోవడం.. వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వడం ద్వారా స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులను తీసుకోవడంపై ఆసక్తి కలిగిన సంస్థల నుంచి మార్చి 27న బిడ్‌లను ఆహ్వానించారు. ఏప్రిల్ 15 నాటికి 22 సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. మరికొన్ని సంస్థల విజ్ఞప్తి మేరకు గడువును ఈనెల 20 వరకు పొడిగించారు. ఇండో ఇంటర్‌ట్రేడ్ ఏజి (స్విట్జర్లాండ్), ఇండో ఇంటర్నేషనల్ ట్రేడింగ్ (దుబాయ్), ఐఎంఆర్ మెటలర్జికల్ రిసోర్సెస్, సూరజ్‌మల్ బైజ్‌నాథ్ ప్రైవేట్ లిమిటెడ్ (కోల్‌కతా), జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లిమిటెడ్ (ముంబై), వీసర్ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ముంబై), టీయూఎఫ్ గ్రూప్ (ఢిల్లీ), జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ (అంగుల్), అగోరా పార్టనర్స్ (న్యూఢిల్లీ), శ్రీ సత్యం ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్‌బీ ఇంటర్నేషనల్ (డల్లాస్), టాటా ఇంటర్నేషనల్ లిమిటెడ్, ఐరోపా ఇంపోర్ట్, ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్, హెచ్‌ఎస్ కోడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, గ్లోబల్ సాఫ్ట్ లిమిటెడ్ (సింగపూర్), వెన్స్‌ప్రా ఇంపెక్స్ (విజయవాడ), ఎలిగెం మెటల్స్ అండ్ మినరల్స్, ఎల్‌కే శ్రీ ఎంటర్‌ప్రైజెస్ (ముంబై), ఎరోగ్లోబల్ కామ్‌ట్రేడ్ ప్రైవేట్ లిమిటెడ్ (భువనేశ్వర్), ఎవాన్ స్టీల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (లుథియానా), వదిం నోవిన్‌స్కై అలెగ్జాండ్రా, రూటేజ్ ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (బెంగళూరు) తదితర సంస్థలు బిడ్‌లు దాఖలు చేశాయి.

నాడు దూకుడుగా.. నేడు దూరంగా 'తెలంగాణ'

విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించడంలో భాగంగా ఈఓఐ ప్రక్రియలో పాల్గొంటామని ఇటీవల ప్రకటించి హడావుడి చేసిన తెలంగాణ ప్రభుత్వం చివరికి ఈ బిడ్‌లో పాల్గొనలేదు. సింగరేణి బొగ్గు గనుల సంస్థగానీ, మరే ఇతర రాష్ట్ర ప్రభుత్వ శాఖ/సంస్థ గానీ బిడ్ దాఖలు చేయలేదు. ఈ విషయంలో ఆ రాష్ట్ర తీరు ఏపీ, తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను కూడా వేడెక్కించింది. కానీ, ఆ తర్వాత విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆలోచనలేదని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి ప్రకటించగా, తమ ఒత్తిడితోనే కేంద్రం వెనక్కి తగ్గిందని బీఆర్‌ఎస్ పార్టీ నేతలు విస్తృతంగా ప్రకటనలు చేశారు. 'కేసీఆర్ దెబ్బ అట్లుంటది' అని కేటీఆర్.. 'కేసీఆర్ పోరాటంతో కేంద్రం దిగొచ్చింది' అని హరీశ్‌రావు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఆ వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోలేదని కేంద్ర ప్రభుత్వం మరో ప్రకటన చేయడంతో రాజకీయం ఆసక్తికరంగా మారింది. చివరికి.. ఈఓఐ ప్రక్రియకు తెలంగాణ బిడ్ దాఖలు చేయకపోవడం గమనార్హం. బిడ్డింగ్‌లో పాల్గొనకపోవడానికి కారణాలను తెలంగాణ సర్కారు కానీ, సింగరేణి యాజమాన్యం కానీ వెల్లడించలేదు.

సకల సౌకర్యాలతో అంగన్‌వాడీలు

▶ మొదటి పేజీ తరువాయి

సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నాడు–నేడు పనుల పురోగతిపై ఆరా తీశారు. ఫౌండేషన్ స్కూళ్లుగా మారిన సుమారు 10 వేలకు పైగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పనులు జరుగుతున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. మిగిలిన సుమారు 45 వేల అంగన్‌వాడీల్లో కూడా వచ్చే మూడేళ్లలో ప్రాధాన్యతాక్రమంలో పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. అయితే అప్పటిలోగా వీటిలో ఏవైనా మరమ్మతులు ఉంటే చేపట్టాలన్నారు. ప్రస్తుతం వాటిలో ఏయే సౌకర్యాలున్నాయి.. ఇంకా ఏయే సదుపాయాలు కావాలనే పూర్తి సమాచారాన్ని గ్రామ సచివాలయాల ద్వారా తెప్పించుకోవాలని చెప్పారు. ప్రధానంగా ఫ్యాన్లు, లైట్లు, ఫర్నీచర్, టాయిలెట్ల వంటి సౌకర్యాల గురించి వాకబు చేయాలన్నారు. పూర్తి సమాచారంతో ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలతో తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

సమర్థవంతంగా నిర్వహణ

అంగన్‌వాడీ కేంద్రాల్లో సంపూర్ణ పోషణ పంపిణీ ప్రక్రియకు సంబంధించి సమర్థవంతమైన నిర్వహణ పద్ధతి(ఎస్‌ఓపీ) రూపొందించాలని సీఎం ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్లు ఎంత పకడ్బందీగా పంపిణీ చేస్తున్నామో 'సంపూర్ణ పోషణ' పంపిణీ కూడా అంతే సమర్థవంతంగా ఉండాలని చెప్పారు. ఇందుకోసం అంగన్‌వాడీలపై పర్యవేక్షణ పెరగాలన్నారు. ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలిస్తూ అక్కడి పరిస్థితులు మెరుగు పరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ చూడాల్సిన సూపర్‌వైజర్లపై కూడా పకడ్బందీ పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆదేశించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖలో ఉన్న ఖాళీలను కూడా భర్తీ చేయాలని చెప్పారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, సంచాలకులు ఎం.విజయ సునీత, ఆర్థిక శాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ (మౌలిక సదుపాయాలు) కాటమనేని భాస్కర్, పౌర సరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వీర పాండియన్, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోపరేటివ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అహ్మద్ బాబు పాల్గొన్నారు.




సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

బీసీలుగా తోలు బొమ్మలాట కులస్తులు

సాక్షి, అమరావతి: ఏపీలో తోలు బొమ్మలాటలు ఆడించే వారిని కులంగా గుర్తించి.. వారిని బీసీ జాబితాలో చేరుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఉమ్మడి ఏపీ నుంచి ఈ తరహా వృత్తిని కొనసాగించే వారిని 'ఆరే–మరాఠి', మరాఠ (బ్రాహ్మణేతరులు), అరకాలీస్, సురభి నాటకాల వాళ్లుగా బీసీ–బీలో ఉపకులాలుగా పేర్కొన్నారు. వీరి తరహాలోనే తోలు బొమ్మలాటలు వేస్తూ ఉపాధి పొందుతున్న వారిని కూడా కులంగా గుర్తించాలనే డిమాండ్ ఉంది. సీఎం వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు పాదయాత్ర సమయంలో తోలుబొమ్మలాట వారిని కులంగా గుర్తించాలనే విజ్ఞాపనలు వచ్చాయి. దీనిపై స్పందించిన సీఎం తాజాగా నిర్ణయం తీసుకున్నారు. బీసీ జాబితాలోని 'బి' గ్రూపులో సీరియల్ నంబర్ 25లో ఉన్న ఆరే–మరాఠి', మరాఠ (బ్రాహ్మణేతరులు), అరకాలీస్, సురభి నాటకాల వాళ్ల కులాలకు పర్యాయపదంగా 'తోలుబొమ్మల వాళ్లు' కులంగా ఇక నుంచి పరిగణించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయంపై సంచార జాతుల కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో గురువారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	44.2	25.6
అనంతపురం	43.2	22.6
మార్కాపురం	43.0	26.0
కడప	42.1	23.0
కర్నూలు	42.0	28.3
విజయవాడ	41.0	27.0
తిరుపతి	41.0	27.0
రాజమహేంద్రవరం	40.5	26.0
ఏలూరు	40.0	27.0
నెల్లూరు	40.0	26.7
అనకాపల్లి	40.0	25.5
శ్రీకాకుళం	40.0	24.0
విశాఖపట్నం	39.2	24.6
విజయనగరం	39.0	29.0
తెలంగాణలో..		
ఆదిలాబాద్	42.3	26.2
రామగుండం	40.2	22.6
హైదరాబాద్	38.0	27.0

పాలిసెట్ ఎంట్రన్స్‌కు ఫ్రీ కోచింగ్

ఇప్పటికే తొలి బ్యాచ్ శిక్షణ ప్రారంభం.. ఈ నెల 24 నుంచి రెండో బ్యాచ్

సాక్షి, అమరావతి: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించిన పాలిసెట్–2023 ఎంట్రన్స్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే పాలిసెట్ తొలివిడత కోచింగ్ ఈ నెల 17న ప్రారంభించగా.. 24వ తేదీ నుంచి మరో బ్యాచ్ ప్రారంభిస్తున్నామని తెలిపారు. శిక్షణ పొందిన ప్రతి విద్యార్థికి ఇంగ్లిష్, తెలుగు మీడియంలలో ఉచిత స్టడీ మెటీరియల్ కూడా అందిస్తున్నారు.



మే 10న పాలిసెట్

మే 10న రాష్ట్రవ్యాప్తంగా 61 పట్టణాల్లోని 410 కేంద్రాల్లో పాలిసెట్–2023 నిర్వహిస్తున్నామని నాగరాణి పేర్కొన్నారు. పరీక్షకు సుమారు 1.50 లక్షల మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన టెన్త్ సిలబస్ నుంచి గణిత శాస్త్రంలో 50 మార్కులు, భౌతిక శాస్త్రంలో 40 మార్కులు, రసాయన శాస్త్రంలో 30 మార్కులు మొత్తం కలిపి 120 మార్కులకు రెండు గంటల కాల పరిమితిలో పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400, ఎస్టీ, ఎస్సీ విద్యార్థులు రూ.100 ప్రవేశ రుసుమును సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో లేదా https://polycetap.nic.in వెబ్‌సైట్ ద్వారా ఏప్రిల్ 30వ తేదీ సాయంత్రం 5గంటల లోపు చెల్లించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 84 ప్రభుత్వ, 176 ప్రైవేట్ పాలిటెక్నిక్‌లతోపాటు ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా ప్రారంభిస్తున్న బేతంచర్ల (నంద్యాల జిల్లా), మైదుకూరు (కడప జిల్లా), గుంతకల్లు (అనంతపురం జిల్లా) ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో ప్రవేశాలు పొందగలుగుతారని వివరించారు. బాలికల కోసం ప్రత్యేకంగా 10 ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లు, 2 మైనారిటీ పాలిటెక్నిక్‌లు.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం 9 ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్‌లను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు.

స్కాలర్‌షిప్ సదుపాయమూ ఉంది

అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.50 వేల చొప్పున మూడు సంవత్సరాల ప్రగతి స్కాలర్‌షిప్ లభిస్తుందని నాగరాణి పేర్కొన్నారు. పాలిసెట్–2023 ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులందరికీ స్కాలర్ షిప్ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన ద్వారా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు హెల్ప్‌లైన్ నంబర్లు 08645293151, 7901620551/557/567లలో సంప్రదించాలని సూచించారు.

మే 28 నుంచి ఏపీపీజీఈసెట్


మాట్లాడుతున్న సత్యనారాయణ

తిరుపతి కల్చరల్: ఏపీలోని ఎంటెక్, ఎం.ఫార్మసీ, ఫార్మ్–డీ కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీపీజీఈసెట్)ను మే 28 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, సెట్ కన్వీనర్ ఆర్‌వీ సత్యనారాయణ చెప్పారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ పరీక్షలు జియో ఇంజినీరింగ్, జియో ఇన్ఫర్మేటిక్స్, ఫార్మసీ, సీఎస్ఐటీ, ఈసీఈ, బయో టెక్నాలజీ, సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఫుడ్ టెక్నాలజీ, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్, కెమికల్ ఇంజినీరింగ్, నానో టెక్నాలజీ ఇలా 13 సబ్జెక్టుల్లో ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో 19,000 సీట్లు ఉన్నాయని అర్హులైన వారు అపరాధ రుసుం లేకుండా ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు రుసుం ఓబీసీలకు రూ.1,200, బీసీలకు రూ.900, ఎస్సీ, ఎస్టీలకు రూ.700 అని తెలిపారు. అపరాధ రుసుంతో మే 14 లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అంధులు, బధిరుల విద్యాలయాల్లో అడ్మిషన్లు

497 సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అంధులు, బధిరుల విద్యాలయాల్లో సీట్ల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంధులు, బధిరులకు సంబంధించిన 6 ఆశ్రమ పాఠశాలలు, ఒక ప్రభుత్వ బధిరుల జూనియర్ కాలేజీలో 497 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అర్హత కలిగిన వారికి 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తామని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సంచాలకుడు బి.రవిప్రకాశ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విద్యాలయాల్లోనే నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలిపారు. విద్యార్థి వయసు ఐదేళ్లకు పైబడి ఉండాలని.. ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు జత చేసి దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. ఆయా విద్యాలయాల్లో ప్రభుత్వం ఉచిత విద్యతో పాటు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ యూనిఫాం, ఉచిత భోజనం, వైద్య సౌకర్యం, హాస్టల్ వసతి, కంప్యూటర్ శిక్షణ కల్పిస్తుందని తెలిపారు. విద్యార్థులకు బ్రెయిలీ లిపి, సాంకేతిక భాష నేర్పిస్తారని పేర్కొన్నారు.

వివిధ స్కూళ్లు, కాలేజీలో తరగతుల వారీగా ఖాళీల వివరాలు

పాఠశాల	తరగతులు	ఖాళీలు	సంప్రదించాల్సిన నంబర్లు
విజయనగరం అంధుల ఆశ్రమ స్కూల్	1-8 వరకు	41	9494914959, 8317548039
విశాఖ అంధుల ఆశ్రమ స్కూల్	1-10 వరకు	46	9494914959, 9014456753
హిందూపురం అంధుల ఆశ్రమ స్కూల్	1-10 వరకు	93	7702227917, 7780524716
విజయనగరం బధిరుల ఆశ్రమ స్కూల్	1- 8 వరకు	15	9440437628, 9000013640
బాపట్ల బధిరుల ఆశ్రమ స్కూల్	1-10 వరకు	150	9491795728, 9949004094
ఒంగోలు బధిరుల ఆశ్రమ స్కూల్	1-10 వరకు	127	9441943071, 9985837919
బాపట్ల బధిరుల జూనియర్ కాలేజీ	ఇంటర్ ఫస్టియర్	25	9491795728, 9949004094

టెన్త్ పరీక్షల సిబ్బందికి రెమ్యునరేషన్ పెంపు

- టెన్త్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో 26 కేటగిరీల్లో పనిచేసే వారి భృతి పెంపు
- పేపర్ సెట్టర్‌కు ఒక్కో పేపర్‌కు రూ.880 నుంచి రూ.1,320 చెల్లించేందుకు నిర్ణయం
- అనువాదకులకు ఒక్కో పేపర్‌కు రూ.770 నుంచి రూ.1,155కి పెంపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 26 కేటగిరీల్లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి చెల్లించే రెమ్యునరేషన్ పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ గురువారం ఉత్తర్వులు (జీవో 37) విడుదల చేశారు. పరీక్షల నిర్వహణతో పాటు స్పాట్ వాల్యుయేషన్ (మూల్యాంకనం)లో పాల్గొనే వారందరి రెమ్యునరేషన్‌ను ప్రభుత్వం పెంచింది.

ఎమ్మెల్సీ, పరీక్షల డైరెక్టర్ హర్షం

ఉత్తర్వులు ఇచ్చినందుకు సీఎం వైఎస్ జగన్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ఎమ్మెల్సీ టి.కల్పలత కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమ డైరెక్టరేట్ తరఫున కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి పేర్కొన్నారు. 2016 తరువాత రెమ్యునరేషన్ ఇప్పుడే పెరిగిందని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గిరిప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ నిర్ణయం పట్ల వైఎస్సార్‌టీఎఫ్ నేత జాలిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

ముఖ్య కేటగిరీల్లో రెమ్యునరేషన్ పెరుగుదల ఇలా..

కేటగిరీ	గతంలో..	పెరిగిన మొత్తం
పేపర్ సెట్టర్ (ఒక్కో పేపర్‌కు)	రూ.880	రూ.1,320
ట్రాన్స్‌లేటర్, మోడరేటర్ (ఒక్కో పేపర్‌కు)	రూ.770	రూ.1,155
జిల్లా స్థాయి పరిశీలకుడు	రూ.200	రూ.300
క్యాంప్ ఆఫీసర్	రూ.385	రూ.578
డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్	రూ.330	రూ.495
అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్	రూ.286	రూ.429
చీఫ్ ఎగ్జామినర్	రూ.264	రూ.396
స్పెషల్ అసిస్టెంట్	రూ.137.50	రూ.300
చీఫ్ కోడింగ్ ఆఫీసర్	రూ.220	రూ.330
అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్	రూ.198	రూ.297
ఎగ్జామినర్	రూ.250	రూ.375

ప్రతి మానవుడూ తాను చేసిన కర్మలకు తాకట్టుగా ఉంటాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 21 ఏప్రిల్ 2023

ఈ జనాభాతో లాభమేనా?

కొద్ది నెలలుగా రకరకాల అంచనాలు అంటున్న మాటే... అనుకుంటున్న మాటే... మళ్ళీ ఖరారైంది. ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశమనే కీర్తి ఇక భారత్‌దేనని ఈసారి ఐక్యరాజ్య సమితి నిర్ధారించింది. అంచనాలు పాతవైనా, లబ్ధప్రతిష్ఠులు మరొకరు తొలిసారి అధికారికంగా సమర్థించడం విశేషమే. అందుకే, జనసంఖ్యలో దశాబ్దాలుగా ప్రపంచంలో రెండోస్థానంలో ఉన్న భారత్... ఈ ఏడాది మధ్యకల్లా 142.8 కోట్ల జనాభాతో, 30 లక్షలకు పైగా అధిక్యంతో, 142.5 కోట్ల చైనాను దాటేసి, నంబర్ వన్ అవుతుందన్న వార్త పతాకశీర్షికలకు ఎక్కింది. 'ఐక్యరాజ్యసమితి జనాభా నిధి' (యూఎన్ఎఫ్‌పీఏ) ఈ ఏటి 'ప్రపంచ జనాభా స్థితిగతుల నివేదిక'లో ఈ సంగతి వెల్లడించింది. ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఉన్న సమాచారం మేరకు తాము ఈ అంచనా కట్టినట్టు ఐరాస బుధవారం తెలిపింది. ఇంతకీ ఈ అత్యధిక జనాభా భారత్‌కు లాభమా, నష్టమా అన్నది అసలు పెద్ద చర్చ.

జనాభాలో చైనాను భారత్ దాటేయడం 2020లలో జరుగుతుందన్నది ఎప్పటి నుంచో ఉన్న జోస్యమే. 2027లో ఇది జరుగుతుందని మొదట అంచనా. ఆ తర్వాత 2025కే జరుగుతుందని మాట సవరించారు. తీరా ఇది 2023లోనే జరిగిపోనుందని నిరుటి 'వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్' నివేదిక పేర్కొంది. తాజాగా ఐరాస జనాభా నిధి ఈ ఏడాది మధ్యకల్లా అది నిజమవుతోందని తేల్చింది. ఈ లెక్కల్ని బట్టి 804.5 కోట్ల ప్రపంచ జనాభాలో మూడో వంతు పైగా భారత, చైనాలదే. అయితే, రెండు దేశాల్లోనూ జనాభా పెరుగుదల వేగం గతంతో పోలిస్తే తగ్గుతోంది. ఆ మాటకొస్తే, 1950 నుంచి ఎన్నడూ లేని రీతిలో ఇప్పుడు ప్రపంచ జనాభా పెరుగుదల అతి తక్కువ వేగంతో సాగుతోంది. నిరుడు ఇదే ఐరాస నివేదికతో పోలిస్తే చైనా జనసంఖ్య ఒక్క ఏడాదిలో 2.3 కోట్ల మేర తగ్గింది. ఉన్నట్టుండి పడిపోయిన చైనా జనసంఖ్య వల్లే భారత్ అధిక జనాభా పట్టం దక్కుతోంది.

నిజానికి, భారత సొంత అంచనాల కన్నా ఐరాస నివేదిక తాజా జనాభా అంచనాలు కొంత ఎక్కువే. ఈ పరిస్థితుల్లో దేశంలో లెక్కకట్టి ఇందరే ఉన్నారని అసలు కథ చెప్పడం పదేళ్ళకోసారి చేసే జనగణనతో కానీ సాధ్యం కాదు. అలాగని అదీ పూర్తిగా దోషరహితమేమీ కాదు. 2011 జనగణనలోనూ ప్రతి వెయ్యి మందిలో 23 మందిని లెక్కపెట్టనే లేదట. అసలు 2011 తర్వాత మళ్ళీ ఆ గణన జరగనే లేదు. నిర్ణీత గడువైన 2021లో జరగాల్సిన జనగణన కరోనా పేరిట వాయిదా పడింది. తర్వాత అన్నీ సాధారణ స్థితికి చేరుకున్నా, కేంద్రం మాత్రం 'చేస్తాం చేస్తా'మంటూ ఊరిస్తోందే తప్ప విధాన రూపకల్పనలో అతి కీలకమైన ఈ జనగణనకు నిర్ణీత షెడ్యూల్ ప్రకటించట్లేదు. ఏర్పాట్లూ చేయట్లేదు. ఈ జాప్యం ప్రతికూల పర్యవసానాలకు దారితీసే ప్రమాదం ఉంది.

దేశపౌరులందరికీ ప్రాథమిక జీవన నాణ్యతా ప్రమాణాలను సైతం అందించడానికి ఇప్పటికీ సతమతమవుతున్న దేశానికి ఈ అధిక జనాభా ఒక రకంగా అవకాశం, మరో రకంగా సవాలు! కొందరి వాదన ప్రకారం 142 కోట్ల జనాభా అంటే అన్ని కోట్ల అవకాశాలు. 'జనసంఖ్యతో వచ్చే లబ్ధి' ఉంటుందని వారి మాట. నిజమే. జనాభాలో నూటికి 68 మంది యువత, అందులోనూ శ్రమ చేసే వయసులోని వారు కావడమనేది సానుకూలత. తద్వారా ప్రపంచంలో అతిపెద్ద శ్రామికశక్తి భారత్‌కు ఉన్నట్టవుతుంది. మరోపక్క జపాన్, దక్షిణ కొరియా లాంటి అనేక దేశాల్లో జనాభా తగ్గుతోంది. వయసు పైబడ్డ వారు పెరిగి, శ్రామికశక్తి తగ్గుతోంది! సమీప భవిష్యత్తులో ఆ దేశాల్లో శ్రామికులకు కొరత వస్తుంది. దీన్ని అందిపుచ్చుకొని, మన యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణతో ఆ దేశాల శ్రామికశక్తి అవసరాలను తీర్చాలి. అలా చేయగలిగితే అధిక జనాభా మనకు కలిసొచ్చిన అదృష్టమే.

అలాగని అధిక జనాభాతో వాటంతట అవే ప్రయోజనాలు ఊడిపడవు. ఒకదానికొకటి ముడిపడిన పలు అంశాలపై విధాననిర్ణేతలు దృష్టిపెట్టాలి. 'జనాభా లబ్ధి'కే వస్తే, 2055 వరకు... భారత్‌లో వేరొకరిపై ఆధారపడ్డ వారి వాటాతో పోలిస్తే, 15 నుంచి 64 ఏళ్ళ లోపు వయసు శ్రామికశక్తి జనాభా వేగంగా పెరగనుంది. ఈ పెరిగే జనాభాకు మెరుగైన విద్య, ఉపాధి, ఆరోగ్య, గృహవసతి కల్పన ఒక సవాలు. అంటే పెరిగే జనాభాకు తగ్గట్టు ప్రాథమిక వసతి సౌకర్యాల కల్పన ధ్యేయంగా పాలకులు నడవాలి. కూడు, గూడు, గుడ్డ లాంటి కనీస అవసరాలు తీరాక, అందరికీ ఉపాధి, వయోవృద్ధుల సంరక్షణ, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడం రెండో అంశం. ఈ ప్రజాకాంక్షలకు తగ్గట్టు ప్రభుత్వాలు అడుగులు వేయలేకపోతే అసంతృప్తి పెచ్చరిల్లుతుంది. అలాగే, కొన్నేళ్ళ తర్వాత ఇప్పటి ఈ యువ జనాభా వృద్ధులవడంతో నేటి సానుకూలత పోయి, కొత్త సమస్య వస్తుందనీ గుర్తించాలి.

సువిశాల భారతంలో సంతాన సాఫల్యతా రేటు మొత్తం మీద తగ్గుతున్నా, ప్రాంతాల్ని బట్టి తేడాలున్నాయి. నిరుపేద ఉత్తరాదిలో జనాభా వేగంగా పెరుగుతుంటే, సంపన్న దక్షిణాదిలో తగ్గుతోంది. ఫలితంగా దక్షిణాదికి వలసలింకా ఎక్కువవుతాయి. ఇది దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాలు వర్తించాలి. వలస కార్మికుల అనుకూల విధానాలు, పథకాలు చేపట్టాలి. అలాగే, మరో మూడేళ్ళలో మరోసారి నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. ఇప్పుడున్న దాని కన్నా ఉత్తరాది రాష్ట్రాల్లో జనసంఖ్య పెరుగుతున్నందున, జనాభా నియంత్రణే పాపమైనట్టు దక్షిణాది నియోజకవర్గాలు తగ్గిపోకుండా చూడాలి. ప్రాంతీయ, రాజకీయ ప్రాతినిధ్యాల్లో సమతూకం కాపాడాలి. మరోపక్క ఫలానా కులమతాల్లో జనాభా పెరుగుతోందన్న వాట్సప్ అజ్ఞాన అసత్య ప్రచారాలను సహించరాదు. జనాభా నియంత్రణకు కొత్త చట్టాల లాంటి యత్నాలూ చివరకు లింగనిష్పత్తిలో తేడాలకు కారణమవుతాయని గ్రహించాలి. వెరసి... అత్యధిక జనాభా కీర్తి మనదేశానికి ఓ ముళ్ళ గులాబీ.

'ఫిత్రా' పరమార్థం

రుజుమార్గం

పవిత్ర రమజాన్ నెలలో ఆచరించబడే అనేక సత్కార్యాల్లో 'ఫిత్రా' ఒకటి. ఫిత్రా అన్న పదం ఇఫ్తార్ నుండి వచ్చింది. ఫిత్ర్ అంటే శాబ్దిక అర్థం ఉపవాస విరమణ అన్నమాట. 'సదఖయే ఫిత్ర్' అంటే రోజా విరమణకు సంబంధించిన దానం అని అర్థం. ధర్మ శాస్త్ర పరిభాషలో 'సదఖయే ఫిత్ర్' అంటే ఉపవాస దీక్షలు పాటించేటప్పుడు జరిగిన లోపాలకు, పొరపాట్లకు పరిహారంగా రమజాన్ నెలలో విధిగా చెల్లించవలసిన దానం అన్నమాట.

రోజాలు విధిగా నిర్ణయించిన నాటినుండే ఫిత్రాలు కూడా తప్పనిసరిగా చెల్లించాలని ముహమ్మద్ ప్రవక్త (స) ఆదేశించారు. ఆ కాలంలో ప్రజలు ముఖ్య ఆహారంగా వినియోగించే పదార్థాలనే పరిగణనలోకి తీసుకొని ఫిత్రాలు చెల్లించేవారు. హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (ర) ఇలా చెప్పారు: 'ప్రవక్త వారి కాలంలో మేము ఈదుల్ ఫిత్ర్ (పండుగ) దానంగా ఒక 'సా' పరిమాణమంత పదార్థాలను ఇచ్చే వాళ్ళం. ఆ కాలంలో యవలు, ఎండు ద్రాక్ష, ఖర్జూరం, జున్ను తదితరాలు ముఖ్య ఆహార పదార్థాలుగా ఉండేవి' (సహీహ్ బుఖారీ, హ.నం 1510, సహీ ముస్లిం హ. నం 985). 'సా' అంటే పావుతక్కువ రెండు శేర్లు. మారిన కాలాన్నీ, నేటి పరిస్థితుల్నీ దృష్టిలో ఉంచుకొని ఏ రూపంలో అయినా ఫిత్రాలు చెల్లించవచ్చు. ఆహార పదార్థాలు, వస్త్రాలు, నగదు... ఏ రూపంలో అయినా సరే. ఫిత్రాల వల్ల రెండు రకాల లాభాలున్నాయి. ఒకటి... 'రోజా'లలో జరిగే పొరపాట్లకు పరిహారంగా ఈ ఫిత్రాలు ఉపయోగపడతాయి. వీటివల్ల రోజాలు పవిత్ర తను, పరిపూర్ణతను సంతరించుకొని స్వీకార భాగ్యానికి నోచుకుంటాయి. రెండు... ఫిత్రాల వల్ల సమాజంలోని పేద, బలహీనవర్గాలకు కాస్తంత ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. తద్వారా వారు కూడా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోగలుగుతారు.

అందుకే ఫిత్రాలను ఉపవాసులకే పరిమితం చేయకుండా, ఈ పరిధిని విస్తరించారు. అంటే ఉపవాసం ఉన్నా లేకపోయినా అందరూ ఫిత్రా చెల్లించాలి. కుటుంబంలో ఎంతమంది ఉంటే, వారందరి తరఫున కుటుంబ యజమాని ఫిత్రా చెల్లించాలి. పండుగ నమాజు కంటే ముందు జన్మించిన శిశువు తరఫున కూడా తల్లిదండ్రులు ఫిత్రా చెల్లించాలి. పండుగ కంటే ముందే ఈ బాధ్యత నెరవేర్చుకోవాలి. కనీసం ఈద్ నమాజుకు వెళ్ళే ముందైనా చెల్లించాలి. మూడు నాలుగు రోజుల ముందు చెల్లిస్తే లబ్ధిదారులు పండుగ సామగ్రి కొనుక్కోవడానికి వీలుగా ఉంటుంది. పండుగ సంతోషంలో అందరినీ భాగస్వాములను చేయడమే అసలు ఉద్దేశ్యం.

– మదీహా అర్జుమంద్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం,
తిథి: శు.పాడ్యమి ఉ.8.44 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** భరణి రా.11.33 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** ఉ.9.10 నుండి 10.44 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.34 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.23 నుండి 1.11 వరకు, **అమృతఘడియలు:** సా.6.44 నుండి 8.20 వరకు;
రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు,
సూర్యోదయం: 5.44, **సూర్యాస్తమయం:** 6.12.

వివేకా హంతకుల్ని నడిపిస్తున్నదెవరు?



హత్య అని తెలిస్తే మృతదేహాన్ని ఎవ్వరూ కనీసం తాకి కూడా ఉండేవారు కాదు

కావాలనే ఆ లేఖను దాచి... కథ నడిపించిన ఆదినారాయణరెడ్డి, చంద్రబాబు

- అదే సమయంలో కడప ఎస్పీకి నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ పలుమార్లు ఫోన్లు
- బీటెక్ రవితో, ఆదినారాయణరెడ్డితో కూడా సంభాషణలు : బాబుకు అప్‌డేట్
- అందుకే నాటి నుంచీ బ్యాండేజీలు, రక్తం కడిగారు అంటూ బాబు ఆరోపణలు
- గుండెపోటు కథ ఎవరిది? లేఖ ఎందుకు దాచారు? అనేవి తొక్కిపెట్టిన నాటి సర్కారు
- ఈ పచ్చ కుట్రను ఛేదిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం

ఏది నిజం?

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకానందరెడ్డికి వైఎస్సార్ సీపీ తరఫున టిక్కెట్టిచ్చింది వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి.

గెలిచేంత మెజారిటీ ఉన్నా సరే... కుట్రపూరితంగా ఆయన్ని ఓడించి.. టీడీపీ తరఫున బీటెక్ రవిని గెలిపించింది చంద్రబాబు నాయుడు.

ఆయన ఉంటే జిల్లాలో తాము రాజకీయంగా ఏమాత్రం ఎదగలేమని భావించింది టీడీపీ నేతలు ఆదినారాయణ రెడ్డి, బీటెక్ రవి.

ఆయన్ని ఏకంగా గొడ్డలితో నరికి నేను హత్య చేశాను అని దర్యాప్తు సంస్థల ఎదుటే సాక్ష్యం ఇచ్చిన దస్తగిరి.

వీళ్లంతా ఎవరు? వివేకానందరెడ్డిని వ్యక్తిగతంగా, రాజకీయంగా అంతం చేసిన ముఠా సభ్యులు. మరి వీళ్లంటే వివేకానందరెడ్డి కుటుంబానికి సహజంగానే తీవ్ర ఆగ్రహం ఉండాలి కదా?

కానీ ఏం జరుగుతోంది? చంద్రబాబు నాయుడు, ఆదినారాయణ రెడ్డి, బీటెక్ రవి, దస్తగిరి... బాబు కోసం పనిచేసే 'ఈనాడు'.. దాని తోకలు.. వీళ్లంతా ఇపుడు వివేకానందరెడ్డి కుమార్తె సునీత, అల్లుడు-చిన బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డికి అత్యంత సన్నిహితులైపోయారు. అంతా కలిసే కోర్టులకెళుతున్నారు. 'నేనే నరికి చంపా' అన్న దస్తగిరి బెయిలుకోసం దరఖాస్తు చేస్తే వ్యతిరేకించ లేదు. దర్జాగా బయటే తిరుగుతున్నాడతను. ఎల్లో మీడియాకు పతాక స్థాయి ఇంటర్వ్యూలిస్తున్నాడు. వంకర మాటల ఓపెన్‌హార్టులో బీటెక్ రవి ప్రవచనాలు చెప్తున్నాడు. వీళ్లంతా కలిసి హంతకుడిని కూడా వదిలేసి తమ రాజకీయ ప్రత్యర్థుల్ని దీంట్లో ఇరికించడానికి వెంటాడుతున్నారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారు. ఎవరికి అర్థం కానిది ఈ నాటకం? వివేకానందరెడ్డి హత్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములైన ఈ ఎల్లో మాఫియాను ఛేదిస్తే తప్ప హత్య వెనక ఉన్న వాస్తవాలు బయటకు వచ్చే అవకాశం లేదు.

2017లో వివేకాపై చంద్రబాబు రాజకీయ కుట్ర.. మెజార్టీ సభ్యులు ఉన్నా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి

వైఎస్ వివేకానందరెడ్డిని రాజకీయంగా అంతం చేయడమే కాదు భౌతికంగానూ లేకుండా చేయాల్సిన అవసరం కచ్చితంగా టీడీపీకే ఉందన్నది బహిరంగ రహస్యం. వైఎస్సార్ జిల్లాలో టీడీపీ బలోపేతానికి ఆయనే అడ్డంకిగా నిలబడ్డారు. అందుకే 2017లో వైఎస్సార్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో వివేకాను కుట్రపూరితంగా ఓడించారు చంద్రబాబు. స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వైఎస్ వివేకానందరెడ్డిని అభ్యర్థిగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేశారు. జిల్లాలో మెజార్టీ ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీకి చెందినవారే ఉండటంతో ఆయన గెలుపు నల్లేరుపై నడకేనని అంతా భావించారు. వివేకాను ఓడిస్తే.. నాటి విపక్ష నేత జగన్‌ను ఓడించినట్లేనని చంద్రబాబు భావించారు. అందుకే వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభాలు పెట్టి తమ వైపు లాక్కున్నారు. దీనికి నాటి చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణరెడ్డి పూర్తిగా సహకరించారు. ఎందుకంటే వైఎస్సార్ సీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి నీతిబాహ్యంగా టీడీపీకి అమ్ముడుపోయి చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రి అయిన వ్యక్తి ఆదినారాయణ రెడ్డి. ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి, రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సీఎం రమేశ్ భారీగా డబ్బులు వెదజల్లి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభపెట్టి దొడ్డిదారిలో వైఎస్ వివేకానందరెడ్డిని ఓడించారు.

2019... వివేకా భౌతికంగా అంతం


2019 సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటంతో చంద్రబాబులో మళ్లీ గుబులు మొదలైంది. 2014 ఎన్నికల్లో వైఎస్సార్ జిల్లాలో ఒకే ఒక ఎమ్మెల్యే సీటును గెలిచిన టీడీపీకి ఈ సారి అది కూడా కష్టమేనని అర్థమైంది. కడప సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డిని ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఆ లోక్‌సభ స్థానానికి పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా అప్పటికే వైఎస్ వివేకానందరెడ్డిని నియమించారు. పార్టీ గెలుపు కోసం ఎన్నికల వ్యూహాలు పన్నుతూ...అందర్నీ కలుపుకుంటూ వెళ్లారు వివేకా. దాంతో చంద్రబాబు, ఆదినారాయణ రెడ్డి బెంబేలెత్తారు. ఎందుకంటే 2019 ఎన్నికల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థిగా ఆదినారాయణ రెడ్డిని చంద్రబాబు ఖరారు చేశారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే టికెట్‌ను కూడా ఆదినారాయణ రెడ్డి కొడుక్కి ఇచ్చారు. వివేకా ఉంటే ఎప్పటికీ తాము రాజకీయంగా పైచేయి సాధించలేమన్నది బీటెక్ రవి, ఆదినారాయణ రెడ్డి ఉద్దేశం. ఈ నేపథ్యంలోనే వివేకా హత్యకు గురయ్యారు. మరి ఇది టీడీపీ కుట్ర కాదా? వివేకా హత్యకు ముందు టీడీపీ నేతలతో కొందరి రహస్య సమావేశాలు... ఆయన హత్య తరువాత టీడీపీ నేతలు వ్యవహరించిన తీరే దీనికి ఊతమిస్తోంది. హత్య అనంతరం... అప్పట్లో ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు పదేపదే కడప ఎస్పీకి ఫోన్ చెయ్యడం... బీటెక్ రవితో కూడా నేరుగా సంభాషించటం... ఎప్పటికప్పుడు జరుగుతున్న వ్యవహారాలను నాటి సీఎం చంద్రబాబుకు అప్‌డేట్ చెయ్యటం.. ఇవన్నీ కాదనలేని వాస్తవాలు. అంటే... అంతా తాము అనుకున్నట్లే జరుగుతోందా? లేదా.. అన్నది బాబుకు ఏబీ అప్‌డేట్ చేశారన్నది నిపుణుల మాట.

హత్యకు ముందు...
వివేకా అనుచరుడితో బీటెక్ రవి భేటీ ఎందుకో...!

తనకు దీర్ఘకాలంగా అనుచరుడిగా ఉన్న కొమ్మారెడ్డి పరమేశ్వరరెడ్డితో వివేకాకు ఆర్థిక వ్యవహారాల్లో విభేదాలు వచ్చాయి. దాంతో పరమేశ్వరరెడ్డి కక్ష పెంచుకుని పులివెందుల నియోజకవర్గంలో వివేకా రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న టీడీపీ నేత బీటెక్ రవితో చేతులు కలిపాడు. వివేకా హత్యకు అప్పటికే పన్నాగం సిద్ధం కావడంతో... ముందుగా పరమేశ్వరరెడ్డి ఎలిబీ సృష్టించుకోవడానికి వివేకా హత్యకు కేవలం రెండు రోజుల ముందే అంటే 2019 మార్చి 13న అనారోగ్యం సాకుతో కడపలోని సన్‌రైజ్ ఆస్పత్రి ఐసీయూలో చేరాడు. కానీ ఎవరికీ తెలియకుండా 2019 మార్చి 14 సాయంత్రం టీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవితో హరిత హోటల్‌లో రెండుసార్లు సమావేశమయ్యాడు. ఈ భేటీలో పాల్గొన్న శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి... ఆ తర్వాత కొద్ది రోజులకే అనుమానాస్పద రీతిలో మృతి చెందడం గమనార్హం. సిట్ దర్యాప్తులో నార్కో పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినా పరమేశ్వరరెడ్డి తిరస్కరించడం సందేహాలకు తావిస్తోంది.

'గుండె పోటు' కథకుడు శివప్రకాశ్ రెడ్డి...

వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేయటమే కాదు. ఆ హత్యలో ఇతరుల్ని ఇరికించడానికి కూడా ఎల్లో గ్యాంగ్ పకడ్బందీ కుట్ర పన్నిందని చెప్పొచ్చు. ఎందుకంటే వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించారనే తప్పుడు ప్రచారం వెనుక ఆయన పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్‌రెడ్డి, టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణ రెడ్డి ప్రధాన పాత్ర పోషించారు. శివప్రకాశ్‌రెడ్డి మొదట ఆదినారాయణ రెడ్డికి ఫోన్ చేసి వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించారని చెప్పారు. ''సిగరెట్లు ఎక్కువుగా తాగుతారు కదా! అందుకే ఇలా జరిగి ఉండొచ్చు'' అని ఆదినారాయణరెడ్డి ఆయనతో చెప్పారు. ఈ విషయాన్ని ఆదినారాయణ రెడ్డి స్వయంగా టీవీ ఛానెళ్ల ఎదుట వెల్లడించారు. అంతేకాదు. ఆదినారాయణరెడ్డికి చెప్పిన శివప్రకాశ్ రెడ్డే... ఎన్నికల ప్రచారం నిమిత్తం ఉదయాన్నే జమ్మలమడుగు వెళుతున్న ఎంపీ అవినాశ్‌రెడ్డికి కూడా వివేకా గుండెపోటు విషయం చెప్పారు. దాంతో అక్కడి నుంచే వెనుదిరిగి... అవినాశ్ రెడ్డి వివేకా ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే అక్కడ వివేకా పీఏ కృష్ణారెడ్డితో పాటు పలువురు ఉన్నారు. ఇలా శివప్రకాశ్ రెడ్డి చెప్పిన గుండెపోటు విషయమే... టీవీల్లో బ్రేకింగ్ న్యూస్‌గా వచ్చింది. ఆయన హత్యకు గురయ్యారనే నిజం బయటపడేలోపే ఈ తప్పుడు ప్రచారాన్ని తీసుకొచ్చారు. మరి శివప్రకాశ్‌రెడ్డి, ఆది నారాయణరెడ్డి ఈ తప్పుడు ప్రచారాన్ని ఎందుకు చేశారు? దీన్ని ఛేదిస్తే హత్య కేసులో అసలు కుట్ర బయటపడుతుంది.



రక్తపు మరకల లేఖ.. గోప్యంగా ఉంచమన్న కుమార్తె, అల్లుడు..

వివేకా గుండెపోటుతో చనిపోయారని ప్రచారం చేసేందుకుగాను ఆయన కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్‌రెడ్డి పక్కా ప్లాన్‌తోనే వ్యవహరించారు. అదెలాగంటే... వైఎస్ వివేకాపై తీవ్రంగా దాడిచేసిన తరువాత హంతకులు ఆయన చేత బలవంతంగా లేఖ రాయించారు. వాళ్లు బెదిరించడంతో... డ్రైవర్ ప్రసాద్ తనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడని ఆ లేఖలో వివేకా రాశారు. ఆ లేఖను మొదటగా అంటే ఆ రోజు ఉదయం 6.10లోపే చూసిన ఆయన పీఏ కృష్ణారెడ్డి... ఆ విషయాన్ని సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి చెప్పారు. రక్తపు మరకలున్న ఆ లేఖ చూసినవారెవరికైనా... వివేకాది హత్యేనని తెలిసిపోతుంది. కానీ లేఖ విషయాన్ని కృష్ణారెడ్డి చెప్పగానే... తాము వచ్చే వరకు ఆ లేఖను, వివేకా సెల్‌ఫోన్‌ను ఎవ్వరికీ ఇవ్వవద్దని, దాచి ఉంచాలని కృష్ణారెడ్డితో నర్రెడ్డి రాజశేఖరరెడ్డి చెప్పారు. ఆ తరవాతే అసలు పన్నాగానికి తెరలేచింది. శివ ప్రకాశ్ రెడ్డి ద్వారా అవినాశ్‌రెడ్డికి చెప్పించారు. అవినాశ్ రెడ్డి కాల్ డేటా చూస్తే ఈ విషయం నిర్ధారణ అవుతుంది కూడా. అవినాశ్ అక్కడకు చేరాక కూడా ఆయనకు లేఖ చూపించలేదు. లేఖ ఉందన్న విషయం కూడా చెప్పలేదు. అంటే... అన్నీ పథకం ప్రకారమే చేశారు.

వాస్తవానికి వారు గనక ఆ లేఖను వెంటనే పోలీసులకు ఇవ్వాలని చెప్పి ఉంటే వివేకా హత్యకు గురయ్యారన్నది వెంటనే అందరికీ తెలిసిపోయేది. కనీసం అక్కడకు చేరుకున్న అవినాశ్‌కు చూపించినా హత్య సంగతి అర్థమయ్యేది. హత్య జరిగిందని తెలిస్తే ఎవ్వరూ మృతదేహాన్ని తాకేవారే కాదు. కానీ లేఖను ఉద్దేశపూర్వకంగానే గోప్యంగా ఉంచారు. బహుశా! అంతా తామనుకున్నట్టే జరిగిందనో ఏమో!! ఆ రోజు నుంచీ ఇప్పటివరకూ చంద్రబాబు నాయుడు ఈ హత్య గురించి ఎక్కడ మాట్లాడినా... మృతదేహానికి బ్యాండేజీ ఎవరు కట్టారు? రక్తపు మరకలు ఎవరు తుడిచారు? అనే ప్రశ్నలే వేస్తున్నారు. మొత్తం టీడీపీ, ఎల్లో మీడియా.. అందరూ ఇదే విషయమై దుష్ప్రచారం చేస్తున్నారు. అంతే తప్ప అసలు గుండెపోటు అని చెప్పిందెవరు? వారికెలా తెలిసింది? అసలు లేఖను ఎందుకు గోప్యంగా ఉంచారు? అలా ఎందుకు ఉంచమన్నారు? అనే విషయాలను మాత్రం ప్రచారంలోకి రానివ్వటం లేదు. ఇదీ.. కుట్ర వెనక అసలు కథ. ఆ రోజు మధ్యాహ్నం 1గంట సమయంలో పులివెందుల చేరుకున్న సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఆ లేఖతోపాటు వివేకా సెల్‌ఫోన్‌ను కృష్ణారెడ్డి ఇచ్చారు. ఆ లేఖను చదివారు కానీ... వెంటనే పోలీసులకు ఇవ్వలేదు. సునీత ఆదేశాలతో సాయంత్రం 5 గంటలకు కృష్ణారెడ్డి ఆ లేఖను, సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించారు. ఆ లేఖను సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఎందుకు గోప్యంగా ఉంచారన్నదే ఈ హత్య కేసులో కీలకం.

చంద్రబాబు మంత్రాంగం...

వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురైన రోజు అప్పటి సీఎంగా ఉన్న చంద్రబాబు అమరావతి నుంచి పెద్ద కథే నడిపారు. అప్పటి ఇంటలిజెన్స్ చీఫ్‌గా ఉన్న ఏబీ వెంకటేశ్వరరావు కడప ఎస్పీతోనూ టీడీపీ ప్రభుత్వంలో మంత్రి ఆదినారాయణరెడ్డితోను, బీటెక్ రవితోను ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ కేసు దర్యాప్తును ప్రభావితం చేశారు. కేసు దర్యాప్తును ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టించేందుకు ఏబీవీ ఎందుకు అంతగా తాపత్రయ పడ్డారన్నది ఇప్పటికీ ప్రశ్నార్థకమే. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ... తాను జరిపిన దర్యాప్తులో అసలు లేఖ విషయమే పట్టించుకోకపోవటం గమనార్హం.

వివేకా మరణిస్తే ఎవరికి ప్రయోజనం... !
ఆయన రెండో వివాహంతో ఆ కుటుంబంలో తీవ్ర విభేదాలు

వివేకానందరెడ్డి మరణిస్తే ఎవరికి లాభం అన్నది ఈ కేసులో కీలకం. దాంతో అన్ని వేళ్లూ వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో తలెత్తిన విభేదాలపైకే వెళ్తున్నాయి. తాను రెండో వివాహం చేసుకున్న షమీమ్ అనే మహిళకు పుట్టిన కుమారుడికి ఆస్తిలో భాగం ఇవ్వాలని ఆయన భావించారు. తన రాజకీయ వారసుడిగా చేస్తానన్నది ఆ జిల్లాలో అందరికీ తెలుసు. అందుకే ఆ కుటుంబంలో ఆస్తి వివాదాలు, రాజకీయ వారసత్వ వివాదాలు తీవ్రస్థాయికి చేరాయి. వివేకా మొదటి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి తీవ్రంగా గొడవపడి ఆయన్ని విడిచిపెట్టి హైదరాబాద్‌లో ఉంటున్నారు. సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డి, బావగారు శివ ప్రకాశ్‌రెడ్డి షమీమ్ ఇంటికి వెళ్లి ఘర్షణ పడ్డారు. వివేకానందరెడ్డి అప్పటికే ఆమెకు ఇచ్చిన ఓ ఇంటి పత్రాలను బలవంతంగా తీసుకున్నారు. షమీమ్, వైఎస్ సునీత పరస్పరం దూషించుకుంటూ చేసుకున్న వాట్సాప్ చాటింగ్‌ను కూడా అప్పట్లోనే సిట్ బృందం వెలికితీసింది. షమీమ్‌కు ఓ ఇల్లు ఇవ్వాలని... ఆమె కుమారుడిని హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదివించాలని అనుకుంటున్నా...అవ్వడం లేదని వివేకా సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు కూడా. ఈ నేపథ్యంలో వివేకానందరెడ్డి జీవించి లేకపోతే ఆయన కుమార్తె, అల్లుడు, పెద్ద బావమరిదికే ఎక్కువ లాభమన్నది గమనించాల్సిన అంశం. ఆస్తితో పాటు రాజకీయ వారసత్వం కూడా తమకే వస్తుందన్నది వారి ఉద్దేశంగా తెలుస్తుంది.

హంతకుడు దస్తగిరిని అప్రూవర్‌గా మార్చింది ఎవరు...!?

వైఎస్ వివేకాను గొడ్డలితో స్వయంగా నరికాను అని చెప్పిన దస్తగిరి అప్రూవర్‌గా మారడంతోనే ఈ కేసు దర్యాప్తు దారితప్పింది. అతన్ని అప్రూవర్‌గా మార్చింది ఎవరనే అంశమూ ఇక్కడ కీలకం. దస్తగిరి తరచు వివేకా కుమార్తె సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డితో భేటీ అవుతున్నారు. మరోవైపు టీడీపీ నేతలు ఆదినారాయణ రెడ్డి, బీటెక్ రవితో సన్నిహితంగా ఉంటున్నారు. ఎల్లో మీడియాకు ఇంటర్వ్యూలిస్తున్నాడు. అంటే వివేకా కుటుంబం, టీడీపీ నేతల పన్నాగంలో భాగంగానే దస్తగిరి అప్రూవర్‌గా మార్చినట్టు స్పష్టమవుతోంది. అప్పటివరకు పేదరికంలో కొట్టుమిట్టాడిన దస్తగిరి.. అప్రూవర్‌గా మారిపోగానే ఒక్కసారిగా ధనవంతుడైపోయాడు. కారు, బంగ్లా, డ్రైవర్... అన్నీ వచ్చేశాయి. మరి వీటిని ఇస్తున్నదెవరు? ఎందుకు ఇస్తున్నారు? సీబీఐ అధికారులు దస్తగిరిని ఢిల్లీకి తీసుకువెళ్లి మరీ అప్రూవర్‌గా మార్చి వాంగ్మూలం నమోదు చేశారు. అందులో వాస్తవం ఎంతన్నది పట్టించుకోకుండా ఆ వాంగ్మూలం ఆధారంగానే ఏకపక్షంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హంతకుడు ఎల్లో గ్యాంగ్ హీరోనా...!

వివేకాను హత్య చేసిన దస్తగిరిని అటు టీడీపీ ఇటు టీడీపీ అనుకూల పచ్చ మీడియా హీరోగా చూపించేందుకు బరితెగించి వ్యవహరిస్తున్నాయి. ఈనాడు,ఆంధ్రజ్యోతి, ఏబీఎన్, టీవీ 5 చానళ్లు దస్తగిరిని ఇంటర్వ్యూలు చేస్తూ అతన్ని ఓ సెలబ్రిటీగా చూపిస్తున్నాయి. వైఎస్సార్ కుటుంబంపై అక్కసుతో పాత్రికేయ విలువలను దిగజారుస్తూ ఓ హంతకుడిని హీరోగా చూపించేందుకు పడరానిపాట్లు పడుతున్నాయి. తన తండ్రి హంతకుడిని ఓ సంఘ సంస్కర్తగా టీడీపీ, ఎల్లో మీడియా చూపిస్తూ ఉంటే సునీత కనీసం అభ్యంతరం వ్యక్తం చేయకపోవటమే ఇక్కడ దారుణం.

ఇదే బాబు మార్కు పన్నాగం...

చంద్రబాబు ఎవరినైనా అడ్డుతొలగించుకోవాలంటే తనదైన శైలిలో పన్నాగం పన్నుతారు. లక్ష్యంగా చేసుకున్న వ్యక్తి సొంతం కుటుంబంలోనే చిచ్చుపెట్టి సొంతవారితోనే కథ నడిపిస్తారని ఎన్టీఆర్ విషయంలో రుజువైంది. ఎన్టీ రామారావును ఆయన సొంత పిల్లలతోనే ఛీకొట్టించి మరీ పదవి నుంచి దించేసి తాను అడ్డదారిలో సీఎం అయ్యారు. అదే రీతిలో వివేకానందరెడ్డికి ఆయన కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది శివ ప్రకాశ్ రెడ్డిలతోనే పొగ పెట్టించారు. టీడీపీ నేతలు ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవిల సహకారంతో కుటుంబ సభ్యులే పాత్రధారులుగా గుట్టుచప్పుడు కాకుండా కథ ముగించారు.

కీలక అంశాలను విస్మరిస్తున్న సీబీఐ

సున్నితమైన వివేకా హత్య కేసు దర్యాప్తులో సీబీఐ ఆది నుంచీ దారి తప్పింది. వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో తలెత్తిన ఆస్తి, రాజకీయ వారసత్వ విభేదాలు...ఆయన లైంగిక అక్రమ సంబంధాలతో ఆయనపై కక్ష పెంచుకున్నవారు... వివేకాను సెటిల్‌మెంట్లకు వాడుకున్న స్నేహితులు, అనుచరులు...వివేకాను అడ్డుతొలగించుకుంటేనే రాజకీయంగా మనుగడ అని భావించిన చంద్రబాబు, ఆది నారాయణ రెడ్డి, బీటెక్ రవి... ఇలా ఈ కేసులో పచ్చ కుట్రను స్పష్టం చేస్తున్న అనేక కోణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. కానీ సీబీఐ మాత్రం హంతకుడిని ఎవరో వ్యూహాత్మకంగా అప్రూవర్‌గా మారిస్తే... ఆ వాంగ్మూలం పట్టుకునే ఈ కేసు దర్యాప్తు గోదారిని ఈదేందుకు యత్నిస్తుండటం సీబీఐ తీరునే ప్రశ్నార్థకంగా మారుస్తోంది.

జైలు నుంచి మావోయిస్టు నేత విడుదల



అరిలోవ(విశాఖ తూర్పు): విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు చడ్డా నాగభూషణం గురువారం బెయిల్‌పై విడుదలయ్యారు. ఆయన ఇక్కడ రెండో సారి శిక్ష అనుభవిస్తూ బెయిల్‌పై బయటపడ్డారు. న్యాయస్థానం ఆయనకు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. దీంతో విశాఖ కేంద్ర కారాగారం అధికారులు గురువారం ఉదయం 11 గంటలకు విడుదల చేశారు. జైలు నుంచి బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ హుకుంపేట మండలం ములియాపుట్ గ్రామానికి చెందిన తాను పదో తరగతిలోకి అడుగుపెడుతున్న సమయంలోనే మావోయిస్టుల విధానాలకు ఆకర్షితుడనయ్యానని చెప్పారు. అప్పటి నుంచి మావోయిస్టు ఉద్యమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. 20 ఏళ్ల పాటు ఉద్యమాల్లో, 12 ఏళ్లపాటు జైలు జీవితం అనుభవించినట్టు చెప్పారు. కుటుంబ సభ్యులను కలుసుకున్నాక భవిష్యత్ గురించి ఆలోచిస్తానని చెప్పారు. ఆయన కోసం జైలు వద్దకు కుటుంబ సభ్యులు వచ్చారు.

ఏడాదిలో కొత్తగా 14 స్టార్టప్‌లకు
యూనికార్న్ హోదా

68 యూనికార్న్‌లతో మూడో స్థానంలో ఇండియా



- ప్రపంచవ్యాప్తంగా భారత సంతతికి చెందిన యూనికార్న్‌లు 138
- 22 బిలియన్ డాలర్లతో మొదటి స్థానంలో బైజూస్
- 8 బిలియన్ డాలర్లతో స్విగ్గీ, డ్రీమ్ 11 యూనికార్న్‌లు
- హురూన్ గ్లోబల్ యూనికార్న్ ఇండెక్స్ – 2023 వెల్లడి

సాక్షి, అమరావతి: యూనికార్న్ స్టార్టప్‌లు వేగంగా విస్తరిస్తున్న దేశాల్లో భారత్ మూడో స్థానంలో నిలిచింది. గడిచిన ఏడాది కాలంలో కొత్తగా 14 స్టార్టప్‌లు యూనికార్న్ హోదాను దక్కించుకున్నాయి. మొత్తం 68 యూనికార్న్‌లతో ఇండియా మూడో స్థానంలో నిలిచింది. కొత్తగా వ్యాపారం ప్రారంభించిన స్టార్టప్ కంపెనీ వ్యాపార విలువ 1 బిలియన్ డాలర్లు (రూ. 8,200 కోట్లు) దాటితే ఆ సంస్థలను యూనికార్న్‌లుగా పిలుస్తారు. 2000 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 68 స్టార్టప్‌లకు ఈ హోదా దక్కినట్లు హురూన్ గ్లోబల్ యూనికార్న్ ఇండెక్స్ – 2023 వెల్లడించింది. ఇందులో అత్యధికంగా బైజూస్ 22 బిలియన్ డాలర్ల (రూ.1,80,400 కోట్లు)తో మొదటి స్థానంలో నిలిచింది. డ్రీమ్ 11, స్విగ్గీలు 8 బిలియన్ డాలర్ల (రూ.65,600 కోట్ల)తో తర్వాతి స్థానాల్లో ఉంటే, ఓలా, రాజోర్‌పేలు 7.5 బిలియన్ డాలర్లు (రూ. 61,500 కోట్లు)తో ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. కానీ భారత సంతతికి చెందిన వారు ఏర్పాటు చేసిన యూనికార్న్ స్టార్టప్‌లు ప్రపంచవ్యాప్తంగా 138 వరకు ఉన్నట్లు హురూన్ పేర్కొంది. భారతీయులు దేశంలోకంటే బయటి దేశాల్లో 70కి పైగా యూనికార్న్‌లను కలిగి ఉన్నట్లు హురూన్ పేర్కొంది. ఇండియాలో అత్యధికంగా యూనికార్న్‌లు బెంగళూరు, ముంబై నగరాల్లో ఉన్నాయి. బెంగళూరు కేంద్రంగా 33, ముంబై కేంద్రంగా 13 ఉన్నాయి.

ప్రపంచవ్యాప్తంగా యూనికార్న్‌ల విలువ రూ.352.6 లక్షల కోట్లు

ప్రపంచవ్యాప్తంగా 1,361 యూనికార్న్‌లు ఉన్నట్లు హురూన్ పేర్కొంది. గతేడాదితో పోలిస్తే కొత్తగా 303 స్టార్టప్‌లు యూనికార్న్ హోదాను దక్కించుకున్నట్లు తెలిపింది. మొత్తం యూనికార్న్‌ల వ్యాపార విలువ గతేడాదితో పోలిస్తే 17 శాతం పెరిగి రూ.352.6 లక్షల కోట్లు (4.3 ట్రిలియన్ డాలర్లు) దాటినట్లు పేర్కొంది. ఇందులో అత్యధికంగా అమెరికాలో 666 యూనికార్న్‌లు ఉండగా, 316 సంస్థలతో చైనా రెండో స్థానంలో ఉంది. నగరాల ప్రకారం చూస్తే శాన్‌ఫ్రాన్సిస్కో 181 యూనికార్న్‌లతో మొదటి స్థానంలో నిలిస్తే, న్యూయార్క్ 126, బీజింగ్ 79, షాంఘై 66 యూనికార్న్‌లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ప్రస్తుతం 500 మిలియన్ డాలర్ల విలువకు (వీటిని గాజెల్స్ అంటారు) చేరుకొని వచ్చే మూడేళ్లలో బిలియన్ డాలర్ల మార్క్‌ను అందుకోవడం ద్వారా యూనికార్న్ హోదా పొందే సంస్థలు అత్యధికంగా బెంగళూరు కేంద్రంగా ఉన్నాయని తెలిపింది. గాజెల్స్ యూనికార్న్‌లుగా ఎదిగే నగరాల్లో బెంగళూరు ప్రపంచంలో 8వ స్థానంలో నిలిచింది.

సీఎం జగన్ నిర్ణయాలు ఆదర్శనీయం

935వ రోజు రిలే దీక్షల్లో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అంబేడ్కర్ ఆలోచనా విధానానికి అనుగుణంగా రాజ్యాంగ ఫలాలను 5 కోట్ల మంది ప్రజలకు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలు ఆదర్శవంతమైనవని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 935వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నిపుణుల కమిటీల నివేదికలను పక్కనబెట్టి.. నారాయణ కమిటీ సిఫార్సుల మేరకు సీఆర్‌డీఏ పేరుతో రాజధాని ఏర్పాటు చేసిన చంద్రబాబు ఈ ప్రాంతంలో తరతరాల దోపిడీకి తెరలేపి రియల్ ఎస్టేట్ దందా చేశాడన్నారు. సామాజిక అసమతుల్యత పేరుతో వికేంద్రీకరణకు వ్యతిరేకంగా పేదలపై తప్పుడు కేసులు వేసిన కులవాదులను ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, పులిదాసు, పెరికె వరప్రసాద్, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య పాల్గొన్నారు.

కాశీ తెలుగు సంగమానికి ప్రధాని మోదీ

29న తెలుగువారిని ఉద్దేశించి ప్రసంగించనున్న ప్రధాని



సాక్షి, న్యూఢిల్లీ: గంగా పుష్కరాల్లో భాగంగా యూపీలోని వారణాశిలో ఈ నెల 29న శ్రీకాశీ తెలుగు సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కాశీ తెలుగు సంగమంలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. తెలుగు యాత్రికులను ఉద్దేశించి కాశీ తెలుగు సంగమం సభలో ప్రధాని ప్రసంగిస్తారని శ్రీకాశీ తెలుగు సమితి అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు చెప్పారు. ఏప్రిల్ 22 నుంచి మే 3 వరకు గంగా పుష్కరాలు జరుగుతాయని తెలిపారు. గురువారం ఢిల్లీలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పుష్కరాల కోసం కాశీకి వచ్చే తెలుగు యాత్రికులకు బస విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసిందన్నారు. ఐదు బస్సు రూట్లను ప్రత్యేకంగా గుర్తించారని, ఈ రూట్లలో 50 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారన్నారు. గుంటూరు, తిరుపతి, సికింద్రాబాద్, విశాఖల నుంచి వారణాశికి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తప్పుడు కూతలు కూస్తే సహించం

మూడేళ్లుగా తమతో కూటమిలో ఉన్న జనసేన విషయంలో తప్పుడు కూతలు కూస్తే సహించేది లేదని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు టీడీపీపై మండిపడ్డారు. తమ కూటమిపై టీడీపీ నేతలు ఎందుకు అక్కసు మాటలు మాట్లాడుతున్నారు? అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీని గద్దె దించి అధికారంలోకి రావాలన్నదే బీజేపీ- జనసేన కూటమి లక్ష్యమని చెప్పారు. ఒకవైపు బీజేపీతో పొత్తు కోసం తహతహలాడుతూ, మరోవైపు తమకు వైఎస్సార్‌సీపీతో సంబంధం అంటూ తప్పుడు కూతలు కూస్తే సహించబోమన్నారు. తమతో పొత్తులో ఉన్న పార్టీ గురించి అవాస్తవాలు చెబుతున్న టీడీపీ తమకు ముందు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

తెల్ల రేషన్‌కార్డు ఉంటే ఉచితంగా మల్లన్న ఆర్జిత సేవ


ఆలయప్రాంగణంలో కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు నిర్వహించే ఆర్జిత సేవలను సామాన్య భక్తులకు మరింత చేరువ చేసేందుకు ఉచితంగా సామూహిక ఆర్జిత సేవ నిర్వహిస్తున్నట్లు ఈవో ఎస్.లవన్న తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. తెల్లరేషన్ కార్డు కలిగిన భక్తులకు ప్రతి నెలలో ఒకరోజు స్వామి అమ్మవార్లకు నిర్వహించే ఆర్జిత సేవలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 25న ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం 9.30గంటలకు చంద్రావతి కల్యాణ మండపంలో మల్లికార్జున స్వామికి సామూహిక అభిషేకాన్ని నిర్వహిస్తామన్నారు. భక్తులు ఉచిత సామూహిక ఆర్జిత సేవలో పాల్గొనేందుకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచిన టికెట్లను పొందవచ్చన్నారు. ప్రతి నెలా 250 టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయన్నారు.

మల్లన్న సేవలో కేంద్ర మంత్రి

శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లను గురువారం కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి వీరేంద్ర కుమార్ దర్శించుకున్నారు. ఆయనకు ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆహ్వానం పలికారు. అనంతరం స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

ఆ స్థలం టీటీడీదే

తిరుపతి 3వ అదనపు జిల్లా జడ్జి తీర్పు

తిరుపతి లీగల్: తిరుపతి ప్రకాశం రోడ్డులో ప్రస్తుతం ఎస్పీ కార్యాలయం పక్కన ఉన్న 41 సెంట్ల ఖాళీస్థలం టీటీడీదేనని తిరుపతి 3వ అదనపు జిల్లా జడ్జి కోర్టు బుధవారం తీర్పుచెప్పినట్లు టీటీడీ న్యాయసలహాదారు పి.బలరాం గురువారం మీడియాకు తెలిపారు. సర్వే నంబరు 985లోని 41 సెంట్ల స్థలం టీటీడీదని, ఆ స్థలంలోకి స్నేహ ఎస్టేట్స్ మేనేజింగ్ పార్టనర్ కె.వి.వి.దుర్గాప్రసాద్, వారి అనుచరులు అక్రమంగా ప్రవేశిస్తున్నారంటూ టీటీడీ ఈవో 2006లో తిరుపతి 3వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో సివిల్ దావా ఓఎస్ నెం.44/2006 దాఖలు చేశారు. ఆ స్థలంలోకి స్నేహ ఎస్టేట్స్ సిబ్బంది గానీ, వారి అనుచరులు, ఇతరులు ప్రవేశించకుండా పర్మినెంట్ ఇంజెక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలని దావాలో కోరారు. అప్పటి నుంచి ఈ కేసు విచారణలో ఉంది. రెండు పక్షాలు సమర్పించిన పత్రాలు, సాక్ష్యాలను పరిశీలించిన న్యాయాధికారి టీటీడీ కోరిన విధంగా తీర్పుచెప్పారు. తిరుపతి నడిబొడ్డున ఉన్న ఆ స్థలం ప్రస్తుతం సుమారు రూ.50 కోట్లు విలువ చేస్తుందని స్థానికులు చెబుతున్నారు.

అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

రూ.15.83 లక్షల విలువచేసే గంజాయి, కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): ఖమ్మం ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి నెల్లూరు, తమిళనాడులో విక్రయాలు సాగిస్తున్న ఓ ముఠా గుట్టును నెల్లూరు ఎస్‌ఈబీ అధికారులు రట్టు చేశారు. ముఠాలోని ఏడుగురు సభ్యులతోపాటు నలుగురు వినియోగదారులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.15.83 లక్షలు విలువచేసే గంజాయి, కారు, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు జిల్లా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఈ కేసు వివరాలను గురువారం వెల్లడించారు. చెన్నై ఆంజనేయనగర్ ఆరో వీధికి చెందిన రాఘవన్ కావలిలో తన అత్త వద్ద ఉంటున్నాడు. అతను ఖమ్మం జిల్లా భద్రాచలంలోని పేపర్‌మిల్లులో పనిచేస్తున్న సమయంలో గంజాయి సరఫరాదారులైన ఖమ్మం జిల్లా బూర్గంపాడు మండలం శారపాక గ్రామానికి చెందిన యు.బాలమురళీకృష్ణ, కె.సురేష్‌తో పరిచయం ఏర్పడింది. వారు ఏవోబీలో గంజాయి కేజీ రూ.3 వేలకు కొనుగోలు చేసి రూ.7,500కు రాఘవన్‌కు విక్రయించారు. ఆయన కావలితోపాటు తమిళనాడు రాష్ట్రంలో కేజీ రూ.15 వేలు చొప్పున విక్రయించి సొమ్ము చేసుకోసాగాడు. ప్రస్తుతం రాఘవన్ దంపతులు కావలి తుఫాన్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. గుట్టుగా సాగుతున్న ఈ వ్యవహారంపై జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డికి సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఎస్‌ఈబీ జిల్లా ఇన్‌చార్జ్ డి.హిమవతి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ హుస్సేన్‌బాషా, నెల్లూరు-1, కావలి ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్లు కేపీ కిశోర్, శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టారు. గురువారం తుఫాన్ నగర్‌లో రాఘవన్ దంపతులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిచ్చిన సమాచారం మేరకు శారపాకకు చెందిన బాలమురళీకృష్ణ, సురేష్, తరుణ్, దుమ్ముగూడు మండలం తూరుబాక గ్రామానికి చెందిన సతీష్‌ను అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి 25 కేజీల గంజాయిని, కారును స్వాధీనం చేసుకున్నారు. అలాగే కావలిలోని బాలకృష్ణారెడ్డినగర్‌లో గంజాయి విక్రయదారురాలైన డి.శారదను అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

నలుగురు వినియోగదారులు

అదే క్రమంలో రాఘవన్ దంపతులు, శారదల వద్ద కావలిలోని పాతూరుకు చెందిన డి.చైతన్య, వెంగళరావ్‌నగర్‌కు చెందిన వై.లక్ష్మీప్రవీణ్‌కుమార్, ఆంధ్రావీధికి చెందిన జి.శ్రీకాంత్, శివాలయం ప్రాంతానికి చెందిన పి.ఎం.శ్రీనివాసులు గంజాయిని కొనుగోలు చేసి సేవిస్తున్నట్లు తెలియడంతో వారిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 4.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

అవకాశవాద రాజకీయాలకు కేరాఫ్ టీడీపీ

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాంబశివరావు విమర్శ

సాక్షి, అమరావతి: అధికారం కోసం అవకాశవాద రాజకీయాలు చేస్తూ.. ఎవరితోనైనా జతకట్టే పార్టీ టీడీపీ అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందు సాంబశివరావు విమర్శించారు. వైఎస్సార్‌సీపీకి బీజేపీ లోపాయికారిగా మద్దతిస్తోందని టీడీపీ నేత పితాని సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై సాంబశివరావు గురువారం అభ్యంతరం వ్యక్తం చేశారు. సిద్ధాంతాలు, క్రమశిక్షణతో నడిచే పార్టీ బీజేపీ అని చెప్పారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఎన్టీఆర్ టీడీపీని స్థాపిస్తే.. చంద్రబాబు తన స్వార్థ ప్రయోజనాల కోసం అదే కాంగ్రెస్‌తో జతకట్టారని విమర్శించారు. టీడీపీ నేతలు ఇప్పటికైనా బీజేపీపై దుష్ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. లేకపోతే టీడీపీ బండారం బయట పెడతామని హెచ్చరించారు.

ఆర్బీకేల ద్వారా చేప పిల్లలు

54 ఫిష్ సీడ్ ఫామ్స్‌తో ఆర్బీకేల అనుసంధానం • ఇప్పటికే ఆర్బీకేల ద్వారా మేతల సరఫరా



సాక్షి, అమరావతి: వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) ద్వారా నాణ్యమైన చేపల సీడ్ సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఆర్బీకేల ద్వారా చేప, రొయ్య మేతలను రైతులకు అందిస్తున్న ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి నాణ్యమైన చేపల సీడ్‌ను కూడా సరఫరా చేయబోతోంది. రాష్ట్రంలో 10,778 ఆర్బీకేలు ఉండగా.. ఆక్వా సాగు చేసే ప్రాంతాల్లోని ఆర్బీకేలలో 734 మంది మత్స్య సహాయకులు సేవలందిస్తున్నారు. ఈ-ఫిష్ ద్వారా ఆక్వా సాగు నమోదుతో పాటు ఆక్వా చెరువులకు లైసెన్సులు సైతం జారీ చేస్తున్నారు. దిగుబడుల్లో నాణ్యత పెంచేందుకు చెరువుల్లో శాంపిల్స్ సేకరించి వాటర్ క్వాలిటీ టెస్టులు కూడా చేస్తున్నారు. ఆక్వా సాగులో కీలకమైన ఇన్‌పుట్స్ కూడా ఆర్బీకేల ద్వారానే సరఫరా అవుతున్నాయి. ఇప్పటికే 25 ఫీడ్ కంపెనీలతో ఎంఓయూ కుదుర్చుకున్న మత్స్య శాఖ ఆర్బీకేల ద్వారా 2,736 టన్నుల చేప, రొయ్యల మేతలను రైతులకు సరఫరా చేసింది.

54 సీడ్ ఫామ్స్‌తో అనుసంధానం

ఇకపై చేపల రైతులకు నాణ్యమైన, ధ్రువీకరించిన సీడ్ సరఫరా చేసేందుకు మత్స్యశాఖ చర్యలు చేపట్టింది. ఇందుకోసం మత్స్య సహాయకులకు ఇచ్చిన ట్యాబ్స్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అప్‌లోడ్ చేసింది. ఈ-మత్స్యకార యాప్ ద్వారా రాష్ట్రంలోని 54 ప్రభుత్వ ఫిష్ సీడ్ ఫామ్స్‌ను ఆర్బీకేలతో అనుసంధానం చేశారు. సాగునీటి వనరుల్లో నాణ్యమైన మత్స్య దిగుబడులను రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఫిష్ సీడ్ ఫామ్స్‌లో పెద్ద ఎత్తున చేప పిల్లలను ఉత్పత్తి చేస్తుంటుంది. వీటిని ఆర్బీకేల ద్వారా లైసెన్స్‌డ్ రిజర్వాయర్లకు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో ఆర్బీకేల ద్వారా బుకింగ్ చేసి జిల్లాల వారీగా లైసెన్స్‌డ్ రిజర్వాయర్లకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ఫిష్ ఫామ్స్‌తో పాటు రైతుల ద్వారా 10.13 కోట్ల సీడ్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. రాష్ట్రంలో 1,817 లైసెన్స్‌డ్ రిజర్వాయర్లు ఉండగా.. వాటికి 10.10 కోట్ల సీడ్ అవసరమని అంచనా వేశారు. ఇప్పటివరకు 3.09 కోట్ల ఫిష్ సీడ్‌ను ఆర్బీకేల ద్వారా సరఫరా చేశారు. వీటిని ఆయా ప్రాంతాల్లో లైసెన్స్ పొందిన మత్స్యకారులు వేటసాగిస్తూ జీవనోపాధి పొందనున్నారు. మలి దశలో రైతులకు కావాల్సిన ఫిష్ సీడ్ సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నాణ్యమైన చేప పిల్లల సరఫరాయే లక్ష్యం

ఆర్బీకేల ద్వారా నాణ్యమైన చేప పిల్లలను సరఫరా చేస్తున్నాం. ప్రస్తుతం ఆర్బీకేల ద్వారా లైసెన్స్ పొందిన రిజర్వాయర్లకు సరఫరా చేస్తున్నాం. మలిదశలో రైతులకు సరఫరా చేసేలా ఏర్పాట్లు సన్నాహాలు చేపట్టాం.
– కె.కన్నబాబు, కమిషనర్, మత్స్య శాఖ

క్లుప్తంగా...

కర్ణాటకలో రూ.25 కోట్ల సొత్తు సీజ్

బెళగావి: కర్ణాటకలో ఎన్నికల వేళ 1.54 కోట్ల నగదుతోపాటు 40 కిలోల బంగారం, 20 కిలోల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బెళగావి జిల్లా పోలీసులు బుధవారం రాత్రి ఓ కారులో తరలిస్తున్న లెక్కల్లో చూపని నగదు రూ.1.54 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, ఆదాయ పన్ను శాఖకు సమాచారమిచ్చినట్లు పోలీసు అధికారి ఒకరు చెప్పారు. అదేవిధంగా, చిక్కమగళూరు జిల్లా తరికెరె అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎన్నికల నిఘా అధికారులు 40.59 కిలోల బంగారంతోపాటు 20.7 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సొత్తు విలువ రూ.23.51 కోట్లుంటుందని చెప్పారు. మార్చి 29వ తేదీన నిబంధనావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో రూ.204 కోట్లను సీజ్ చేసి, ఇందుకు సంబంధించి 1,714 కేసులు నమోదు చేశారు.

ఒడిశాలో గిరిజన బాలికలపై గ్యాంగ్ రేప్

భవానీపట్న: ఒడిశాలోని కలహండి జిల్లాలో జరిగిన ఘోరం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈనెల 16వ తేదీ రాత్రి జాతరకు వెళ్లివస్తున్న 14–17 ఏళ్లలోపు ముగ్గురు బాలికలను ఐదుగురు వ్యక్తులు అడ్డగించారు. వీరిలో ఒక బాలిక తప్పించుకోగా మిగతా ఇద్దరిపై దుండగులు అత్యాచారానికి పాల్పడ్డారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు బిజెపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి లింగరాజ్ సేథి చెప్పారు. ఈ ఘటనపై బాధితుల కుటుంబీకులు గ్రామపెద్దలను ఆశ్రయించారు. అయితే, నిందితులు వేరే వర్గానికి చెందినవారు కావడంతో తమకు ఫిర్యాదు చేశారని సేథి అన్నారు. ఇక్కడి అటవీ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఎక్కువగా ఉంటుందన్నారు.

గోవాలో ఎస్‌సీవో భేటీకి బిలావల్

పాకిస్తాన్ విదేశాంగ శాఖ వెల్లడి

ఇస్లామాబాద్: భారత్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) సమావేశానికి పాక్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో హాజరుకానున్నారు. మే 4, 5వ తేదీల్లో గోవాలో జరిగే ఎస్‌సీవో విదేశాంగ మంత్రుల భేటీలో పాల్గొనే పాక్ బృందానికి ఆయన నాయకత్వం వహిస్తారు. ఈ విషయాన్ని పాక్ విదేశాంగ శాఖ గురువారం వెల్లడించింది. భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఆహ్వానం మేరకు మంత్రి బిలావల్ గోవా వెళ్తున్నారని పాక్ విదేశాంగ శాఖ ప్రతినిధి ముంతాజ్ జహ్రా బలోచ్ చెప్పారు. బిలావల్ పర్యటన ఖరారుతో రెండు దేశాల మధ్య సంబంధాల్లో ఉద్రిక్తతలు కొంతైనా తగ్గుతాయనే ఆశలు చిగురిస్తున్నాయి. పాక్ నేత ఒకరు భారత్‌కు రావడం గత ఆరేళ్ల తర్వాత ఇదే తొలిసారికావడం గమనార్హం.

ఇద్దరు మిలటరీ నాయకుల మధ్య ఆధిపత్య పోరాటం సూడాన్‌లో సామాన్యుల ఆకలి కేకలకు దారితీస్తోంది. అధికారం కోసం వారు చేస్తున్న పోరాటంతో సామాన్యులు సమిధలుగా మారుతున్నారు. తినడానికి తిండి లేక, తాగడానికి నీళ్లు దొరక్క, కటిక నేలపై నిద్రిస్తూ ఎప్పుడే తూటా తమ ప్రాణాల్ని హరిస్తుందో తెలీని పరిస్థితుల్లో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. సూడాన్‌లో ఎందుకీ ఘర్షణలు ?

ఇద్దరి అధికారదాహం.. అంతర్యుద్ధం

సూడాన్ ఆధిపత్య పోరాటంలో మిలటరీ జనరల్స్.. బతుకు పోరాటంలో సమిధలుగా మారుతున్న సామాన్యులు

దశాబ్దాల తరబడి నియంత పాలనలో మగ్గిపోయిన సూడాన్‌లో 2019లో ఆర్మీ తిరుగుబాటు జరిగి ఆనాటి అధ్యక్షుడు, నియంత ఒమర్ అల్–బషీర్‌ని సైన్యం గద్దె దింపడంతో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారో లేదో రెండేళ్లకే 2021లో ఆ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి కొదమసింహాల్లాంటి ఇద్దరు జనరల్స్ చేతులు కలిపారు. అధికారాన్ని చేజిక్కించుకున్నారు. ఈ క్రమంలో ఘర్షణలు చెలరేగి వందల మంది ప్రాణాలు కోల్పోయారు. మళ్లీ రెండేళ్లకే అధికార బదలాయింపులో సమస్యలు మిత్రులైన ఆ మిలటరీ జనరల్స్‌ను శత్రువులుగా మార్చింది. వారే సూడాన్ ప్రస్తుత పాలకుడు, ఆర్మీ చీఫ్ జనరల్ అబ్దుల్ ఫత్తా అల్ బుర్హాన్, ఉపాధ్యక్షుడు, ఆర్‌ఎస్‌ఎఫ్ చీఫ్ జనరల్ మొహమద్ హమ్దాన్ దగలో (హెమెడ్తీ) . వీరిద్దరి మధ్య ఆధిపత్య పోరాటం తారస్థాయికి చేరుకుంది. ముందుగా జరిగిన ఒప్పందం ప్రకారం గత ఏడాది చివర్లో ప్రజాస్వామ్య పద్ధతుల్లో దేశంలో ఎన్నికలు జరగాలి. కానీ బుర్హాన్ అనుకున్నట్టుగా ఆ పని చేయలేదు. ఈలోగా అధికారాన్ని తన గుప్పిట్లో తీసుకోవడానికి హెమెడ్తీ పౌర పార్టీల కూటమైన ఫోర్సెస్ ఫర్ ఫ్రీడమ్ అండ్ ఛేంజ్ (ఎఫ్ఎఫ్‌సీ)తో సత్సంబంధాలు పెట్టుకున్నారు. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ తనని తాను ఒక రాజనీతిజ్ఞుడిగా చూపించుకునే ప్రయత్నం మొదలుపెట్టారు. బంగారం గనులు, ఇతర వెంచర్ల ద్వారా హెమెడ్తీ, ఎఫ్ఎఫ్‌సీలు బాగా సంపద పోగేసుకున్నారు. మాజీ అధ్యక్షుడు బషీర్ అనుచరులు, ఇతర సీనియర్లు, ఆర్మీలో చాలా రోజులుగా పాతుకుపోయి ఉన్న వారిని పక్కకు తప్పించాలని ప్రణాళికలు రచించారు. ఆర్‌ఎస్‌ఎఫ్‌ను దేశవ్యాప్తంగా చాప కింద నీరులా విస్తరించడం ప్రారంభించారు. ఈలోగా లక్ష మంది బలగం ఉన్న ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ (ఆర్‌ఎస్‌ఎఫ్)ను సైన్యంలో విలీనం చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. తర్వాత సైన్యాధ్యక్షుడుగా ఎవరు ఉంటారన్నది సవాల్‌గా మారాయి. ఈ పరిణామాలన్నీ తన పదవికి ఎసరు పెడతాయని అధ్యక్షుడు బుర్హానా భావించారు. ఫలితంగా ఈ నెల 15న ఇరు వర్గాల మధ్య పోరు మొదలైంది.

ఎవరిది పై చేయి?

బుర్హాన్, హెమెడ్తీ మధ్య హోరాహోరీ పోరు కొనసాగుతోంది. ఇద్దరికి ఇద్దరూ తగ్గేదేలే అంటున్నారు. ఆర్‌ఎస్‌ఎఫ్‌ను ఒక తిరుగుబాటు సంస్థగా ముద్రవేసిన బుర్హాన్ వెంటనే దానిని రద్దు చేయాలని పట్టు బడుతున్నారు. మరోవైపు హెమెడ్తీ బుర్హాన్‌ను క్రిమినల్‌గా అభివర్ణిస్తున్నారు. బషారీ పాలన నుంచి విముక్తి పొందినా దేశంలో శాంతి స్థాపన జరగకపోవడానికి ఆయనే కారణమని నిందిస్తున్నారు. సూడాన్ ఆర్మీలో 3 లక్షల మంది సైనికులతో వైమానిక బలగం కూడా దాని సొంతం. ఆర్‌ఎస్‌ఎఫ్‌లో లక్ష మంది సైనికులే ఉన్నారు. అయితే ఆర్‌ఎస్‌ఎఫ్‌కు సూడాన్ పశ్చిమ ప్రాంతంలో గిరిజన తెగల అండదండలు ఉన్నాయి. అంతర్జాతీయ సమాజం కూడా ఇద్దరు బలవంతులు కొట్టుకుంటూ ఉంటే ఎలా స్పందించాలో తెలీక మౌనం వహిస్తోంది. మానవీయ సంక్షోభం రాకుండా చర్యలు తీసుకోవాలని వారికి సలహా ఇవ్వడం మినహా మరేమీ చేయలేకపోతోంది.



సూడాన్ జనాభా **4.6** కోట్లు

కాల్పులు జరుగుతున్న ప్రాంతంలో నివసిస్తున్నవారు **1.2** కోట్లు

మానవీయ సాయం కావాల్సిన వారు **1.6** కోట్లు

ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న వారు **1.17** కోట్లు

అయిదు రోజులుగా నరకం

సూడాన్‌లో వారం రోజులుగా సాగుతున్న హింసాకాండలో ఇప్పటివరకు 200 మందికి పైగా మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. పోరాటమంతా రాజధాని ఖర్టూమ్ పరిసరాల్లో జనావాస ప్రాంతాల్లో జరుగుతోంది. సూడాన్ జనాభా 4.6 కోట్లు అయితే రాజధాని పరిసర ప్రాంతాల్లోనే 1.2 కోట్ల మంది నివసిస్తారు. ఈ ప్రాంతాలన్నీ కాల్పుల మోతతో దద్దరిల్లిపోతున్నాయి. వీధుల్లోనే శవాలు పడి ఉన్నా పట్టించుకునే వారే లేరు. విద్యుత్ సదుపాయం నిలిచిపోయింది. బేకరీలో బ్రెడ్ కొనుక్కొని తెచ్చుకోవడానికి 3 గంటలు క్యూ లైన్‌లో నిల్చోవాల్సి వస్తోంది. కిలోమీటర్ దూరంలో ఉండే ఆఫీసుకి వెళ్లడం కూడా అందరికీ కష్టమవుతోంది. ఇల్లు కదిలి కాలు బయట పెడితే ప్రాణాలతో బతికి ఉంటారన్న నమ్మకం లేదు. అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాలన్నా వీధుల్లో వినిపిస్తున్న కాల్పుల మోతలతో బయటకి అడుగుపెట్టే ధైర్యం చేయడం లేదని 65 ఏళ్ల వయసున్న అబ్బాస్ చెప్పారు. సూడాన్ పాలకులకు ప్రజల ప్రాణాలపై కనీస గౌరవం కూడా లేదని ఆయన మండిపడ్డారు ''వేలాది మంది ప్రజలు ప్రాణాలు కాపాడుకోవడానికి ఇళ్లకే పరిమితమయ్యారు. ఇంట్లో సరుకులు అయిపోతున్నా, మంచినీరు, కరెంట్, మందులు వంటివి లేకపోయినా బయటకు వచ్చే పరిస్థితి లేదు''అని ఐక్యరాజ్య సమితి మానవహక్కుల హై కమిషనర్ వోల్కర్ టర్క్ చెప్పారు. కొన్ని దశాబ్దాల పాటు బషీర్ పాలనలో అంతర్యుద్ధంలోనే ప్రజలు గడిపారు. పేదరికం, అణచివేతను ఎదుర్కొంటూ దుర్భర పరిస్థితుల్ని చూశారు. ఇప్పుడైనా ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడుతుందన్న వారి ఆశలు అడియాసలుగా మారాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

నరోడా గామ్ కేసులో 67 మంది నిర్దోషులే

ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు • గుజరాత్ హైకోర్టులో సవాలు చేస్తామన్న బాధితులు

అహ్మదాబాద్: రెండు దశాబ్దాల క్రితం నాటి నరోడా గామ్ ఊచకోత కేసులో అహ్మదాబాద్‌లోని ప్రత్యేక కోర్టు గురువారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో మొత్తం 67 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటించింది. వీరిలో గుజరాత్ మాజీ మహిళా మంత్రి మాయా కొద్నానీ, బజరంగ్ దళ్ మాజీ నాయకుడు బాబూ బజరంగీ, విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) మాజీ నేత జయదీప్ పటేల్ ఉన్నారు. ప్రత్యేక కోర్టు తీర్పుతో 67 మంది నిందితులకు కేసు నుంచి విముక్తి లభించినట్లయ్యింది. గుజరాత్‌లో 2002లో గోద్రా రైలు దహనం అనంతరం రాష్ట్రమంతటా భారీగా హింసాకాండ చోటుచేసుకుంది. అహ్మదాబాద్‌లోని నరోడా గామ్‌లో జరిగిన మత ఘర్షణల్లో మైనార్టీ వర్గానికి చెందిన 11 మంది బలయ్యారు. ఈ కేసులో పోలీసులు 86 మందిని నిందితులుగా గుర్తించారు. ఈ ఊచకోతపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణ కొనసాగింది. నిందితుల్లో 18 మంది విచారణ కొనసాగుతుండగానే మృతి చెందారు. మరొకరు నిర్దోషిగా బయటపడ్డారు. మిగిలిన 67 మందికి బెయిల్ లభించింది. కేసుపై ప్రత్యేక జడ్జి ఎస్.కె.బాక్సీ తుది తీర్పు వెలువరించారు. నిందితులంతా నిర్దోషులేనని వెల్లడించారు. తమకు న్యాయం జరగలేదని, ప్రత్యేక కోర్టు తీర్పును గుజరాత్ హైకోర్టులో సవాలు చేస్తామని బాధిత కుటుంబాల తరఫు లాయర్ చెప్పారు. మాయా కొద్నానీ 2002లో గుజరాత్‌లో నరేంద్ర మోదీ కేబినెట్‌లో మంత్రిగా ఉన్నారు.


తీర్పు వేళ కోర్టు వద్ద మాయా, మరో నిందితుడు

వితరణ వేళ విషాదం

- యెమెన్‌లో రంజాన్ సందర్భంగా పేదలకు నగదు పంచే కార్యక్రమంలో తొక్కిసలాట
- 78 మంది దుర్మరణం
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం

సనా: యెమెన్ దేశంలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని స్థానికులకు తలో 7 డాలర్లమేర ఉచిత నగదు పంపిణీ కార్యక్రమం చివరకు ఘోర విషాదంతో ముగిసింది. వందల సంఖ్యలో జనం తరలిరావడం, వారిని అదుపుచేసేందుకు సాయుధ హౌతీ తిరుగుబాటుదారులు గాల్లోకి కాల్పులు జరపడం, ఆ తూటాలు తగిలి విద్యుత్ తీగల వద్ద పేలిన శబ్దాలతో భయపడిన పేదజనం పరుగెత్తారు. దీంతో హఠాత్తుగా తొక్కిసలాట చోటుచేసుకుంది. యెమెన్ రాజధాని సనా సిటీలోని ఓ పాఠశాల ఆవరణలో జరిగిన ఈ తొక్కిసలాటలో చిన్నారులు, మహిళలుసహా 78 మంది ప్రాణాలుకోల్పోయారు.73 మంది గాయపడ్డారు. 13 మంది పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న హౌతీ తిరుగుబాటుదారులు తెలిపారు. ఓల్డ్‌సిటీ పరిధిలోని బాబ్ అల్–యెమెన్ ప్రాంతంలోని మయీన్ స్కూల్‌లో బుధవారం అర్ధరాత్రివేళ ఈ ఘోరం సంభవించింది. నగదు పంపిణీ కార్యక్రమం నిర్వహణలో విఫలమవడంతో దాతలైన ఇద్దరు స్థానిక వ్యాపారవేత్తలను అరెస్ట్‌చేశామని హౌతీ రెబల్స్ నేతృత్వంలోని అంతర్గత మంత్రిత్వ శాఖ తెలిపింది.


సంఘటనా స్థలంలో దృశ్యం

దారుణ మానవ విపత్తు

2014లో యెమెన్ ఉత్తర ప్రాంతంపై పట్టు కోల్పోయిన హౌతీ తిరుగుబాటుదారులు ఆ తర్వాతి ఏడాదే దేశ రాజధానిని తమ వశంచేసుకుని ఆ ప్రాంతాన్ని పాలిస్తున్నారు. అదే ఏడాది గత ప్రభుత్వాన్ని పునరుద్ధరించేందుకు సౌదీ అరేబియా నేతృత్వంలోని కూటమి ప్రయత్నించినా ఇంతవరకూ సాధ్యపడలేదు. ఆ ఆగ్రహమే పలు మలుపులు తిరిగి నాటి నుంచి సౌదీ అరేబియా, ఇరాన్‌ల మధ్య శత్రుత్వాన్ని కొనసాగింది. ఇన్నాళ్లలో అక్కడి ఘర్షణల్లో 1,50,000 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. పెద్ద సంఖ్యలో పౌరులు, సైనికులను పొట్టనబెట్టుకున్న ఈ సంఘర్షణ ప్రపంచంలోనే అత్యంత దారుణ మానవసంక్షోభాల్లో ఒకటిగా నిలిచింది. 2.1 కోట్ల దేశజనాభాలో మూడింట రెండొంతుల మంది పేదలు అంతర్జాతీయ సాయంకోసం అర్రులుచాస్తున్నారు.

నీటి నిల్వలు తగ్గుతున్నాయ్..!

సాక్షి, న్యూఢిల్లీ: ఎండలు మండిపోతున్న వేళ...ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు క్రమంగా అడుగంటుతున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ పంటలకు పెరిగిన వినియోగం, లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం కారణంగా రిజర్వాయర్లలో నీటి మట్టాలు పడిపోతున్నాయి. దేశ వ్యాప్తంగా కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) పర్యవేక్షణలో 146 ప్రధాన జలాశయాలున్నాయి. వీటిల్లో నీటి నిల్వలు గత ఏడాది కన్నా 5శాతం తక్కువగా ఉన్నట్లు సీడబ్ల్యూసీ తాజా నివేదిక వెల్లడించింది. ఈ రిజర్వాయర్ల వాస్తవ నిల్వ సామర్థ్యం 178 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బీసీఎం) కాగా ప్రస్తుతం 70 బీసీఎంల నిల్వలు ఉన్నాయని, ఇవి గత ఏడాది నిల్వ 74 బీసీఎంలతో పోలిస్తే 5 శాతం తక్కువని సీడబ్ల్యూసీ వెల్లడించింది. దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడుల్లో సీడబ్ల్యూసీ పర్యవేక్షణలో మొత్తం 53 బీసీఎంల నిల్వ సామర్థ్యం కలిగిన 40 రిజర్వాయర్లుండగా, ప్రస్తుతం అందుబాటులో ఉన్న మొత్తం ప్రత్యక్ష నిల్వ కేవలం 16.737 బీసీఎంలని వివరించింది. రిజర్వాయర్ల మొత్తం ప్రత్యక్ష నిల్వ సామర్థ్యంలో ఇది 32 శాతం కాగా, గత ఏడాది కన్నా 7% తక్కువని తెలిపింది. ఇక ఏపీ, తెలంగాణలలోని 11 ప్రధాన రిజర్వాయర్లలో 20 బీసీఎంల నీటి నిల్వలకు గాను కేవలం 5.5 బీసీఎంల నిల్వలు మాత్రమే ఉన్నాయని, ఇవి గత ఏడాది నిల్వ 8 బీసీఎంలతో పోలిస్తే 11శాతం తక్కువని వెల్లడించింది. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో ఉన్న శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో 11.12 బీసీఎంల నిల్వలకు గానూ కేవలం 1.65 బీసీఎంల నిల్వలు మాత్రమే ఉన్నాయని, ఇవి గత ఏడాదితో పోలిస్తే 9% తక్కువని తెలిపింది.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించండి

న్యూఢిల్లీ: న్యాయవాదుల అసలైన సమస్యల పరిష్కారంపై హైకోర్టులు దృష్టి పెట్టాలని సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. ఇందులో భాగంగా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో రాష్ట్రస్థాయిలో ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కమిటీ ఏర్పాటు చేయాలని దేశవ్యాప్తంగా అన్ని హైకోర్టులకు తేల్చిచెప్పింది. కేసుల ఫైలింగ్ తదితరాల కోసం జిల్లా కోర్టు స్థాయిలో ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేయాలని సూచించింది.

కర్ణాటకలో 20 ప్రాంతాల్లో ప్రధాని మోదీ ప్రచారం!

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ విజయమే లక్ష్యంగా అధికార బీజేపీ వ్యూహాలు రచిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రంలో 20 ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం ఉందని కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై గురువారం వెల్లడించారు. మోదీ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు. రోడ్డు షోలలో మోదీ పాల్గొంటారని, ర్యాలీలు, బహిరంగ సభల్లో ప్రసంగిస్తారని తెలిపారు. స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో మొత్తం 40 మందికి చోటు కల్పించారు.


అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం బొకాచికా వైమానిక కేంద్రం నుంచి నింగిలోకి ప్రయోగించిన కొద్దిసేపటికే కుప్పకూలిపోతున్న స్పేస్‌ఎక్స్ సంస్థ వారి స్టార్‌షిప్ అంతరిక్ష నౌక. స్టార్‌షిప్ పైకెళ్లాక మొదటి దశలో నిర్ణీత సమయంలో రాకెట్ బూస్టర్ విడిపోవాల్సి ఉండగా అలా జరగలేదు. ఆ తర్వాత ఇలా పేలింది.

రాహుల్‌కు ఎదురుదెబ్బ

- పరువు నష్టం కేసులో జైలుశిక్షపై'స్టే' పిటిషన్‌ను తిరస్కరించిన సూరత్ కోర్టు
- గుజరాత్ హైకోర్టును ఆశ్రయించనున్న కాంగ్రెస్ నేత

సూరత్: కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పరువు నష్టం కేసులో తనను దోషిగా తేలుస్తూ కింది కోర్టు విధించిన జైలు శిక్షపై స్టే ఇవ్వాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను గుజరాత్‌లోని సూరత్ అదనపు సెషన్స్ కోర్టు గురువారం తిరస్కరించింది. ఒకవేళ కోర్టు స్టే విధిస్తే రాహుల్ ఎంపీగా మళ్లీ లోక్‌సభలో అడుగుపెట్టేందుకు అవకాశం దక్కేది. దొంగలందరి ఇంటిపేరు మోదీ అని ఎందుకుంటుంది? అని కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ప్రశ్నించిన రాహుల్‌పై గుజరాత్ బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేష్ మోదీ ఫిర్యాదు చేశారు. దీంతో గుజరాత్ పోలీసులు రాహుల్‌పై పరువు నష్టం కేసు నమోదు చేశారు. అభియోగాలు నిరూపితం కావడంతో రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ సూరత్‌లోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు మార్చి 23న తీర్పు వెలువరించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యుడిగా అర్హత కోల్పోయారు. ఆయనపై అనర్హత వేటు పడింది. పరువు నష్టం కేసులో కింది కోర్టు విధించిన శిక్షపై స్టే ఇవ్వాలని, బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రాహుల్ సూరత్‌లోని అదనపు సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. రెండు పిటిషన్లు దాఖలు చేశారు. ఏప్రిల్ 3న అదనపు సెషన్స్ కోర్టు రాహుల్‌కు బెయిల్ మంజూరు చేసింది. స్టే ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై అదనపు సెషన్స్ జడ్జి ఆర్‌పీ మొగేరా గురువారం తన నిర్ణయాన్ని ప్రకటించారు. ఆ పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఉత్తర్వు జారీ చేశారు. జైలుశిక్షపై స్టే విధించకపోవడం వల్ల వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కపోతే రాహుల్ గాంధీకి వాటిల్లే నష్టం ఏమిటో వివరించడంలో ఆయన తరఫు న్యాయవాది విఫలమయ్యారని పేర్కొన్నారు.

హైకోర్టును ఆశ్రయిస్తాం..

సూరత్ సెషన్స్ కోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ గుజరాత్ హైకోర్టును ఆశ్రయిస్తామని రాహుల్ గాంధీ తరఫు న్యాయవాది కిరీట్ పాన్‌వాలా చెప్పారు. తమ ప్రధాన అప్పీల్‌ను కోర్టు పూర్తిగా తోసిపుచ్చేదాకా రాహుల్ గాంధీ బెయిల్‌పై ఉంటారని తెలిపారు. సూరత్ సెషన్స్ కోర్టు ఉత్తర్వుపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పందించారు. చట్ట ప్రకారం అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటామని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. రాహుల్‌పై రాజకీయ దురుద్దేశంతో కేసు నమోదు చేశారని కాంగ్రెస్ నేత భూపీందర్‌సింగ్ హుడా విమర్శించారు. న్యాయ వ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని వెల్లడించారు. కోర్టు అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకొని రాహుల్ గాంధీ పిటిషన్ తిరస్కరించిందని పూర్ణేష్ మోదీ తరఫు లాయర్ హర్షిల్ తోలియా వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ పిటిషన్ విషయంలో సూరత్ కోర్టు నిర్ణయంపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా హర్షం వ్యక్తం చేశారు.


ఢిల్లీ వర్సిటీ వద్ద యూపీఎస్‌సీ అభ్యర్థులతో మాట్లాడుతున్న రాహుల్

ఐదుగురు జవాన్ల వీరమరణం

పూంచ్: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఉగ్రవాదుల దాడిలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. భారీ వర్షం, తక్కువ వెలుతురు మాటున ఉగ్రవాదులు ఘాతుకానికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం భింబెర్ గలి నుంచి సింగియోట్ వైపు వస్తున్న సైనిక వాహనంపైకి ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో నిప్పంటుకుంది. దీంతో, అందులోని ఐదుగురు జవాన్లు సజీవ దహనం కాగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. రాష్ట్రీయ రైఫిల్స్ విభాగానికి వీరంతా ఆ ప్రాంతంలోని ఉగ్రవాదుల ఏరివేతలో పాల్గొంటున్నారని చెప్పారు. వారి వాహనంపైకి ఉగ్రవాదులు గ్రనేడ్లు విసిరి ఉంటారని భావిస్తున్నామన్నారు. ఘటన అనంతరం ఆ రహదారిపై రాకపోకలను నిలిపివేసి, భారీ ఎత్తున కూంబింగ్ చేపట్టారు.


మంటల్లో ఆర్మీ వాహనం

గౌతమ్ అదానీతో పవార్ భేటీ

ముంబై: హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత అదానీ షేర్ల విషయంలో ఓవైపు సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) దర్యాప్తునకు విపక్షాలు పట్టుబడుతుంటే మరోవైపు కుబేరుడు గౌతమ్ అదానీతో మరో విపక్ష పార్టీ చీఫ్ శరద్ పవార్ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. గురువారం ముంబైలో ఎన్‌సీపీ అధ్యక్షుడు పవార్ ఇంట్లో వీరిద్దరూ కలిసి దాదాపు రెండు గంటలపాటు మాట్లాడుకున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. దేశీయ దిగ్గజ సంస్థ అదానీ గ్రూప్‌పై అదేదో అమెరికా కంపెనీ ఇచ్చిన నివేదికకు అంత ప్రాధాన్యత ఇవ్వడం అవసరమా ? అంటూ గతంలో పరోక్షంగా అదానీకి మద్దతు పలికిన పవార్‌తో గౌతమ్ అదానీ చర్చలకు దిగడం విపక్ష పార్టీల్లో చర్చనీయాంశమైంది.

ఎయిర్‌పోర్టులో అమృత్‌పాల్ భార్య అడ్డగింత

అమృత్‌సర్: పరారీలో ఉన్న ఖలిస్తానీ అనుకూల బోధకుడు అమృత్‌పాల్ సింగ్ భార్య కిరణ్‌దీప్ కౌర్ విదేశాలకు వెళ్లేందుకు చేసిన యత్నాన్ని అధికారులు అడ్డుకున్నారు. గురువారం మధ్యాహ్నం ఆమె అమృత్‌సర్‌లోని శ్రీగురు రాందాస్ ఇంటర్నేషనల్ విమానాశ్రయానికి వచ్చింది. మధ్యాహ్నం 1.20 గంటలకు ఎయిరిండియా విమానంలో లండన్ వెళ్లే విమానం ఎక్కాల్సి ఉంది. ఆమెపై లుకౌట్ నోటీసు ఉండటంతో ఇమిగ్రేషన్ తదితర విభాగాల అధికారులు ఎయిర్‌పోర్టులోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకుని, మూడు గంటలపాటు ప్రశ్నించి, తిరిగి వెనక్కి పంపించారు. ఈ ఘటనపై మీడియా ప్రశ్నలపై పంజాబ్ పోలీసులు స్పందించలేదు. అయితే, ఎయిరిండియా విమానం ఈ ఘటన కారణంగా గంట ఆలస్యంగా బయలుదేరిందని అధికారులు తెలిపారు. యూకే పౌరురాలైన కిరణ్‌దీప్ కౌర్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో అమృత్‌పాల్ నిరాడంబరంగా సొంతూరులోని గురుద్వారాలో వివాహం చేసుకున్నాడు.


ఎయిర్‌పోర్టు వద్ద కిరణ్‌దీప్ కౌర్

జాతీయ స్థాయిలో పెద్ద పార్టీల కూటమి అసాధ్యమే

'పీపుల్స్ డెమొక్రసీ'లో సీపీఎం స్పష్టీకరణ

న్యూఢిల్లీ: జాతీయ స్థాయిలో పెద్ద పార్టీలు చేతులు కలిపే అవకాశం లేదని సీపీఎం తన పత్రిక 'పీపుల్స్ డెమొక్రసీ' సంపాదకీయంలో పేర్కొంది. బడా రాజకీయ పార్టీలతో కూడిన కూటమి ఏర్పడడం అసాధ్యమేనని పేర్కొంది. ముఖ్యమైన జాతీయ, రాజకీయ అంశాలపై ఉమ్మడి వైఖరి ఉంటే తప్ప కొత్త కూటమిని ఊహించలేమని స్పష్టం చేసింది. కొన్ని పార్టీలు జాతీయ స్థాయిలో ఉమ్మడి వేదికపైకి వచ్చినా రాష్ట్రాల్లో ఒక్కటై కలిసి పని చేసే పరిస్థితి లేదని గుర్తుచేసింది. కేంద్రంలో అధికార బీజేపీ విధానాలపై పోరాటం కోసం కొన్ని పార్టీలు పిలుపునిస్తే ఇతర పార్టీలు పెద్దగా స్పందించడం లేదని తెలియజేసింది.

ఆలోగా విశ్వభారతి స్థలాన్ని ఖాళీ చేయాలి

నోబెల్ గ్రహీత అమర్త్యసేన్‌కు విశ్వవిద్యాలయం నోటీసు

కోల్‌కతా: విశ్వభారతి విశ్వవిద్యాలయంలోని స్థలాన్ని ఖాళీ చేయాలంటూ నోబెల్ గ్రహీత అమర్త్యసేన్‌కు అధికారులు నోటీసులిచ్చారు. యూనివర్సిటీలోని అనధికారికంగా ఆక్రమించుకున్న సుమారు 5,660 అడుగుల(13 డెసిమల్) స్థలాన్ని మే 6వ తేదీలోగా లేదా 15 రోజుల్లోగా ఖాళీ చేయాలని అందులో కోరారు. అమర్త్యసేన్, సంబంధీకులెవరైనా ఆ స్థలంలో ఉంటే ఖాళీ చేయిస్తామని పేర్కొన్నారు. అవసరమైతే బలప్రయోగానికీ వెనుకాడమని తెలిపారు. అమర్త్‌సేన్‌కు 1.25 ఎకరాల భూమిపై మాత్రమే లీజు హక్కులున్నాయని జాయింట్ రిజిస్ట్రార్ అశోక్ మహతో బుధవారం జారీ చేసిన నోటీసులో పేర్కొన్నారు. అయితే, తన తండ్రి 1.25 ఎకరాల స్థలాన్ని లీజుకు తీసుకున్నారని, మరో 13 డెసిమల్ స్థలాన్ని కొనుక్కున్నట్లు ఆధారాలున్నాయని అమర్త్య సేన్ అంటున్నారు.

భవ్య ప్రగతికి బుద్ధుని బోధనలే మార్గదర్శకాలు

- గ్లోబల్ బుద్ధిస్ట్ సమ్మిట్‌లో ప్రధాని మోదీ ఉద్బోధ

న్యూఢిల్లీ: గౌతమ బుద్ధుని బోధనలను ఆచరించి సుస్థిరాభివృద్ధిని సాధించవచ్చని ప్రధాని మోదీ అభిలషించారు. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు బుద్ధుడి బోధనలు చక్కని పరిష్కారాలు చూపగలవని మోదీ వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలో గ్లోబల్ బుద్ధిస్ట్ సమ్మిట్ సెషన్‌లో మోదీ ప్రారంభోపన్యాసం చేశారు. 'యుద్ధాలు, ఆర్థిక అస్థిరత, ఉగ్రవాదం, మత అతివాదం, వాతావరణ మార్పులు.. ఇలా ఎన్నో అంతర్జాతీయ సమస్యలు ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్నాయి. వీటికి గౌతముని సద్గుణ బోధనలు పరిష్కార మార్గాలు చూపుతాయి' అని అన్నారు. పర్యావరణ మార్పు సమస్యకు సంపన్న దేశాలే కారణమంటూ విమర్శించారు. బుద్ధుడు చూపిన మార్గం భవిష్యత్, సుస్థిర పథం. గతంలోనే ఆయన చూపిన మార్గంలో వెళ్లిఉంటే ఇప్పుడీ ప్రపంచానికి ప్రకృతి విపత్తులు దాపురించేవే కాదు. సంకుచిత భావన నుంచి విస్తృత సమ్మిళిత ప్రపంచ భావన దిశగా మళ్లడం అత్యావశ్యకం.



బుద్ధుని నుంచే భారత్ స్ఫూర్తి

గౌతముడి ఉపదేశాలను భారత్ ఆచరిస్తోంది. పెను భూకంపంతో కుప్పకూలిన తుర్కియేసహా పలు దేశాలకు ఆపన్నహస్తం అందించింది. బుద్ధుడు చూపిన మార్గాన్ని అనుసరించడమంటే సమస్యల నుంచి సమాధానం వైపునకు పయనించడమే' అని అన్నారు. సదస్సుకు 30 దేశాల నుంచి బౌద్ధ సన్యాసులు తదితరులు వచ్చారు.

'ఛార్‌ధామ్'కు మంచు తిప్పలు

గోపేశ్వర్: ఛార్‌ధామ్ యాత్ర మొదలుకానున్న నేపథ్యంలో విచ్చేసే లక్షలాది మంది భక్తులు, సందర్శకుల సౌకర్యార్థం చేపట్టిన మౌలికసదుపాయాలు తదితర సన్నాహక కార్యక్రమాలకు మంచు అడ్డుపడుతోంది. గురువారం బద్రీనాథ్, కేదార్‌నాథ్ పర్వతప్రాంతాల్లో విపరీతంగా మంచు కురిసింది. లోయ ప్రాంతాలను వర్షం ముంచెత్తింది. ఈ ఆలయాలు కొలువుతీరిన ఛమోలీ, రుద్రప్రయాగ్ జిల్లాల్లో మంచు, వర్షం, అతిశీతల గాలులు ఉష్ణోగ్రతలను తగ్గించేస్తున్నాయని అధికారులు తెలిపారు. మరో నాలుగు రోజుల్లో భక్తులను కేదార్‌నాథ్ ఆలయ దర్శనానికి అనుమతించనున్న ఈ తరుణంలో గుడికి వెళ్లే ట్రెక్ మార్గంలో మంచు పడుతోంది. అక్షయ తృతీయను పురస్కరించుకుని ఈనెల 22వ తేదీన గంగోత్రి, యమునోత్రి ఆలయాలు తెరుచు కోను న్నాయి. కేదార్‌నాథ్ ఆల యాన్ని 25వ తేదీన, బద్రీనాథ్ ఆలయాన్ని ఈనెల 27వ తేదీన భక్తుల సందర్శనార్థం తెరుస్తారు. లక్షలాది మంది ఛార్‌ధామ్ యాత్రకు తరలివస్తున్న ఈ సమయంలో మంచు ముంచుకురావడంపై స్థానిక అధికారులు ఆందోళన వ్యక్తంచేశారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శుక్రవారం : 21 : ఏప్రిల్ : 2023



ప్రజలకు మెరుగైన వైద్యం

ఉయ్యూరు: ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి అన్నారు. ఆనందపురం కమ్యూనిటీ హాల్లో కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు.



జిల్లా మేనేజర్‌గా వెంకటేశ్వర్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పౌరసరఫరాల శాఖ ఎన్టీఆర్ జిల్లా మేనేజర్‌గా జి.వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ ఢిల్లీరావును కలిశారు.



భక్తిశ్రద్ధలతో చండీ హోమం

రామవరప్పాడు : వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో గురువారం భక్తిశ్రద్ధలతో చండీ హోమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహరి (శని)
విజయవాడ	6.24	4.33
మచిలీపట్నం	6.28	4.28
జగ్గయ్యపేట	6.31	4.26

న్యూస్‌రీల్

అండర్-23 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అండర్-23 పురుషుల రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు అడహక్ కమిటీ కన్వీనర్ ఎం.రవిశంకర్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన ఎ.బ్రహ్మతేజ, పి.అనంతకార్తికేయ, టి.వరుణ్‌సాత్విక్, జి.చంటి, ఎం.సుశాంత్ నాయుడు, ఎల్.చిన్నా, వి.విశాల్, షేక్ ఖాజామొహిద్దీన్, పి.వి.దుర్గారావు, పి.కె.శ్రీచక్రి, సి.హెచ్.యుచన్, ఎం.మానస్, డి.సాయిఅఖిల్, కె.జస్వంత్, జి.నిఖిల్, కె.నాని జట్టులో స్థానం సాధించినట్లు చెప్పారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు మూలపాడు ఏసీఏ మైదానంలో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో జట్టు పాల్గొంటుందన్నారు.

వేట నిషేధం అమలుకు సహకరించాలి

అవనిగడ్డ: సముద్రంలో చేపలు, రొయ్యల వేట నిషేధ కాలం 61 రోజులు మత్స్యకారులెవరూ వేటకు వెళ్లకుండా సహకరించాలని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి వానపల్లి సత్యనారాయణ తెలిపారు. అవనిగడ్డ ప్రాంతీయ మత్స్య అభివృద్ధి కార్యాలయంలో చేపల వేట నిషేధ చట్టం అమలుపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ సముద్రంలో మత్స్య సంపద అభివృద్ధికి, మత్స్యకారుల దీర్ఘకాలిక ఉపాధి కోసం ప్రభుత్వం ఈ చట్టం తీసుకొచ్చిందని చెప్పారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్హత కలిగిన వారు తమ బ్యాంకు ఖాతాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)తో అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. మత్స్యకారుల సంఘం మాజీ ఉపాధ్యక్షుడు లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి, కోలా హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో దేవదాయ శాఖ కమిషనర్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ గురువారం రాత్రి ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన కమిషనర్‌కు ఈవో భ్రమరాంబ స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఆలయ ఈవో భ్రమరాంబ అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలు అందచేశారు.

గంగా పుష్కరాలకు 12 ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఈ నెల 23 నుంచి మే 3 వరకు గంగానది పుష్కరాలకు వెళ్లే యాత్రికుల కోసం తిరుపతి, గుంటూరు నుంచి 12 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. తిరుపతి–దనాపూర్ (07419) ఈ నెల 22, 29, మే6 తేదీల్లో ఉదయం 7.15 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.15 గంటలకు దనాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07420) ఈ నెల 24, మే 1, 8 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటలకు దనాపూర్‌లో బయలుదేరి రెండవ రోజు ఉదయం 7.45 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. గుంటూరు–బనారస్ (07230) ఈ నెల 22, 29, మే 6 తేదీల్లో రాత్రి 11.45 గంటలకు గుంటూరులో బయలుదేరి, రెండవ రోజు సాయంత్రం 4.30 గంటలకు బనారస్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07229) ఈ నెల 24, మే 1, 8 తేదీల్లో సాయంత్రం 6 గంటలకు బనారస్‌లో బయలుదేరి, రెండవ రోజు ఉదయం 6.30 గంటలకు గుంటూరు చేరుకుంటుంది.

పుష్కలంగా ఇసుక..

- సామాన్యులకూ అందుబాటులో ఉండేలా చర్యలు
- గృహ, ప్రభుత్వ భవన నిర్మాణాలకు ప్రాధాన్యం
- ఇసుక సరఫరాపై సెబ్, మైనింగ్ అధికారుల పర్యవేక్షణ
- ఉమ్మడి కృష్ణా జిల్లాలో 1.31 లక్షల టన్నుల నిల్వలు



నందిగామ మండలం పల్లగిరి సమీపంలో మున్నేటి నుంచి ట్రాక్టర్‌కు ఇసుక తోడుతున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: వేసవిలో నిర్మాణ రంగ పనులు ఊపందుకుంటున్న నేపథ్యంలో పుష్కలంగా ఇసుక అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఏ విధమైన ఇబ్బందులు లేకుండా అందరికీ సరఫరా చేస్తోంది. సామాన్యులు సైతం తేలికగా ఇసుక కొనుగోలు చేసుకునేందుకు వీలు కల్పించింది. ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా అధికారులు 27 ఇసుక రీచ్‌లకు అనుమతులు మంజూరు చేశారు. వీటి ద్వారా 129.37 హెక్టార్లలో 12,93,700 క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులోకి వచ్చింది. ప్రధానంగా జగనన్న ఇళ్లు, నాడు–నేడు పనులు, ప్రభుత్వ భవన నిర్మాణ పనులకు ప్రాధాన్యత క్రమంలో ఇసుక సరఫరా చేస్తున్నారు. ఈ పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌లు ఆన్‌లైన్‌లో బుక్ చేసిన వెంటనే ఇసుక పంపిస్తున్నారు. భవన నిర్మాణాలు ముమ్మరంగా కొనసాగుతున్నందున ఇసుక కొరత తలెత్తకుండా ఆయా శాఖల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లాలోని 9 ఇసుక డిపోల్లో 1,01,900 టన్నులు, కృష్ణా జిల్లాలోని 8 ఇసుక డిపోల్లో 20,300 మెట్రిక్ టన్నులు, ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా మొత్తం అన్ని ఇసుక డిపోల్లో 1.31 లక్షల టన్నులకు పైగా ఇసుక నిల్వలు సిద్ధంగా ఉంచారు. అందరికీ అందుబాటులో ఇసుక లభ్యమయ్యేలా చూస్తున్నారు. పారదర్శక విధానంలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన ధరకే నాణ్యమైన ఇసుక సరఫరా చేస్తున్నారు. ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తీసుకొనేందుకు వీలుగా సెబ్‌తో పాటు మైనింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

మరింత అందుబాటులోకి తెచ్చేందుకు.....

ఉమ్మడి కృష్ణా జిల్లాలోని గనిఅత్కూరు-2, మద్దూరు-3, నార్త్‌వల్లూరు-1, లంకపల్లిలంక-1, శ్రీశైలం-2, రొయ్యూరు-1, రొయ్యూరు-5, శ్రీకాకుళం-5, మద్దూరు-2 ఇసుక రీచ్‌లకు తోడు కృష్ణా నదిలో వరద తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో మరింత అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా కొత్తగా 27 ఓపెన్ రీచ్‌లకు అనుమతులు ఇచ్చారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వత్సవాయి, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలులో 11 రీచ్‌లు, నందిగామ నియోజకవర్గంలోని నందిగామ, చందర్లపాడు, కంచికచర్లలో 16 ఇసుక రీచ్‌లున్నాయి. దీంతో పాటు జిల్లాలో కొత్తగా 5 వేల క్యూబిక్ మీటర్ల కంటే తక్కువ సామర్థ్యం గల ఎనిమిది వాగుల్లో ఇసుకను సిద్ధం చేశారు. వీరులపాడు మండలం దొడ్డదేవరపాడులో రెండు, నందిగామ మండలం సోమవరంలో నాలుగు, తిరువూరు మండలం గానుగపాడులో ఒకటి, గంపలగూడెం మండలం కనుమూరులో ఒక దానిలో ఇసుకను స్థానిక అవసరాలకు వాడనున్నారు.

స్టాక్ యార్డులో ఇసుక

ఇసుక నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. అందరికీ ఇసుక అందేలా చర్యలు తీసుకుంటున్నాం. నాణ్యమైన ఇసుక సరఫరా చేస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. స్టాక్ యార్డులో సైతం ఇసుక నిల్వలు అందుబాటులో ఉన్నాయి.

– ఎస్.ఢిల్లీరావు, కలెక్టర్

వినియోగదారుల కోసమే ఎస్ఆర్‌టీ పాలసీ

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మా జనార్ధనరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 'అలా కుదరదు' అనే శీర్షికతో ఓ దినపత్రికలో ప్రచురితమైన వార్తను ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మా జనార్ధనరెడ్డి ఖండించారు. సోలార్ విద్యుత్ విధానంపై సమీక్ష చేసి తేడాలను గమనించి సోలార్ రూఫ్ టాప్ (ఎస్ఆర్‌టీ)-2018 పాలసీని బిల్లింగ్ కోసం అమలు చేస్తున్నామని తెలిపారు. సోలార్ విద్యుత్ వినియోగదారులకు నష్టం జరగకుండా చూడాలనే ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చామని చెప్పారు. ఎస్ఆర్‌టీ పాలసీకి అనుగుణంగా సోలార్ పలకలు పెట్టుకున్నవారికి, వాళ్ల ఇంటి అవసరాలు నిమిత్తం వాడుకున్న సోలార్ విద్యుత్‌కు డిస్కం మీటర్లలో ఈ వినియోగం నమోదు జరగదన్నారు. సోలార్ పలకలు బిగించిన తరువాత ఉత్పత్తి అయిన విద్యుత్తును వారి అవసరానికి వాడుకోగా మిగులు గ్రిడ్‌కు ఎగుమతి చేస్తామని వెల్లడించారు. దానిని ఏపీసీపీడీసీఎల్ మీటరు ద్వారా రికార్డు చేస్తామన్నారు. వినియోగదారుడు ఎగుమతి చేసిన యూనిట్లకు ఏపీఈఆర్‌సీ నిర్ణయించిన ధర ప్రకారం రూ.4.80 పైసలు చెల్లిస్తున్నామన్నారు.

సోలార్ పవర్ మార్కెట్‌లో తక్కువ ధరకు దొరుకుతున్నప్పటికీ ఏపీసీపీడీసీఎల్ ఎస్ఆర్‌టీ పాలసీని తూ.చ తప్పక పాటిస్తున్నామని స్పష్టం చేశారు. ఇందులో ఎటువంటి అపోహలకు ఆస్కారం లేదన్నారు. సోలార్ పలకలు అమ్ముకునే కొందరు వ్యాపారులు, సొంతగా బిగించి ఏపీసీపీడీసీఎల్ వినియోగదారులకు ఏపీఈఆర్‌సీ అనుమతులు లేకుండా విద్యుత్ అమ్ముకుంటున్నారన్నారు, బిల్లుల రూపంలో డబ్బులు వసూలు చేసి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారి పై విచారణ చేస్తామని వెల్లడించారు. విచారణ పూర్తయిన వెంటనే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సోలార్ పలకలపై వినియోగదారులకు ఎటువంటి సందేహాలు ఉన్నా తమ సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. సోలార్ నెట్ మీటరింగ్ పాలసీపై ఎటువంటి సందేహాలు అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

మార్కెట్‌లోకి విజయ నూతన ఉత్పత్తులు

బోర్డు సమావేశంలో ఆవిష్కరించిన చైర్మన్ చలసాని



నూతన ఉత్పత్తులను విడుదల చేస్తున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా, వారి ఆరోగ్యాన్ని కాపాడేలా కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) నూతన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకొస్తుందని ఆ సంస్థ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని కృష్ణా మిల్క్ యూనియన్ మార్కెట్‌లోకి రెండు కొత్త ఫ్లేవర్ బాదం పాలును గురువారం విడుదల చేసింది. పాలప్రాజెక్టు పరిపాలనా భవనంలో కృష్ణా మిల్క్ యూనియన్ బోర్డు సభ్యుల సమావేశం నిర్వహించారు. చైర్మన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశం గత ఆర్థిక సంవత్సరం లావాదేవీలు, ఆదాయ, వ్యయాలను వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో 200 ఎంఎల్ టెట్రాప్యాక్‌లో బాదంపాలు, చాక్లెట్ రుచిలో ఫ్లేవర్డ్ మిల్క్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. బాదంపాలు ప్యాక్ ధర రూ. 25, చాక్లెట్ రుచిలో రూ. 30కు అందిస్తున్నామని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం రూ.1110 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా లావాదేవీలు నిర్వహించామని తెలిపారు. పాడి రైతులకు రూ.55 కోట్లు బోనస్‌గా అందించడంతో పాటు రూ.15 కోట్ల సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేశామని వెల్లడించారు. ఇవి పోను రూ. 37 కోట్లు నికర ఆదాయాన్ని సాధించామని వివరించారు. రికార్డు స్థాయిలో 17 నుంచి 22 శాతం పాల సేకరణ పెరిగిందని పేర్కొన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో కృష్ణా మిల్క్ యూనియన్ రూ.1,250 కోట్ల టర్నోవర్ లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగుతుందని తెలిపారు. నాణ్యమైన విజయ పాల ఉత్పత్తులను వినియోగదారులకు అందించేందుకు పాడి రైతులతో పాటు సంఘాలు, కృష్ణా మిల్క్ యూనియన్ విశేష కృషి చేస్తుందన్నారు. ఎవరూ ఇవ్వనంత పాల గిట్టు బాటు ధర, బోనస్‌ను అందిస్తుందని చెప్పారు. సమావేశంలో కృష్ణా మిల్క్ యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, బోర్డు డైరెక్టర్లు, ట్రస్ట్ డైరెక్టర్లు, సమితి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌తో.. సైబర్ చోరీ

- పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ నంబర్‌తో నేరాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు
- డేటా చోరీ చేసి బ్లాక్ మెయిల్
- యూపీఐ యాప్‌ల ద్వారా ఖాతాలు లూటీ చేస్తున్న వైనం
- విజయవాడ సైబర్ పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు



విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ వన్‌టౌన్‌కి చెందిన ఓ వివాహిత ఐదు నెలల క్రితం తన ఫోన్ పోగొట్టుకుంది. పాత ఫోన్ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేయకుండా వదిలేసి.. కొత్తది కొనుగోలు చేసింది. పాత నంబర్ వదిలేసి కొత్త ఫోన్‌కు కొత్త నంబర్ తీసుకొంది. తన బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు తీసుకునేందుకు ఈ నెల 18వ తేదీన ఏటీఎంకు వెళ్లి ఖాతాలో నగదు లేవని తెలుసుకుని ఆశ్చర్యపోయింది. ఖాతాలో ఉన్న రూ. 3.17 లక్షలు ఏమయ్యాయని వెంటనే బ్యాంక్‌కు వెళ్లి ఆరా తీసింది. యూపీఐ యాప్‌ల ద్వారా ఖాతాలోని నగదు వేరే బ్యాంకు ఖాతాలకు మళ్లాయని తెలుసుకుని బోరున విలపిస్తూ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోగొట్టుకున్న ఫోన్ నంబర్ ఆమె బ్యాంకు ఖాతాకు అటాచ్ అయి ఉంది. రెండు వారాల క్రితం అదే నంబర్ వేరే వ్యక్తి తీసుకున్నాడు. (మూడు నెలలు నెంబర్ వాడకంలో లేకపోతే సర్వీస్ ప్రొవైడర్లు ఆ నంబర్‌ను వేరే వ్యక్తులకు కేటాయిస్తారు) ఆ వ్యక్తి అదే నంబర్‌తో ఫోన్ పే యాప్ ఇన్‌స్టాల్ చేయడంతో ఆ నంబర్‌కు గతంలో యాడ్ అయి ఉన్న ఆమె బ్యాంకు ఖాతా ఆటోమేటిక్‌గా రీసెట్ అయింది. దీంతో పాస్‌వర్డ్ మార్చుకుని ఆ వ్యక్తి ఆమె బ్యాంకు ఖాతాలో ఉన్న మొత్తం నగదు నాలుగు రోజుల వ్యవధిలో వేరే బ్యాంకు ఖాతాలకు మళ్లించేశాడు. ఈ విషయాలన్నీ ప్రాథమిక విచారణ అనంతరం పోలీసులు చెప్పడంతో ఆమె కంగుతింది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇదే తరహా నేరాలు ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లాలో అత్యధికంగా జరుగుతున్నాయి. గత 30 రోజుల వ్యవధిలో 17 ఫిర్యాదులు అందినట్లు పోలీసులు చెబుతున్నారు. చోరీకి గురైన ఫోన్‌లు ఢిల్లీ, కోల్‌కత్తా నగరాలకు చేరుతున్నాయని పోలీసులు అంటున్నారు. ఆయా ప్రాంతాల నుంచే సైబర్ నేరగాళ్లు మొబైల్‌లోని డేటాని కాపీ చేసి నేరాలకు పాల్పడుతున్నారు.

మోసం చేసేది ఇలా....

ఫోన్‌లోని కాంటాక్ట్ నెంబర్స్‌కు కాల్ చేసి మీకు తెలీయకుండానే, మీరు అడిగినట్లే మీ స్నేహితులు, బంధువులు, సహోద్యోగులు, వ్యాపార భాగస్వాముల నుంచి డబ్బులు వసూలు చేస్తారు. మీ పేరునే సోషల్ మీడియా ఫేక్ ఖాతాలను తెరిచి వ్యాపార/ఉద్యోగ రహస్యాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తారు. మీ వ్యాపార వ్యవహారాలన్నింటిని ఫేక్‌గా మార్చేస్తారు. గ్యాలరీలోని మీ ఆధార్, పాన్, క్రెడిట్ కార్డుల ద్వారా ఏఈపీఎస్ నేరాలకు పాల్పడతారు. గ్యాలరీలోని ఫొటోలను మార్ఫింగ్ చేసి బెదిరింపులకు పాల్పడతారు. గ్యాలరీలో న్యూడ్ వీడియోలు ఉంటే నేరగాళ్లు మరింత రెచ్చిపోతారు. బ్యాంకు పాస్ పుస్తకంపై ఉన్న నెంబర్ ఆధారంగా బ్యాంకు ఖాతాలోని నగదు ఎంత ఉందో తెలుసుకుని లూటీ చేస్తారు.

పర్సనల్‌గా సేవ్ చేసుకున్న వాయిస్ రికార్డింగ్‌లను ఆసరాగా చేసుకుని బ్లాక్‌మెయిల్‌కు దిగుతారు. గూగుల్ ఎకౌంట్‌ను హ్యాక్ చేసి, మీ గూగుల్ ఖాతాలను మీకు తెలీయకుండానే పలు రకాలుగా వాడేసి డబ్బులు సంపాదిస్తారు. హార్డ్ డిస్క్‌లోని సెక్టార్స్‌ను రీరైడ్ చేసి మీ వ్యక్తిగత ఇన్ఫర్మేషన్ పూర్తిగా సేకరిస్తారు. అమెజాన్, ఓఎల్ఎక్స్, ఫ్లిప్‌కార్ట్ ఖాతాల ద్వారా వారే వస్తువులు కొనుగోలు చేసేస్తారు. యూపీఐ (ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం) యాప్‌లను ఖాతాల్లోని నగదును వేరే ఖాతాలకు మళ్లించుకుంటారు.

అప్రమత్తంగా ఉండాలి



ఫోన్ పోయిందని గుర్తించిన వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. వీలైనంత త్వరగా సిమ్‌ను బ్లాక్ చేయించాలి. కంప్యూటర్ ద్వారా గూగుల్‌తో కనెక్ట్ అయ్యి అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఓఎల్ఎక్స్, యూపీఐ ఖాతాలకు లాగిన్ అయ్యి పాస్‌వర్డ్ మార్చేయాలి. సాధ్యమైనంత త్వరగా అదే నంబర్‌తో వేరే సిమ్ తీసుకోవాలి. ఫోన్ పోయిన తరువాత ఒక వేళ కొత్త నెంబర్ తీసుకుంటే.. ఆ కొత్త నంబర్‌ను బ్యాంక్ ఖాతా, ఆధార్‌కు జత చేయాలి. ప్రస్తుతం జరుగుతున్న సైబర్‌నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి.

– టీకే రాణా, పోలీస్ కమిషనర్

సమ్మెటివ్-2 పరీక్షలు ప్రారంభం



పునాదిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

కంకిపాడు: సమ్మెటివ్-2 పరీక్షలు ఉమ్మడి కృష్ణా జిల్లాలో గురువారం ప్రారంభమయ్యాయి. విద్యాశాఖ పర్యవేక్షణలో జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం నేతృత్వంలో సమ్మెటివ్ పరీక్షలు ప్రశాంతంగా మొదలయ్యాయి. తొలిరోజు విద్యార్థులు తెలుగు పరీక్ష రాశారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటుగా పైలెట్ సర్వేలో ఎంపిక చేయబడ్డ ప్రైవేటు/ఎయిడెడ్ విద్యాసంస్థల్లోనూ ఒకే విధానంలో పరీక్ష నిర్వహించారు. ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన పాఠ్యపుస్తకాల ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో విద్యాబోధన తప్పనిసరి చేశారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థుల ప్రతిభ, స్థాయి మదింపు, విద్యా ప్రమాణాల పెంపుదలకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలను అందించేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంది. ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా 119 పాఠశాలలను ఎంపిక చేసింది. ఎంపిక చేసిన పాఠశాలలకు జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం ద్వారా సామగ్రిని సరఫరా చేశారు. ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లను అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ 1–8వ తరగతి వరకూ క్లాస్‌రూం బేస్డ్ అసెస్మెంట్‌పై దృష్టి సారించి ఓఎంఆర్ షీట్లను అందించి పరీక్ష రాయించారు. పరీక్షల నిర్వహణ తీరును కృష్ణా జిల్లా డీఈఓ తాహెరా సుల్తానా, ఎన్టీఆర్ జిల్లా డీఈఓ రేణుక, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి ఉమర్ అలీ పర్యవేక్షించారు.

ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని పాలిసెట్‌లో మంచి ర్యాంక్ సాధించాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతులు ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మితో కలిసి ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. 10వ తరగతి పరీక్షలు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ర్పాటు చేసిన ఉచిత పాలిటెక్నిక్ క్లాసులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతీ ఏటా నిరుపేద, పేద విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఇటువంటి ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేయటం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు, నాయకులు మన్మథ, రాజకుమార్, షైనీ, కుమారస్వామి, భార్గవ్ పాల్గొన్నారు.



ఈవీ చార్జింగ్ స్టేషన్ ప్రారంభం

విజయవాడ భవానీపురంలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (అప్‌కాస్ట్) రీజనల్ సైన్స్ సెంటర్‌లో న్యూ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్‌ను గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. సోలార్ పారాబోలిక్ కుక్కర్‌ను మంత్రి తదితర ప్రజాప్రతినిధులు పరిశీలిస్తున్న చిత్రమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

జడ్జిల బదిలీ

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో 13 మంది జూనియర్ సివిల్ జడ్జీలను బదిలీ చేస్తూ గురువారం రాత్రి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి కావలి పీజేసీజేగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కృష్ణా జిల్లా గుడివాడ పీజేసీజే సీహెచ్ కిషోర్‌కుమార్ రానున్నారు.

క్లుప్తంగా

సేవా పతక విజేతలు వీరే..

భవానీపురం(విజయవాడపశ్చిమ): పోలీస్ శాఖలో చేసిన విశిష్ట సేవలకుగాను ఉగాది – 2023ను పురస్కరించుకొని పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఉత్తమ సేవా, సేవా పతకాలను ప్రకటించారు. ఈ మేరకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉత్తమ సేవా పతకాన్ని విజయవాడ కోర్ట్ మానిటరింగ్ సిస్టమ్ ఇన్‌స్పెక్టర్ కానుపూడి ఉమామహేశ్వరరావు అందుకోనున్నారు. సేవా పతకాలను వట్టికుంట వెంకటేశ్వ నాయుడు (ఏసీపీ దిశ), బానోతు సత్రు (ఏఎస్‌ఐ, విస్సన్నపేట పీఎస్), తలారి జోజప్ప (హెచ్‌సీ 225, సీటీ స్పెషల్ బ్రాంచ్), భూక్యా రత్న నాయక్ (ఏఆర్ హెచ్‌సీ 1704, సీఏఆర్), గన్నవరపు నాగేశ్వరావు (హెచ్‌సీ 4193, గంపలగూడెం పీఎస్), కుంభం వడ్డీకాసులు (హెచ్‌సీ 1438, టూ ట్రాఫిక్ పీఎస్), గొక్కు మురళీకృష్ణ (ఏఆర్ పీసీ 3275, సీఏఆర్) అందుకోనున్నారు. వీరిని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె. రాణా గురువారం అభినందించారు.

1,25,525 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,22,018 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,25,525 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,200 నుంచి రూ.25,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 87,727 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నిషేధిత రసాయనాలు వినియోగిస్తే కఠిన చర్యలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కాల్షియం కార్బైడ్ రసాయనాన్ని ఉపయోగించి కృత్రిమ పక్వతతో మామిడి పండ్లను తయారుచేసే వ్యాపారులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులను నమోదు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. నిషేధించిన రసాయనాలతో పండ్ల తయారీని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో గురువారం కలెక్టర్ ఢిల్లీరావు తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మామిడి, బొప్పాయి, అరటి మొదలైన పండ్లను తయారు చేయడంలో ప్రజారోగ్యానికి హానికరమైన రసాయనాలను ప్రభుత్వం నిషేధించిందన్నారు. కాయలను పండ్లుగా మార్చేందుకు కొందరు వ్యాపారులు రసాయనిక పదార్థాలను ఉపయోగిస్తారన్నారు. జిల్లాలోని విస్సన్నపేట, నూజివీడు, నగర సమీపంలోని కేదారేశ్వరపేట, నున్న మాంగో మార్కెట్ వంటి ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలను నిర్వహించాలన్నారు. కాల్షియం కార్బైడ్‌తో మామిడి పండ్ల తయారు చేస్తున్నట్లు గుర్తిస్తే.. అటువంటి వారిపై సెక్షన్59 కింద కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలాజి కుమార్, ఫుడ్ సేఫ్టీ గెజిట్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేష్ బాబు, మార్కెటింగ్ శాఖ ఏడీ కిశోర్, మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్ ఎం. ప్రభాకర్ రావు, యూసీడీ పీఓ శకుంతల పాల్గొన్నారు.

'గడప గడప'లో గుర్తించిన పనులు వేగవంతం

అధికారులకు కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించి చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనుల ప్రగతిని గురువారం కలెక్టర్ ఆయన కార్యాయలయం నుంచి పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, నగర పాలక సంస్థ, మున్సిపల్ కమిషనర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గడప గడపకు మన ప్రభుత్వంలో పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూఎస్, మున్సిపల్ శాఖల పరిధిలో 765 పనులు గుర్తించారన్నారు. వీటిలో 560 పైగా పనులను గుత్తేదారులు ప్రారంభించారని తెలిపారు. ఇంకా ప్రారంభం కావాల్సిన 130 పనులకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. టెండర్ ప్రక్రియ అనంతరం కాంట్రాక్టర్లతో పనులను త్వరితగతిన ప్రారంభింప చేయాలని అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థలో 82 పనులు, జగ్గయ్యపేట మున్సిపల్ పరిధిలో 38 పనులు ఇంకా ప్రారంభం కావాల్సి ఉందన్నారు. ఆ పనులకు త్వరితగతిన టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు.

హోరాహోరీగా చెస్ పోటీలు



తలపడుతున్న క్రీడాకారిణులు

విజయవాడ స్పోర్ట్స్: చదరంగం అండర్–17 బాలికల రాష్ట్ర స్థాయి రేటింగ్ టోర్నమెంట్ కృష్ణాజిల్లా పోరంకిలోని గ్రీన్ స్కూల్‌లో గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన నాలుగు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు 26 జిల్లాల నుంచి 50 మంది క్రీడాకారిణులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గ్రీన్ స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ సుస్మిత, బ్రెట్ చిల్డ్రన్ ఆస్పత్రి డైరెక్టర్ ఆర్.శ్రీనివాస రావు ఈ పోటీలను ప్రారంభించారు.

మొత్తం ఎనిమిది రౌండ్లు పోటీలు జరుగుతాయి. ఒక్కో రౌండ్ నాలుగు గంటల పాటు కొనసాగుతుంది.

దీనిలో భాగంగానే తొలి రోజు జరిగిన రెండు రౌండ్లలో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, చీఫ్ ఆర్బిటర్ ఎ.ఉదయ్‌కుమార్, డెప్యూటీ ఆర్బిటర్ టి.నరేష్, ఆర్బిటర్లు ఆనంద్ బాబు, నబి, కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఎం.ఫణికుమార్ పర్యవేక్షించారు. ఈ పోటీల్లో మొదటి, రెండో స్థానం సాధించిన క్రీడాకారులు జాతీయ పోటీలకు అర్హత సాధిస్తారని నిర్వాహకులు తెలిపారు.

24న క్రీడా జిల్లా జట్ల ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: సీఎం కప్ రాష్ట్ర స్థాయి స్త్రీ,పురుషుల బాల్‌బాడ్మింటన్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, బాక్సింగ్, హాకీ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణా జిల్లా జట్లను ఈ నెల 24వ తేదీన ఎంపిక చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈవో యు.శ్రీనివాసరావు, చీఫ్ కోచ్ అజీజ్ తెలిపారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఆ రోజు ఉదయం ఎనిమిది గంటలకు జట్ల ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయన్నారు. 15 సంవత్సరాలు వయసు పైబడిన వారు ఈ పోటీలకు అర్హులన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆధార్ కార్డుతో స్టేడియంలోని కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



కొత్త ఊళ్లకు కొంగొత్త హంగులు

- జగనన్న లే అవుట్‌లలో సమకూరుతున్న వసతులు
- శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు
- ఊళ్లుగా మారుతున్న జగనన్న కాలనీలు
- స్వాగత ద్వారాలకు రూ. 2.90 కోట్లు మంజూరు



ఉప్పలూరులోని జగనన్న కాలనీలో జరుగుతున్న విద్యుదీకరణ పనులు

కంకిపాడు(పెనమలూరు): జగనన్న లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. సకల హంగులు సమకూరుతుండటంతో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ వేగం పుంజుకుంది. నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసి నివాసం ఉంటున్నారు. ఇళ్ల నిర్మాణాలతో లే అవుట్‌లు కాస్తా ఊళ్లను తలపిస్తున్నాయి. పేదలకు కేటాయించిన లే అవుట్‌లు కార్పొరేట్ సంస్థలు నిర్మించే లే అవుట్‌లను తలదన్నేలా స్వాగత ద్వారాలను నిర్మించేందుకు నిధులు కేటాయింపులు, పరిపాలనా ఆమోదం లభించాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

కృష్ణాజిల్లా వ్యాప్తంగా నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా 670 లే అవుట్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో 93,245 గృహాలు మంజూరు చేయగా, 91,250 గృహాలు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. ఈ ఏడాది ఉగాది నాటికి 13వేల గృహాలు నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించుకోగా 14,023 గృహాలు పూర్తయ్యేలా జిల్లా యంత్రాంగం కృషి చేయటంతో జిల్లా ప్రథమస్థానం దక్కటం తెలిసిందే. ఇప్పటి వరకూ రూ. 362.15 కోట్ల సొమ్మును లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాల నిమిత్తం చెల్లింపులు చేశారు.

వేగంగా వసతుల కల్పన..

ఇళ్ల నిర్మాణాలకు అనువుగా జగనన్న లే అవుట్‌లు (జగనన్న కాలనీలు)లో వసతుల కల్పన పనులు వేగంగా సాగుతున్నాయి. ఆయా లే అవుట్‌ల మెరక పనులు, అంతర్గత రహదారులు, విద్యుదీకరణ పనులకు ఇప్పటికే రూ. 82.66 కోట్లు వెచ్చించారు. ఈ నిధులతో కాలనీలకు విద్యుత్ వసతి, రహదారి వసతి సమకూరింది. మెరక పనులతో ముంపు సమస్య నుంచి లబ్ధిదారులకు ఊరట లభించింది. తాగునీటి వసతుల కల్పనకు గానూ రూ. 64.88 కోట్లు నిధులు వెచ్చించి వసతులు కల్పించారు. దీంతో నివేశనస్థలం కేటాయించిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు వచ్చి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకుంటున్నారు. ప్రభుత్వం చెల్లించే సొమ్ముతో పాటుగా డ్వాక్రా మహిళలకు రూ. 35 వేలు, సీఐఎఫ్ కింద రూ. 35 వేలు, ఉన్నతి పథకం కింద రూ. 50 వేలు రుణాలను బ్యాంకుల నుంచి అందిస్తుండటంతో నిర్మాణాలు ఊపందుకుంటున్నాయి. ఫలితంగా జగనన్న లే అవుట్‌లు వసతులతో కూడిన ఊళ్లను తలపిస్తున్నాయి.

కార్పొరేట్‌కు దీటుగా..

పేదలకు కేటాయించిన జగనన్న లే అవుట్‌లలో వసతుల కల్పనతో పాటుగా కార్పొరేట్‌కు దీటుగా కాలనీలను తయారు చేసే పనిలో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమైంది. ఆయా కాలనీలకు ఆకర్షణీయంగా కార్పొరేట్ సంస్థలు నిర్మించే రియల్ వెంచర్లను తలదన్నేలా స్వాగత ద్వారాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా కృష్ణాజిల్లాలో తొలి విడత 63 లే అవుట్‌లలో స్వాగత ద్వారాల ఏర్పాటుకు రూ. 2.90 కోట్లు నిధులు కేటాయించింది. ఇందుకు సంబంధించి పరిపాలనా ఆమోదం లభించటంతో గృహనిర్మాణ సంస్థ ఆర్చ్‌ల నిర్మాణ పనులపై దృష్టి సారించింది. వారంలో పనులు ప్రారంభించేందుకు సమాయత్తం అయ్యింది.

సకల వసతులు కల్పిస్తున్నాం..

జగనన్న లే అవుట్లను సకల వసతులతో తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. ఇప్పటికే 15వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో రెండు నెలల్లో 23 వేల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాం. వసతుల కల్పనలో రాజీ పడకుండా సమర్థంగా పర్యవేక్షిస్తూ చర్యలు చేపడుతున్నాం. స్వాగత ద్వారాల పనులు వారంలో ప్రారంభమవుతాయి.

– జి.వి.సూర్యనారాయణ, ఇన్‌చార్జి పీడీ, గృహ నిర్మాణ సంస్థ, కృష్ణాజిల్లా

లో వోల్టేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



లక్ష్మీనగర్ సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి చిత్రంలో ఎమ్మెల్యే, మేయర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి గడపకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్‌లను నిర్మిస్తున్నామని విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక లక్ష్మీనగర్, గద్దె వెంకట్రామయ్యనగర్‌లో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌లను గురువారం సాయంత్రం ఆయన స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఏపీసీపీడీసీఎల్ చైర్మన్ అండ్ ఎండీ జె. పద్మజనార్దన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ సమస్యలతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రజల అవసరాలకు అనుగుణంగా లక్ష్మీనగర్‌లో రూ.3.4 కోట్లు, గద్దె వెంకట్రామయ్యనగర్‌లో రూ. 3.6 కోట్లు వ్యయంతో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌లు నిర్మించామన్నారు. దీంతో కోతలు లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తాము పనిచేస్తున్నామన్నారు. విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే గుర్తించి వాటికి అనుగుణంగా చర్యలు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, కార్పొరేటర్‌లు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల సభ పోస్టర్ ఆవిష్కరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్న నాయీబ్రాహ్మణ కృతజ్ఞతా సభకు సంబంధించి ముద్రించిన పోస్టర్‌ను రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆవిష్కరించారు. గురువారం మంత్రి జోగి రమేష్‌ను ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య ఇబ్రహీంపట్నంలోని మంత్రి ఇంట్లో కలిసి కృతజ్ఞతా సభ ఆహ్వానాన్ని అందించారు. అనంతరం ఆహ్వానపత్రాన్ని మంత్రి జోగి రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల్లోని ప్రతి కులం అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలందరూ కృతజ్ఞులై ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీ ఆలయాల కేశఖండన నాయీబ్రాహ్మణ జేఏసీ అధ్యక్షుడు గుంటుపల్లి రామదాసు, ఉపాధ్యక్షుడు ఆర్‌వీ రమణ, కోశాధికారి ఏజీఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి గాయాలు

పామర్రు: మండల పరిధిలోని పామర్రు–దిగమర్రు జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రగాయాలపాలైన సంఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుడివాడ నుంచి బైక్‌పై ఉయ్యూరుకు చెందిన కొడాలి శేషు(30) తన స్నేహితునితో కలిసి పామర్రు–దిగమర్రు జాతీయ రహదారిపై వస్తున్నారు. ఈ క్రమంలో బైక్ కొండాయపాలెం వద్దకు చేరుకునే సమయానికి అదేమార్గంలో వెనకాల నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం బైక్ బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో కొడాలి శేషుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక కూర్చున్న వ్యక్తికి తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా ఉండటంలో మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలం చేరుకున్న పామర్రు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

24న చౌక్‌బాల్ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు

చిలకలూరిపేటటౌన్: రాష్ట్ర చౌక్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి జూనియర్, సబ్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికను ఈ నెల 24వ తేదీ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ చైర్మన్ చేబ్రోలు మహేష్ చెప్పారు. పట్టణంలోని గ్రీన్‌వాలీ పాఠశాలలో మధ్యాహ్నం 2గంటలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలకు 9866419567కు సంప్రదించాలన్నారు.

ఇరువురికి కఠిన కారాగార శిక్ష

గన్నవరం: ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ వెటర్నరీ స్టూడెంట్‌ను బెదిరించి సెల్‌ఫోన్, ఉంగరాన్ని లాక్కొనిపోయిన ఇరువురు నిందితులకు స్థానిక 12వ ఏఎంఎం కోర్టు గురువారం జైలుశిక్ష, జరిమానా విధించింది. వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన కోట శంకర్ స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో బీవీఎస్సీ చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో శంకర్‌కు ఫేస్‌బుక్ ద్వారా కేసరపల్లి శివారు దుర్గాపురానికి చెందిన కర్నే సంపత్‌కుమార్, వీరపనేనిగూడెంకు చెందిన బాణవతు లక్ష్మణజితేంద్ర పరిచయమయ్యారు. ఈ పరిచయంతో 2021 జూలై 30వ తేదిన శంకర్‌ను సంపత్‌కుమార్, జితేంద్ర బైక్‌పై దుర్గాపురం సమీపంలో ఉన్న వెంచర్‌లోకి తీసుకువెళ్లారు. అక్కడ శంకర్‌ను బెదిరించి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్, మూడు కాసుల ఉంగరాన్ని బలవంతంగా లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనపై శంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక 12వ ఏఎంఎం కోర్టులో కొనసాగుత్ను కేసు విచారణ నేపథ్యంలో నేరం రుజువు కావడంతో నిందితులు ఇరువురికి ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ. వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఏ. శిరీష తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ వి. ప్రసన్న వాదనలు వినిపించారు.

వ్యక్తి ఆత్మహత్య

గుడివాడ టౌన్(నందివాడ): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నందివాడ మండలం వెన్ననపూడి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కుదరవల్లి గ్రామానికి చెందిన మెండెం కుటుంబరావు(55) ఇదే మండలానికి చెందిన వెన్ననపూడి గ్రామంలో గల చేపల చెరువుపై కాపలా ఉంటున్నారు. శుక్రవారం భార్యాభర్తల మధ్య మాటమాట పెరగడంతో ఇరువురు కలిసి స్వగ్రామమైన కుదరవల్లికి వెళ్లారు. భార్యను అక్కడే ఉంచి కుటుంబరావు తిరిగి చేపల చెరువు కాపలా ఉంటున్న నివాసం వద్దకు వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇది గమనించిన స్థానికులు కుటుంబరావును ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శిరీష తెలిపారు.

నాలుగేళ్ల చిన్నారిపై కుక్క దాడి

పామర్రు: మండల పరిధిలోని కురుమద్దాలి గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిపై కుక్క దాడి చేసిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రెమల్లి రాజా తన నాలుగేళ్ల కుమారుడు జాయ్‌ప్రమోద్‌తో కలిసి గ్రామంలోని చర్చిలో ప్రార్థనకు బుధవారం రాత్రి 9 గంటల సమయంలో వెళ్లారు. అదే సమయంలో ప్రమోద్ మరొక ఇద్దరు చిన్నారులు కలిసి చర్చి బయటకు వెళ్లారు. తిరిగి వస్తుండగా పక్కనే ఉన్న మద్దాలి కనకారావుకి చెందిన పెంపుడు కుక్క వీరిపై దాడి చేసింది. ఈ దాడిలో ఇరువురు చిన్నారులు తప్పించుకోగా జాయ్ ప్రమోద్ తప్పించుకోలేక పోవడంతో అతని మొకాలును కుక్క కరిచింది. కంగారు పడిన ప్రమోద్ రోడ్డుపై పడిపోయాడు. దీనితో మోచేతికి, ఎడమ కాలికి కూడా గాయాలయ్యాయి. దీంతో గురువారం కనుమూరు పీహెచ్‌సీలో వ్యాక్సిన్ వేయించి అనంతరం క్షతగాత్రుని తండ్రి రాజా కుక్కకు సంబంధించిన యజమానిపై పామర్రు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నిందితుల కోసం కొనసాగుతున్న గాలింపు

ఖుద్దూస్‌నగర్ హత్యకేసు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఖుద్దూస్ నగర్‌లో బుధవారం రాత్రి జరిగిన హత్య ఉదంతంలో మరొకరి హస్తం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడు నవీన్‌తో పాటు అతని అన్న జగదీష్ కూడా ఈ హత్యలో పాలు పంచుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఇద్దరి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మైనర్‌తో ప్రేమ వ్యవహారం నడుపుతున్న నవీన్ అనే యువకుడి కుటుంబానికి.. ఆ మైనర్ బాలికకు చెందిన కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న వివాదంలో మైనర్ మేనమామ అయిన శ్రీనివాసరావును ప్రియుడు నవీన్ దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో మొదట పోలీసులు నవీన్ మాత్రమే హత్యచేసినట్లు నిర్ధారించుకుని ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నవీన్‌తో పాటు అతని అన్న జగదీష్ కూడా హత్యలో పాలుపంచుకున్నట్లు గుర్తించారు. సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌లో రెండు చోరీ కేసుల్లో జగదీష్ నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లి చెంతకు చేరిన మైనర్..

టిఫిన్‌కి అని చెప్పి బయ టకు వెళ్లి, పారిపోయిన మైనర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఇరు కుటుంబాల మధ్య గొడ వకు, మైనర్ మేనమామ హత్యకు కారణం ఆ మైనర్ తప్పించుకుపారిపోవడమే కారణం. కాగా ఆ బాలిక నగరంలోనే సంచరిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు గురువారం ఆమె తల్లికి అప్పగించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

గుడివాడ టౌన్(నందివాడ): ఉరి వేసుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన నందివాడ మండలం పోలుకొండ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మానేపల్లి యెషయా(35) అదే గ్రామానికి చెందిన ఓ తెలుగుదేశం నాయకుని ఇంట్లో పనిచేస్తుంటారు. అయితే గురువారం మధ్యాహ్నం యెషయా తాను పనిచేసే నాయకుని ఇంట్లోని గొడ్లచావిడిలో ఉరికి వేలాడుతుండగా.. ఆ ఇంట్లోనే పనిచేస్తున్న మరో వ్యక్తి దీనిని గమనించి యజమానికి తెలిపాడు. దీంతో యెషయాను కిందకు దించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. యెషయాకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, ప్రస్తుతం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శిరీష తెలిపారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): రింగ్ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. క్రీస్తురాజపురం, ఆర్సీఎం చర్చి ఏరియా, అమ్మ కల్యాణ మండపం, నవోదయ కాలనీ, మిథులానగర్ పంప్‌హౌస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

నేడు మెప్మా అర్బన్ మార్కెట్ ప్రదర్శన

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ, పట్టణ సామాజికాభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో నగరంలోని డ్వాక్రా సంఘాలు రూపొందించిన వస్తువులు ప్రదర్శన మెప్మా అర్బన్ మార్కెట్ నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బందరురోడ్డు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఈట్‌స్ట్రీట్ వద్ద వస్తువుల ప్రదర్శన, విక్రయాలు జరుగుతాయన్నారు. ఈ ప్రదర్శనలో పాల్గొని పొదుపు సంఘాలు రూపొందించిన వస్తువులు కొనుగోలు చేసి ఆయా సంఘాలలకు ఆర్థిక తోడ్పాటు కల్పించాలని కోరారు.

ముందస్తు పన్ను చెల్లింపులపై 5 శాతం రాయితీ

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులపై 2023–24 ఆర్థిక సంవత్సరం ముందస్తు పన్ను చెల్లింపుదారులకు 5 శాతం రాయితీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని వీఎంసీ డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం ఈ నెల 30వ తేదీ వరకు ఉందన్నారు. పన్నుల చెల్లింపుదారులు ఆయా డివిజన్లలోని వీఎంసీ క్యాష్ కౌంటర్లు సెలవు రోజుల్లోనూ అందుబాటులో ఉంటాయన్నారు. క్యాష్ కౌంటర్లు ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తాయన్నారు. ఈ అవకాశాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మయూర్‌లో అక్షయ తృతీయ స్పెషల్ సేల్

లబ్బీపేట(విజయవాడతూర్పు): వినియోగదారుల అభిరుచి ఫ్యాషన్ ఒరవడికి తగ్గట్టుగా కొత్త డిజైన్లతో ఎంజీ రోడ్డులోని మయూర్ జ్యూయలర్స్‌లో అక్షయ తృతయ స్పెషల్ సేల్ గురువారం ప్రారంభం కాగా, ఈ నెల 23వ తేదీ వరకూ కొనసాగిస్తామని ఆ సంస్థ అధినేత భవత్‌జైన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో భాగంగా బంగారు ఆభరణాల తరుగుపై 25 శాతం, డైమండ్‌పై 10 శాతం తగ్గింపు ఇస్తున్నామన్నారు. బంగారం స్వచ్ఛతకు అంతర్జాతీయ హాల్‌మార్క్‌పై అవగాహన కలిగించి విజయవాడ నగరంలో తొలిసారిగా 2001 నుంచి ప్రభుత్వ సర్టిఫైడ్ హాల్‌మార్క్ గుర్తింపుతో 916 స్వచ్ఛమైన హాల్‌మార్క్ బంగారాన్ని మయూర్ జ్యూయలర్స్ అందిస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ పాలనలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీజేపీ పాలనలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు అన్నారు. దేశ్ కి బచావో మోడీకి హఠావో నినాదంతో ప్రధాని మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిరంకుశ, మతోన్మాద విధానాలపై సీపీఐ – సీపీఎం ఆధ్వర్యాన గురువారం బుడమేరు వంతెన సమీపంలో గురువారం ప్రచార భేరి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రచార భేరిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మన రాష్ట్రానికి ఇంత అన్యాయం చేస్తుంటే చంద్రబాబు, పవన్, బీజేపీతో అంటకాగటానికి పోటీపడి నడుచుకోవడం సిగ్గు చేటన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు సీహెచ్ బాబురావు, నేతలు జి.కోటేశ్వరరావు, పి.దుర్గాభవాని, లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పాత పన్నులను వసూలు చేయాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానం అమలును నిలిపివేసి పాత పన్నులనే వసూలు చేయాలని ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సమాఖ్య కన్వీనర్ సి.హెచ్.బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో బాబూరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణ సంస్కరణల పేరుతో ఆస్తి విలువ ఆధారంగా పట్టణాల్లో ఇంటి పన్ను అడ్డగోలుగా పెంచుతున్నాయన్నారు. గత రెండేళ్లుగా వరుసగా 15 శాతం పెంచి మరలా ఈ ఏప్రిల్ నుంచి మరో 15 శాతం పెంచడం శోచనీయమన్నారు. ఇంటి యజమానులు పన్నులు కట్టాలంటే ఇళ్లు అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. అమృత్ పథకం పేరుతో నివాస గృహాలకు నీటి మీటర్లు బిగిస్తున్నారని, మంచినీటితో ప్రభుత్వాలు వ్యాపారం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రిటైనింగ్ వాల్ పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కృష్ణలంక సమీపంలోని కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో రూ.123 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ మూడో దశ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది ఆగస్టు చివరి నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణానది రిటైనింగ్ వాల్ మూడో దశలో నిర్మాణ పనుల ప్రగతిపై గురువారం కలెక్టర్ ఢిల్లీరావు నగర పాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో గూగుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.



గూగుల్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

ఆగస్టు నెలాఖరుకు పూర్తి చేయాలి..

కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో ప్రతి ఏటా వేలాది కుటుంబాలు వరదల కారణంగా ముంపునకు గురై ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమస్య శాశ్వత పరిష్కారానికి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ముంపు ప్రాంత ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టారన్నారు. ఇప్పటికే మొదటి, రెండో దశ నిర్మాణ పనులు పూర్తి చేశామని చెప్పారు. ఫలితంగా గతేడాది కృష్ణానది నుంచి దిగువకు 5 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేసినా ఆ ప్రాంత ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాలేదన్నారు. కనకదుర్గమ్మ వారధి నుంచి పద్మావతి ఘాట్ మధ్య కృష్ణానది తీరంలో 1.05 కిలో మీటర్ల పొడవున రూ.123 కోట్ల నిధులతో మూడో దశ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి చేపట్టిన పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షించి ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించాలని చెప్పారు. ఆగస్టు నెలాఖరుకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వాల్ నిర్మాణంతో రాబోయే రోజుల్లో నదికి వరదలు వచ్చినా 30 వేల మంది జనాభా రక్షణ పొందుతారన్నారు. రిటైనింగ్ వాల్‌తో కృష్ణలంక వాసులకు ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. గూగుల్ కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, ఇరిగేషన్ ఎస్ఈ ఎస్ తిరుమలరావు, ఈఈ కృష్ణారావు పాల్గొన్నారు.

టీడీపీవి దిగజారుడు రాజకీయాలు

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్

గుణదల(విజయవాడ తూర్పు): వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో చేస్తున్న సంక్షేమ పాలనతో ప్రజల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక టీడీపీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ విమర్శించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఐదో డివిజన్ సున్నపుబట్టీల ప్రాంతంలో గురువారం ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



వృద్ధురాలి సమస్యను అడిగి తెలుసుకుంటున్న దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ దుర్గ

టీడీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం..

ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ టీడీపీ, కొన్ని మీడియా చానళ్లు, పత్రికలు సోషల్ మీడియాలో సీఎం వైఎస్ జగన్ కుటుంబంపై అసత్య ప్రచారాలు చేయడం బాధాకరమన్నారు. వైఎస్సార్ కుటుంబం ఆప్యాయతలకు నెలవని, కుటుంబ సభ్యుల మధ్య ప్రేమాభిమానాలు ప్రచారం కోసం వాడుకునే నీచ బుద్ధి జగన్‌కు లేదన్నారు. రాజకీయ మనుగడ కోసం చనిపోయిన వ్యక్తుల మీద బురదజల్లుతూ పబ్బం గడుపుకోవాలని చూడటం మంచి పద్ధతి కాదని టీడీపీ నాయకులకు హితవు పలికారు. గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులు జన్మభూమి కమిటీల ద్వారా ప్రజలను దోచుకున్నారని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లోనూ టీడీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జగనే మరలా ముఖ్యమంత్రి కావాలని ప్రతి ఒక్కరు కోరుకుంటున్నారని అవినాష్ తెలిపారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అవినాష్ సూచించారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ అంబేద్కర్, డివిజన్ అధ్యక్షుడు మట్టా ప్రసాద్, నాయకులు విటల్, లోకేష్‌లామ్, కిరణ్, రమేష్, సౌజన్య, షకీల పాల్గొన్నారు.

కేఎల్ రావు పార్కుకు మహర్దశ

- అభివృద్ధి పనులను పరిశీలించిన మేయర్, కమిషనర్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేఎల్ రావు పార్కుకు మహర్దశ పట్టింది. థీమ్ పార్కుగా శరవేగంగా అభివృద్ధి చేయాలని, ఇప్పటికే చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నగరపాలకసంస్థ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. 46వ డివిజన్‌లోని కేఎల్ రావు పార్కు, సీవీఆర్ ఫ్లై ఓవర్ పరిసరాలను గురువారం మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్‌లు పరిశీలించారు. తొలుత కేఎల్‌రావు పార్కుకు విచ్చేసిన కమిషనర్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారని అడిగి తెలుసుకోవడమే కాకుండా పనుల పురోగతిని ప్రతి వారం తనకు తెలియజేయాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, మేయర్ భాగ్యలక్ష్మి

అంచనాలు రూపొందించాలి..

పార్కు లోపల నూతనంగా నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియంను పరిశీలించడంతో పాటు పార్కు లోపల ఫుడ్ కోర్టు, ఆట పరికరాలను ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. పార్కుకు వచ్చే మార్గం చాలా ఇరుకుగా ఉన్నందున విస్తరణ చేపట్టాలని సూచించారు. అనంతరం కేఎల్ రావు అవుట్‌పాల్ డ్రెయిన్‌ను పరిశీలించారు. కొండ ప్రాంతాలతో పాటు సీవీఆర్ ఫ్లై ఓవర్ వద్ద రోడ్డును పరిశీలించారు. ఫ్లై ఓవర్ పక్కనే ఉన్న కార్పొరేషన్ స్థలంలో శానిటరీ కార్యాలయాన్ని నిర్మించాలని, అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్(ప్రాజెక్టు) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నారాయణమూర్తి, ఎఎస్ఎన్.ప్రసాద్, నరసింహమూర్తి, ఏడీహెచ్, శ్రీనివాస్, హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

ఐజీఎం స్టేడియంలో ఈద్ నమాజ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈద్ నమాజ్ నిర్వహిస్తున్నట్లు ముస్లిం ఈద్గా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కాలేషా వలీ, మునీర్ అహ్మద్ షేక్‌లు తెలిపారు. ఈద్ నమాజ్ నిర్వహించే ప్రాంగణంలో గురువారం నమాజ్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాలేషావలీ, మునీర్ అహ్మద్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈద్ నమాజ్ నిర్వహిస్తున్నామన్నారు. రంజాన్ రోజు(ఈ నెల 22 లేదా 23న) ఉదయం 7.15 గంటలకు ఈద్ సందేశం ప్రారంభమవుతుందని తెలిపారు. నమాజ్ ఉదయం 8 గంటలకు జరుగుతుందన్నారు. వజూకు నీరు అందుబాటులో ఉంటుందని, నమాజ్‌కు కార్పెట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈద్ నమాజ్ చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. అధిక సంఖ్యలో ముస్లింలు ఈద్ నమాజ్‌లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ ప్రతినిధులు ఎండీ అన్వర్ పాష, ఎండీ ఇర్ఫాన్, మౌలానా మక్బూల్ అహ్మద్ నద్వీ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఈద్గా కమిటీ సభ్యులు మునీర్ అహ్మద్, కాలేషావలీ తదితరులు

మందులతో క్షయను పూర్తిగా నివారించవచ్చు

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు మందులు వాడటం ద్వారా క్షయ(టీబీ)ని పూర్తిగా నివారించవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. నగరంలోని టీబీ యూనిట్ ఆధ్వర్యంలో ఆ యూనిట్ పరిధిలోని 32 మంది క్షయ రోగులకు గురువారం పోషకాహారం అందచేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో క్షయకు సంబంధించి మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. రోగి ఇంటి వద్దనే ఆరు నెలల పాటు, ఏఎన్ఎం, ఆశల పర్యవేక్షణలో మందులు అందిస్తామని చెప్పారు. ప్రతి క్షయ రోగి మందులతో పాటుగా బలవర్ధకమైన పోషకాహారం తీసుకోవడం ద్వారా వ్యాధి నుంచి పూర్తిగా కోలుకోవచ్చన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

జిల్లా అంతా దాతల సహకారంలో క్షయ రోగులకు పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టీబీ అధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి టీబీ ముక్తిభారత్ అభియాన్ అనే నినాదంతో 2025 నాటికి టీబీని నిర్మూలించాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రత్యక్షంగా, పరోక్షంగాకాని దాతలు ముందుకు వచ్చి పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పాలనే జగనన్న లక్ష్యం

ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ పద్మావతి

బస్టాండ్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను కొనసాగిస్తున్నారని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి పేర్కొన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఆమె వైఎస్సార్ సీపీ ఆర్టీసీ ట్రేడ్ యూనియన్, గృహసారథులు, కన్వీనర్లతో కలిసి గురువారం పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో పర్యటించారు. ప్రతి ప్రయాణికునికి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు.



ఆటో డ్రైవర్‌కు అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్ పర్సన్ పద్మావతి

500 మంది మద్దతు..

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకంగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే నగదు బదిలీ చేయడం గొప్ప పరిణామమన్నారు. మహిళా సాధికారతతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. నాడు – నేడు, అమ్మ ఒడి, విద్యా దీవెన, గోరుముద్ద వంటి పథకాలతో ముఖ్యమంత్రి పేదలకు విద్యను చేరువ చేశారని తెలిపారు. నాటి చంద్రబాబు ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల అవినీతితో ప్రజలకు తీవ్రమైన అన్యాయం చేశారన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రతి రైతుకు ఏడాదికి రూ.13,500 అందించడమే దీనికి నిదర్శనమని చెప్పారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలని, ఆరోగ్య సంరక్షణ కోసం రాష్ట్రంలో 17 కొత్త వైద్యశాలలను ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు ఆరోగ్యశ్రీ పథకంలో రోగులకు అవసరమైన 3,250 చికిత్సలను ఉచితంగా వైద్య సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు.

అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌లోని బస్సులతో పాటు ఆటోలకు జగనన్న మా భవిష్యత్తు స్టిక్కర్‌లను వారి అనుమతితో అంటించారు. 500 మంది తమ ఫోన్‌ల ద్వారా జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నాయకులు షేక్ హబీబ్, ఎం.విజయ్, శ్రీకాంత్, అజయ్, శ్రీను, కోటి, సంజీవరావు, నరసింహరావు పాల్గొన్నారు.

మల్లె తీగ విశిష్ట సేవా పురస్కారాల లోగో ఆవిష్కరణ



విజయవాడకల్చరల్: అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ జూలై 1వ తేదిన నిర్వహిస్తున్న విశిష్ట సేవా పురస్కారాల లోగోను నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి గురువారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. సమాజంలో వైద్యులు గణనీయమైన పాత్రను పోషిస్తున్నారని వారి సేవకు గుర్తింపుగా పురస్కారాలను ప్రదానం చేస్తున్న నిర్వాహకుల కృషిని అభినందించారు. కార్యక్రమంలో మల్లెతీగ సాహిత్యవేదిక వ్యవస్థాపకుడు కలిమిశ్రీ మాట్లాడుతూ ఇదే సభలో మల్లెతీగ వైద్య ప్రత్యేక సంచిక ఆవిష్కరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ బృందం సభ్యుడు యేమినేని వెంకటరమణ, కుర్రా సురేష్‌బాబు, వల్లూరి ప్రసాద్ పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు అభినందన



లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం అంతర్ కళాశాలల కబట్టీ పోటీల్లో ప్రతిభ చూపిన సిద్ధార్థ వైద్య కళాశాల జట్టు సభ్యులకు గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ అభినందించారు. ఈ నెల 14 నుంచి 16 వరకు నెల్లూరులోని నారాయణ డెంటల్ కళాశాలలో జరిగిన యూనివర్సిటీ అంతర్ కళాశాలల కబడ్డీ పోటీల్లో సిద్ధార్థ వైద్య కళాశాల విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ జి.రవిబాబు, డాక్టర్ ఆర్.నాగేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ బి.సుమైల, ఫిజికల్ డైరెక్టర్ జె.రాములు అభినందనలు తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

కృష్ణలంక(విజయవాడతూర్పు): మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. కృష్ణలంక 22వ డివిజన్‌లోని మస్జిద్ ఏ కౌసర్‌లో గురువారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. అనంతరం అవినాష్ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో మైనారిటీలకు ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. ముస్లింలు సుఖసంతోషాలతో ఉండాలని అల్లాహ్‌ను కోరుకున్నానన్నారు. రాష్ట్ర ప్రజల కోసం, ప్రత్యేకంగా ముస్లిం మైనారిటీల అభివృద్ధికి నిరంతరం పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అల్లాహ్ ఆశీస్సులు మెండుగా ఉండాలని ప్రార్థించానన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, కో ఆప్షన్ మెంబర్ అలీమ్, మస్జిద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న దేవినేని అవినాష్

సిద్ధమవుతున్న అంబేడ్కర్ పార్కు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక జాతీయ రహదారి వెంబడి బందరు కాలువపై తీగల వంతెనతో ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా ఉన్న రాఘవయ్య పార్కు, అంబేడ్కర్ పార్కులు మళ్లీ అనుసంధానంతో నగర ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. పార్కుల అభివృద్ధిపై దృష్టి సారించిన నగరపాలకసంస్థ అంబేడ్కర్ పార్కు అభివృద్ధికి రూ.1.5 కోట్లు నిధులు మంజూరు చేసింది. దీంతో గత మూడు నెలలుగా పార్కు అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతూ చివరి దశకు చేరుకున్నాయి. పార్కు మధ్యలో ఏర్పాటు చేస్తున్న వాటర్ ఫౌంటైన్ పార్కుకు సరికొత్త అందానిస్తుంది. దీంతో పాటు పిల్లల ఆట పరికరాలు, భారీ అంబారీలు చిన్నారులను అలరించనున్నాయి. త్వరలో పార్కు అందుబాటులోకి రానుండడంతో కృష్ణలంక వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంటున్న పార్కు ప్రధాన ద్వారం

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. గురువారం కేఎల్‌రావు పార్కు రోడ్డులోని అగ్నిమాపక కేంద్రం వద్ద అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తపేట అగ్నిమాపక అధికారి తలశిల శ్రీనివాసరావు అగ్నిప్రమాదాలు జరగడానికి కారణాలు, వాటిని అరికట్టే విధానాలపై అవగాహన కల్పించారు. మనం ఇంట్లో రోజు వారి కార్యక్రమాల్లో అలసత్వం, చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగానే కొన్ని ప్రమాదాలు జరుగుతాయన్నారు. వాటిలో ముఖ్యమైనది గ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ లీకేజీ అని పేర్కొన్నారు. గ్యాస్ లీకేజీతో వచ్చే మంటలను అదుపు చేసే విధానాన్ని వివరించారు.

సాయినాథుని సేవలో ఏసీబీ ఎస్పీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో బాబాను గురువారం ఏసీబీ ఎస్పీ రమాదేవి దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన బాబావారిని దర్శించుకోవటం ఆనందంగా ఉందన్నారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డి సేవలు అభినందనీయమని కొనియాడారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణలో ఆమె స్వయంగా భక్తులకు భోజనాలు వడ్డించారు.

సరికొత్త ప్రేమ కథాంశం 'రాధకు నీవేరా ప్రాణం'

లబ్బీపేట(విజయవాడతూర్పు): రెండు విభిన్న హృదయాల మధ్య సాగే సరికొత్త ప్రేమ కథాంశంతో రూపొందుతున్న రాధకు నీవేరా ప్రాణం సీరియల్ ఈ నెల 24న ప్రారంభం కానున్నట్లు హీరో నిరుపమ్ పరిటాల చెప్పారు. బెంజిసర్కిల్‌లోని ట్రెండ్ సెట్‌మాల్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో నిరుపమ్ మాట్లాడుతూ ఈ సీరియల్‌లో పోలీసు అధికారిగా కార్తీక్‌కృష్ణ పేరుతో మరోసారి ప్రేక్షకులను అలరించనున్నట్లు తెలిపారు. రాధకగా గోమతి ప్రియ నటిస్తున్నారన్నారు. కథ, కథనం, ఎమోషన్స్, వినోదం ఇలా అన్ని అంశాలను కలబోసిన కథ ఇది అన్నారు. రాధకు నీవేరా ప్రాణం తెలుగు ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని పంచబోతుందని, ఓ చిత్రకారిణి, పోలీసు అధికారి మధ్య సాగే ప్రయణగాథనే ఈ సీరియల్‌గా పేర్కొన్నారు. ఈ నెల 24 నుంచి జీ తెలుగులో ప్రతి రోజూ రాత్రి 7.30 గంటలకు ప్రసారం కానుందని అందరూ చూసి ఆదరించాలని కోరారు.

ఫెన్సింగ్ ఏర్పాటు చేయరూ..!

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ పరిధిలోని రామలింగేశ్వరనగర్ పడవల రేవు సమీపంలో(బందరు కాలువ) నిర్మించిన నటరాజన్ గుల్జార్ వంతెన ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. నిత్యం రామలింగేశ్వరనగర్ నుంచి విజయవాడ నగరానికి వందలాది మంది ఈ బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తుంటారు. వంతెనపై సిమెంట్ దిమ్మెల ఎత్తు తక్కువగా ఉండటం వల్ల కొందరు కాలువలోకి దూకేస్తున్నారు. సంబంధిత ఇరిగేషన్ అధికారుల స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నటరాజన్ గుల్జార్ బ్రిడ్జి

సహకార సంఘాలకు టీడీఎస్ రద్దు చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సహకార సంఘాలకు టీడీఎస్ రద్దు చేయాలని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు కో ఆపరేటివ్ సొసైటీస్ రిజిస్ట్రార్ బాబు.ఏను కలిసి వినతి పత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం రూ.కోటి ఆపైన నగదు లావాదేవీలను జరిపిన సహకార సంఘాలపై శాతం టీడీఎస్ వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వం 194ఎన్ నిబంధన విధించిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో సహకార సంఘాల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సహకార సంఘాలు డీసీసీబీ వద్ద 1.8 శాతం మార్జిన్ వడ్డీ తీసుకుంటూ వ్యాపారం చేస్తున్నాయన్నారు. బాబు.ఏను కలిసిన వారిలో ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఝాన్సీ రాణి, ఎండీ ఆర్.శ్రీనాథరెడ్డి, విజయనగరం చైర్మన్ రామునాయుడు, విశాఖపట్నం, అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాల చైర్‌పర్సన్లు అనిత, లిఖిత, రెడ్డమ్మ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

చంద్రబాబుకు మంత్రి అప్పలరాజు సెల్ఫీ చాలెంజ్



కిడ్నీ రీసెర్చ్ సెంటర్ వద్ద సెల్ఫీ దిగుతున్న మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: చంద్రబాబుకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గురువారం సెల్ఫీ చాలెంజ్ విసిరారు. పలాసలో రూ.58 కోట్లతో నిర్మిస్తున్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రి వద్ద మంత్రి సెల్ఫీ దిగారు. 'బాబు గారు మీ హయాంలో ఏ అభివృద్ధి చేశారో... మేం ఏం అభివృద్ధి చేశామో చూపిస్తాను...' అంటూ మంత్రి సవాల్ విసిరారు. తుది దశకు చేరిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్ వెనుక కనిపించేలా మంత్రి అప్పలరాజు సెల్ఫీ దిగారు. సీఎం వైఎస్ జగన్ ఫేస్ మాస్క్ పెట్టుకుని కూడా ఆయన ఫొటోలు దిగారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



కిడ్నీ రీసెర్చ్ సెంటర్ వద్ద సీఎం ఫేస్ మాస్క్‌తో మంత్రి అప్పలరాజు

మాజీమంత్రి మల్లాడికి తప్పిన ప్రమాదం

స్వల్పగాయాలతో బయటపడ్డ వైనం

యానాం: పుదుచ్చేరి మాజీ మంత్రి, ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురయ్యింది. త్రుటిలో ఘోరప్రమాదం తప్పి ఆయన సురక్షితంగా స్వల్పగాయాలతో బయటపడ్డారు. మంగళవారం జరిగిన ఈ ప్రమాదం ఆలస్యంగా వెలుగు చూసింది. పుదుచ్చేరి నుంచి చెన్నై ఎయిర్‌పోర్టుకు వెళ్లే మార్గమధ్యంలో దుర్గైదుక్కం అనే ప్రదేశం వద్ద సిగ్నల్‌స్టాప్ పడడంతో మల్లాడి ప్రయాణిస్తున్న కారు ఆగి ఉంది. ఈ నేపథ్యంలో మద్యం సేవించి ఉన్న ట్యాంకర్ డ్రైవర్ వెనుకనుంచి అతివేగంగా వచ్చి ఆగి ఉన్న మల్లాడి కారును ఢీకొట్టాడు. ఈ సమయంలో కారు ముందుభాగం ఎదురుగా ఉన్న మరో లోడులారీ కిందకు దూసుకుపోయింది. దీంతో కారు వెనుక, ముందుభాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి.



అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం పెదగోగాడలో వృద్ధులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



పార్వతీపురం మన్యం జిల్లా మొగధారగూడలో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



చిత్తూరు జిల్లా చీకూరుపల్లెలో తన ఇంటికి స్టిక్కర్ అతికించుకుంటున్న మహిళ, పక్కన పూతలపట్టు ఎమ్మెల్యే బాబు



కాకినాడ జిల్లా పెద్దాపురప్పాడులో ఇంటికి స్టిక్కర్ అతికించి, కరపత్రాలను అందజేస్తున్న కన్వీనర్లు, గృహసారథులు

ఇంటింటా ప్రజాదరణ

- ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం
- మళ్లీ వైఎస్ జగనే సీఎం కావాలంటున్న జనం
- తమకు కలిగిన లబ్ధిని నేతలతో పంచుకుంటున్న ప్రజలు
- ప్రభుత్వానికి మద్దతుగా 70 లక్షల మిస్డ్ కాల్స్

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ప్రతి ఊళ్లోనూ సందడి నెలకొంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిందేనని ప్రతి ఒక్కరి నోటా వినిపిస్తోంది. ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు, సమన్వయకర్తలు, కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు.. సీఎం వైఎస్ జగన్ ప్రతినిధులుగా గురువారం కూడా ఇంటింటికీ వెళ్లారు. ప్రస్తుత ప్రభుత్వంలో గత నాలుగేళ్లుగా జరిగిన అభివృద్ధితో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేస్తూ వివరించారు. ఈ నాలుగు సంవత్సరాల్లో తమకు ఏ మేరకు లబ్ధి కలిగిందో ప్రజలే ఆనందంగా నేతలతో పంచుకున్నారు. కులం, మతం, వర్గం, పార్టీ చూడకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తుండటం ఒక్క సీఎం జగన్‌కే సాధ్యమైందని ఊరూరా అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, అవ్వాతాతలు స్పష్టీకరిస్తున్నారు. మరోసారి వైఎస్ జగన్ సీఎం అయితేనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని అంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 7వ తేదీన ప్రారంభమైన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ప్రజలు వైఎస్ జగన్ ప్రభుత్వంపై ఉన్న నమ్మకాన్ని ప్రజా మద్దతు సర్వే ద్వారా నమోదు చేస్తున్నారు. ఏప్రిల్ 19 నాటికి 70 లక్షల మంది 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి ప్రభుత్వానికి మద్దతు తెలిపారు.



పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం దమ్మాలపాడులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా మంత్రి అంబటి రాంబాబు సమక్షంలో మిస్డ్‌కాల్ ఇస్తున్న స్థానికుడు

'మార్గదర్శి'లో కొనసాగుతున్న సోదాలు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో వరుసగా రెండో రోజు గురువారం కూడా సీఐడీ సోదాలు కొనసాగాయి. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, అనంతపురంలోని మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల్లో సోదాలు జరిపి కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. అక్రమ డిపాజిట్లు, అక్రమ పెట్టుబడులు, హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి నిధుల మళ్లింపునకు సంబంధించిన రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. బ్రాంచి కార్యాలయాలు, ప్రధాన కార్యాలయంలోని రికార్డుల్లో వివరాలకు ఏమాత్రం పొంతన లేదన్న విషయాన్ని సీఐడీ గుర్తించింది. దీనిపై బ్రాంచి మేనేజర్లు, సిబ్బందిని ప్రశ్నించి వారి స్టేట్‌మెంట్లను నమోదు చేస్తున్నారు. దాదాపు 15 అంశాలకు సంబంధించి అవకతవకలను గుర్తించినట్లు తెలిసింది. మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల్లో శుక్రవారం కూడా సీఐడీ సోదాలు కొనసాగనున్నాయి. ఈ సమాచారాన్ని విశ్లేషించిన అనంతరం తదుపరి కార్యాచరణను వేగవంతం చేయాలని సీఐడీ భావిస్తోంది.

అరెస్టు భయంతో అందుబాటులో లేని మేనేజర్లు..

ఏలూరు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లు కార్యాలయంలో అందుబాటులో లేరని చెబుతున్నారు. ఇప్పటికే ముందస్తు బెయిల్ తీసుకున్నారని, అయినా అరెస్టు చేస్తారనే భయంతో కార్యాలయానికి రావడం లేదని అంటున్నారు. మార్గదర్శిలో చిట్స్‌కు సంబంధించి ఖాతాదారుల వివరాలు, చిట్ల చెల్లింపులు, జమలకు సంబంధించి రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు చెబుతున్నారు. సీఐడీ డీఎస్పీ స్థాయి అధికారులతో పాటు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్‌కు సంబంధించి పలువురు అధికారులు ఈ సోదాల్లో పాల్గొంటున్నట్టు సమాచారం.

మొబైల్ హాస్పిటల్ రెడీ

- కంటైనర్ హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేసిన మెడ్‌టెక్ జోన్

సాక్షి, విశాఖపట్నం: స్థానిక ఏపీ మెడ్‌టెక్ జోన్ మరో అద్భుతాన్ని సృష్టించింది. మారుమూల గ్రామాల ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మొబైల్ హాస్పిటల్‌ను రూపొందించింది. మెడ్‌టెక్ జోన్‌లో దాదాపు నెల రోజులపాటు సిబ్బంది శ్రమించి ఈ కంటైనర్ హాస్పిటల్‌ను సిద్ధం చేశారు. ఇందులో మొబైల్ ల్యాబ్, ఐసీయూతోపాటు ముఖ్యమైన చికిత్సలు, వైద్య సేవలందించేందుకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచినట్లు మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు సరైన వైద్యం అందదనీ, వారంతా హాస్పిటల్‌కు రావాలంటే శ్రమతో కూడుకున్న పని అని, అందువల్ల ఆయా గ్రామాల్లోని ప్రజల వద్దకే హాస్పిటల్ వెళ్లేలా దీనిని రూపొందించామని వివరించారు. దేశంలోని మారుమూల ప్రాంతాల్లో నివాసం ఉంటున్న లక్షలాది మంది ప్రజలకు ఈ మొబైల్ హాస్పిటల్ ద్వారా సేవలందించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

ఆయనే మమ్మల్ని బతికిస్తున్నాడయ్యా..



'మా ఇద్దర్నీ సీఎం జగనే బతికిస్తున్నాడయ్యా.. ఆయన లేకపోతే ఎప్పుడో చచ్చిపోయేవాళ్లం' అని కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ కళాశాల ప్రాంత కాలనీకి చెందిన వృద్ధదంపతులు తాడికొండ సాంబశివరావు, రంగనాయకమ్మ కొనియాడారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో గురువారం వారి ఇంటి వద్దకెళ్లిన స్థానిక వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ రాంప్రసాద్ తదితరులతో తమ జీవనయానం గురించి వివరించారు. ఒకరికి వికలాంగ, మరొకరికి వృద్ధాప్య పింఛన్ వస్తోందని, ఈ డబ్బులతోనే మందులు కొనుక్కుంటూ జీవిస్తున్నామన్నారు. కొద్దినెలల క్రితం తనకు హార్ట్ అటాక్ వస్తే విజయవాడలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా స్టెంట్ వేసి బతికించారని సాంబశివరావు తెలిపారు. చంద్రబాబు పాలనలో ఇసుక రీచ్‌లో కార్మికుడిగా పనిచేసేవాడినని, అప్పుడు ప్రొక్లెయిన్లతో లోడింగ్ పనులు ప్రారంభించడంతో ఉపాధి కోల్పోయానని చెప్పారు. 'చంద్రబాబు మా నోట్లో మట్టి కొడితే.. జగన్ బాబు ఆదుకుంటున్నారు. జగన్ పాలనలో మా లాంటి వృద్ధులందరం సంతోషంగా జీవిస్తున్నాం. ఆయన మేలు మరచిపోము' అని వివరించారు.

– మచిలీపట్నం టౌన్

దేశ వ్యాప్తంగా మంచి రోడ్లు వేయించింది నేనే

- హైటెక్ సిటీ, విమానాశ్రయం, సెల్‌ఫోన్లూ నా ఘనతే
- జీనోమ్ వ్యాలీ ఏర్పాటు వల్లే ఇప్పుడు కరోనా వ్యాక్సిన్
- నన్ను 420 అని తిడుతుంటే మీకెందుకు కోపం రావట్లేదు?
- మార్కాపురం సభలో చంద్రబాబు



సాక్షి ప్రతినిధి ఒంగోలు: ప్రపంచంలోనే ఎక్కువ జనాభా ఉన్న మన దేశంలో 1998లో అప్పటి ప్రధాని వాజ్‌పేయికి సలహా ఇచ్చి, దేశ వ్యాప్తంగా మంచి రోడ్లు వేయించింది తానేనని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చెప్పారు. డబ్బులు లేకుండా రోడ్లు ఎలా వేయాలని వాజ్‌పేయి అడిగితే తానిచ్చిన సలహా వల్లే దేశ వ్యాప్తంగా అన్ని నగరాలు, ప్రధాన పట్టణాలను అనుసంధానిస్తూ పెద్ద రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారన్నారు. మార్కాపురంలో గురువారం ఆయన జన్మదిన వేడుకలు జరుపుకున్న అనంతరం మహిళలతో ఆత్మీయ సమావేశం, అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో అనేక సంస్కరణలకు నాంది పలికింది తానేనన్నారు. హైటెక్ సిటీ, విమానాశ్రయం, జీనోమ్ వ్యాలీ ఇలా అన్నీ తన ఘనతేనని చెప్పారు. జీనోమ్ వ్యాలీ ఏర్పాటు వల్లే ఇప్పుడు అక్కడ కరోనా వ్యాక్సిన్ తయారైందన్నారు. సెల్‌ఫోన్లూ తన ఘనతేనని చెప్పుకొచ్చారు. పేదవాళ్లను సంపన్నులుగా చేయాలన్నదే తన ఆశ అన్నారు. తనకు అమ్మఒడి ఇవ్వలేదన్న చిన్నారి పుష్ప ఫొటోతో జగన్‌కు సెల్ఫీ చాలెంజ్ విసురుతున్నానని చెప్పారు.

ఓ పెగ్గేస్తే తప్పేమీ లేదు..

'ఓ పెగ్గేస్తే తప్పేముంది.. పగలంతా కష్టపడి ఆ కష్టాన్ని మరిచిపోయేందుకు సాయంత్రానికి ఓపెగ్గేయడం అందరికీ అలవాటుగా మారింది. అలవాటే వ్యసనంగా మారింది. అయితే మద్యం రేట్లు భారీగా పెంచి జగన్‌మోహన్‌రెడ్డి సొంత బ్రాండ్‌లతో మిమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నన్ను వైసీపీ వాళ్లు 420 అని తిడుతుంటే కూడా మీకు కోపం రావడం లేదు. మీరు మాత్రం మీ ఇళ్లల్లో హాయిగా పడుకోండి' అని చంద్రబాబు అన్నారు. బ్రాందీ షాపుల్లో ఆన్‌లైన్ పేమెంట్‌లు తీసుకోవడం లేదని, అయినా తమ్ముళ్లకు కోపం రావడం లేదన్నారు. తాము అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు కొనసాగిస్తామని, మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తామని, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరిస్తామని హామీ ఇచ్చారు. కాగా, అనుకున్న దాంట్లో సగం మంది కూడా రాలేదని ఆ పార్టీ నేతలు వాపోతుంటే.. బాబు మాత్రం ఇసుక వేస్తే రాలనంతగా జనం వచ్చారని చెప్పుకోవడం గమనార్హం.

జిల్లా వార్తలు

వరికి ప్రత్యామ్నాయం

వస సాగు

- ఔషధ సాగు వైపు.. లోతట్టు రైతు చూపు
- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు
- 9 నెలల పంటతో రూ.లక్షల్లో ఆదాయం
- నీటి ముంపు ప్రాంతాల్లో అనువైన వంగడం

ఉంగుటూరు: కృష్ణా జిల్లా ఉంగుటూరు మండల పరిసర ప్రాంతాల రైతులు సాధారణంగా వరి సాగుకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. అయితే లోతట్టు ప్రాంతాల్లో నీటి సౌలభ్యత ఎక్కువగా ఉండటం వల్ల ఔషధ పంటలకు కూడా అనువైనదే అని గుర్తించిన కొందరు రైతులు వరి పంటకు మించి ఎక్కువ దిగుబడి రాబడి సాధించేదుకు ఔషధ పంటల సాగుకు మొగ్గుతున్నారు. ఈ క్రమంలోనే ఉంగుంటూరు మండలంలోని తేలప్రోలు గ్రామానికి చెందిన వింత సాంబిరెడ్డి అనే రైతు వస కొమ్ముల సాగుకు శ్రీకారం చుట్టారు.

కర్ణాటక నుంచి వంగడాల దిగుమతి

కర్ణాటక రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వస సాగు చేస్తూ లాభాలు గడిస్తున్న రైతులను ఆదర్శంగా తీసుకున్న సాంబిరెడ్డి అక్కడ నుంచి నారు దిగుమతి చేసుకున్నారు. గ్రామంలో సిరివాడ చానల్ కాలువ సమీపంలో ఉన్న రెండున్నర ఎకరాల పొలంలో గత ఏడాది జూన్ నెలలో వస సాగును ప్రారంభించాడు.



గుట్టలుగా పోసిన వస కొమ్ములు

సస్యరక్షణతో పని లేని ఔషధ సాగు

సాధారణంగా ఇతర సాగులో చీడపీడలు, పురుగుల బేడదతో ఎరువులు, పురుగు మందులను కొనుగోలు చేసేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. వస కొమ్ముల సాగుకు నీటి వనరు, బలానికి ఎరువులు మినహా ఎటువంటి పెట్టుబడి ఉండదు. ముంపు ప్రాంతాల రైతులు వరికి ప్రత్యామ్నయంగా వస సాగు ద్వారా పంట నష్టాలకు చెక్ పెట్టవచ్చు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం

వస సాగులో ప్రారంభంలో నారు కొనుగోలు చేయడమే పెట్టుబడి. ఏటా పంటలోనే కొంత నారుకు ఉంచుకోవడం వల్ల నారు కొనాల్సిన పని ఉండదు. ఎకరం సాగులో కూలీలు, బలం ఎరువులకు సుమారు రూ.40 వేలు మినహా ఖర్చులు ఉండవు. ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పలు ఔషధ కంపెనీల రైతులు వస కొమ్ములు క్వింటా ధర రూ.8 వేలుకు కొనుగోలు చేస్తున్నారు.

వస సాగు ఇలా..

వస కొమ్ముల నారు వేసిన తరువాత 20 రోజులకు కలుపు తీయాలి, మొదటి మూడు నెలలు బలనికి ఎరువులు వేసుకోవాలి. 9 నెలలకు పంట పై భాగాన్ని కోత కోయాలి. కోసిన తరువాత దుక్కి దున్ని కింద భాగంలో ఉన్న వస కొమ్ములను తీసుకోవాలి.

కొమ్మును నాలుగు అంగుళాలు ముక్కలుగా చేసీ ఎండలో ముక్కలో తడి పూర్తిగా పోయే వరకు ఆరబెట్టాలి. అనంతరం వస కొమ్ములకు ఉన్న పీచు పోయే విధంగా పాలిష్ చేయాలి.



వస సాగు.. (ఇన్‌సెట్) వస కొమ్ములు

వస పంట దిగుబడి లాభసాటిగా ఉంది..



ఔషధాల్లో వినియోగించే వస కొమ్ములు బహిరంగా మార్కెట్‌లో ధరలు లాభసాటిగా ఉన్నాయి. ఈ పంటకు ఎప్పుడు నీరు ఉన్న ఇబ్బంది ఉండదు. చీడపీడలు, పురుగుల బెడద ఉండదు. నివారణకు సస్యరక్షణ చర్యలు అవసరమే లేదు. ముంపు ప్రాంత రైతులు వరికి పత్యామ్నయంగా వస సాగుపై దృష్టి సారించాలి.

–వింత సాంబిరెడ్డి, రైతు

గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా ఈనెల 24 నుంచి ఆయా స్టేషన్‌ల మీదుగా ప్రత్యేక రైళ్లు కొనసాగుతాయని గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం ఎం.దినేష్‌కుమార్ గురువారం వెల్లడించారు. రైలు నంబరు 07784 గుంటూరు – రేపల్లె, 07785 రేపల్లె –గుంటూరు, 07786 గుంటూరు–రేపల్లె, 07787 రేపల్లె – గుంటూరు రైళ్లు జంపని, పెనుమర్రు మీదుగా ప్రయాణిస్తాయని తెలిపారు. 07783 విజయవాడ-గుంటూరు, 07788 గుంటూరు- విజయవాడ వయా పెదకాకాని మీదుగా ప్రయాణిస్తాయని తెలిపారు. 07779 గుంటూరు–మాచర్ల 07780 మాచర్ల– గుంటూరు నల్లపాడు, బండారు పల్లి మీదుగా ప్రయాణిస్తాయని తెలిపారు. 07781 విజయవాడ– మాచర్ల, పెదకాకాని, నల్లపాడు, తుమ్మల చెరువు మీదుగా ప్రయాణిస్తాయని తెలిపారు. 07782 మాచర్ల– విజయవాడ తుమ్మల చెరువు, పెదకాకాని మీదుగా ప్రయాణిస్తాయని తెలిపారు. 07874 తెనాలి – రేపల్లె, 07873 రేపల్లె – తెనాలి, 07876 తెనాలి– రేపల్లె, 07875 రేపల్లె–తెనాలి, జంపని మీదుగా ప్రయాణిస్తాయని తెలిపారు. 07888 తెనాలి–రేపల్లె పెనుమర్రు మీదుగా ప్రయాణిస్తాయని తెలిపారు.



07889 రేపల్లె మార్కాపురం రోడ్డు పల్లెకోన, చినరావూరు, జాగర్లమూడీ మీదుగా ప్రయాణిస్తాయని తెలిపారు.

గుంటూరు నుంచి బెనారస్‌కు

ఈనెల 22, 29, మే 6వ తేదీల్లో గుంటూరు – బెనారస్‌కు ప్రత్యేక రైళ్లు కేటాయించినట్లు తెలిపారు. 07229 బెనారస్– గుంటూరు, ఈనెల 24, మే 1, 9 తేదీల్లో ప్రత్యేక రైళ్లు కేటాయించినట్లు వెల్లడించారు. ప్రయాణీకులు గమనించాల్సిందిగా తెలిపారు.

సంగీత సాహిత్య సమలంకృతే..

- 26 నుంచి త్యాగరాజ స్వామి జయంతి ఉత్సవాలు
- విజయవాడ శివరామకృష్ణ క్షేత్రంలో వారం రోజులపాటు నిర్వహణ
- వివిధ ప్రాంతాల నుంచి హాజరుకానున్న సంగీత విద్వాంసులు



త్యాగరాజ స్వామి 255 జయంతి ఉత్సవంలో సంకీర్తనలు గానం చేస్తున్న యువ కళాకారులు (ఫైల్)

విజయవాడ కల్చరల్: కర్నాటక సంగీత త్రిమూర్తుల్లో ఒకరైన సద్గురు త్యాగరాజ స్వామి తెలుగు వాగ్గేయకారుడు. తెలుగు నాట జన్మించినా తమిళ నాట స్థిరపడ్డారు. సంగీత ప్రపంచలో తనదైన ముద్ర వేసుకున్నారు. సంగీత విద్వాంసులు ఆయనను తమ వాడిగా భావించారు. ఆయన నాదోపాసకుడు. సంకీర్తనల ద్వారా భగవంతుడిని చేరుకోవచ్చని భావించిన భక్తాగ్రేసరుడు త్యాగరాజు. ఆయనను స్మరించుకుంటూ విజయవాడకు చెందిన శ్రీ సద్గురు సంగీత సభ 30 వసంతాలుగా త్యాగరాజ జయంతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తోంది. ప్రముఖ సంగీత విద్వాంసులు సైతం ఈ ఉత్సవాల్లో పాల్గొనడాన్ని అదృష్టంగా భావిస్తారు. యువ కళాకారులు త్యాగరాజ స్వామి కృతులను మృదుమధురంగా గానం చేస్తారు.



శివరామకృష్ణ క్షేత్రంలోని త్యాగరాజ స్వామి విగ్రహం

శివరామకృష్ణ క్షేత్రంలో ఉత్సవాలు

సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ నుంచి వారం రోజుల పాటు దుర్గాపురంలోని శృంగేరి పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో త్యాగరాజ స్వామి జయంతి ఉత్సవాలు జరుగుతాయి. నిత్యం ఉదయం ఎనిమిది గంటలకు త్యాగరాజ స్వామికి పూజలతో ఉత్సవాలు ప్రారంభమై రాత్రి పది గంటల వరకు కొనసాగుతాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా 27వ తేదీన నాట్యాచార్యుడు చింతారవి బాలకృష్ణ బృందం త్యాగరాజ స్వామి కృతులతో నృత్యనీరాజనం సమర్పిస్తుంది. 30వ తేదీ ఉదయం వంద మంది సంగీత విద్వాంసులు ఏకకాలం త్యాగరాజ స్వామి రచించిన పంచరత్న కృతుల గోష్ఠిగానం నిర్వహిస్తారు. అదే రోజు త్యాగరాజ స్వామి హరికథాగానం నిర్వహిస్తారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సంగీత విద్వాంసులు, యువ సంగీత కళాకారులు హాజరవుతారు. త్యాగరాజ స్వామి కృతులను మధురంగా గానం చేస్తారు.

త్యాగరాజ స్వామి కీర్తనలకు పెద్దపీట

వారం రోజులపాటు నిర్వహించే సంగీత ఉత్సవాల్లో త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలను మాత్రమే గానం చేస్తారు. సంప్రదాయ దుస్తులనే ధరించాలని, సమయ పాలన పాటించాలని నిర్వాహకులు నిబంధనలు విధించారు.

దేవాలయ నిర్మాణం

అరిపిరాల సత్యనారాయణ తంజావూరు శిల్పిలతో త్యాగరాజ స్వామి విగ్రహాన్ని చెక్కించి దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో దేవాలయ సముదాయంలో 1984 సంవత్సరంలో ప్రతిష్ఠించారు. సుందరంగా దేవాలయాన్ని నిర్మించారు. ఈ దేవాలయ నిర్మాణం కోసం తన జీవితాన్ని త్యాగం చూసిన మహనీయుడు అరిపిరాల సత్యనారాయణ. 1993 నుంచి ఇక్కడ ప్రతి సంవత్సరం త్యాగరాజ స్వామి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఘనంగా ఉత్సవాలు



సద్గురు సంగీత సభను 1993లో ప్రారంభించాం. అప్పటి నుంచి ఏటా వార్షిక సంగీత ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. వాటికి అనుబంధంగా త్యాగరాజ స్వామి జయంతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నాం. త్యాగరాజ స్వామి జయంతి సందర్భంగా దక్షిణ భారత దేశంలో విజయవాడలోని సద్గురు సంగీత సభలో మాత్రమే సంగీత ఉత్సవాలు జరుగుతాయి. దేశంలోని వివిధ ప్రాంతాల సంగీత విద్వాంసులు వచ్చి కచేరీలు చేస్తారు.

– పోపూరి గౌరీనాథ్, సద్గురు సంగీత సభ ప్రధాన కార్యదర్శి

ఏఎన్‌యూలో నూతన విభాగాధిపతులు వీరే..

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్న పలు కోర్సులకు వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆదేశాల మేరకు విభాగాధిపతులను నియమించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ తెలిపారు. ఎమ్మెస్సీ డేటా సైన్స్ కోర్సుకు కంప్యూటర్ సైన్స్ విభాగ అధ్యాపకులు ఆచార్య కె.గంగాధర రావు, ఎమ్మెస్సీ ఫారెస్ట్రీ కోర్సుకు బోటనీ అండ్ మైక్రోబయాలజీ విభాగ అధ్యాపకులు ఆచార్య కె.మల్లిఖార్జున రావు, ఎమ్మెస్సీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ కోర్సుకు ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగ అధ్యాపకుడు డాక్టర్ పి.బ్రహ్మాజీ రావు, ఎంటెక్ ఇరిగేషన్ అండ్ వాటర్ రిసోర్సెస్ కోర్సుకు డాక్టర్ వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ అధ్యాపకుడు ఆచార్య పి.సిద్దయ్య, ఎంబీఏ మీడియా మేనేజ్‌మెంట్ కోర్సు కు జర్నలిజం విభాగ అధ్యాపకురాలు డాక్టర్ జి.అనిత, ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్‌మెంట్‌కు డాక్టర్ వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ ఈ అధ్యాపకుడు ఆచార్య ఈ.శ్రీనివాసరెడ్డి, ఎంఏ అప్లయిడ్ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్ కోర్సుకు ఇంగ్లిష్ విభాగ అధ్యాపకుడు ఆచార్య ఎం.సురేష్ కుమార్, మాస్టర్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఇన్ థియేటర్, టీవీ అండ్ సినిమా, ఎంఏ మ్యూజిక్, ఎంఏ డాన్స్, డిప్లొమా ఇన్ మ్యూజిక్, డిప్లొమా ఇన్ డాన్స్ కోర్సులకు జర్నలిజం అధ్యాపకులు డాక్టర్ జి.అనిత విభాగాధిపతిగా, డాక్టర్ జె.మధుబాబు అసిస్టెంట్ కోఆర్డినేటర్‌గా నియమించామన్నారు.

మదర్‌హోం నిర్వాహకురాలికి జైలు

నరసరావుపేట టౌన్: మైనర్ బాలికతో వెట్టి చాకిరి చేయించిన అనాథ ఆశ్రమం నిర్వాహకురాలికి ఏడాది జైలు, రూ.25 వేలు జరిమాన విధిస్తూ 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఓ. వెంకట నాగేశ్వరరావు గురువారం తీర్పు చెప్పారు. పొన్నూరు మండలం మామిళ్లపల్లికి చెందిన బాలికను చదువుకునేందుకు లింగంగుంట్లలోని మదర్ హోంలో చేర్పించారు. హోం నిర్వాహకురాలు కంబాల ఝాన్సీలక్ష్మి ఆ బాలికతో మరుగుదొడ్లు కడిగిస్తోంది. ప్రశ్నిస్తే దాడి చేసింది. బాలిక తలి సీత 2017లో రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితురాలిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు.

క్లుప్తంగా...

వీకే-పెట్రో యూడీఏకు నూతన కమిటీ పునర్నియామకం

సాక్షి, అమరావతి: విశాఖ-కాకినాడ పెట్రోలియం, కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీకే-పీసీపీఐఆర్ యూడీఏ)కి కమిటీని పునర్నియమిస్తూ గురువారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులిచ్చింది. కమిటీకి చొక్కాకుల లక్ష్మి చైర్మన్‌గాను, వీఎంఆర్‌డీఏ కమిషనర్, ఏపీఐఐసీ ఎండీ వైస్ చైర్మన్‌గాను వ్యవహరిస్తారు. ఈ కమిటీకి ఎంఏయూడీ, ఫైనాన్స్ విభాగాల జాయింట్ సెక్రటరీలు, డీటీసీపీ, విశాఖ, అనకాపల్లి, కాకినాడ కలెక్టర్లు, ఏపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ, విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల ఫారెస్ట్ కన్జర్వేటర్లు, విశాఖ, అనకాపల్లి, కాకినాడ జిల్లాల ఇండస్ట్రీ సెంటర్ (డీఐసీ) జీఎంలు సభ్యులుగా వ్యవహరించనున్నారు.

మే 1 నుంచి గంగమ్మ ఆలయ మహా కుంభాభిషేకం

- ఎమ్మెల్యే భూమన వెల్లడి



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష తదితరులు

తిరుపతి కల్చరల్ : తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి చెల్లెలుగా, తిరుపతి గ్రామ దేవతగా విరాజిల్లుతూ భక్తకోటి పూజలందుకుంటున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మ తల్లి ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవం మే ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఎమ్మెల్యే భూమన.. మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి మహా కుంభాభిషేకం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. భూమన మాట్లాడుతూ మహా కుంభాభిషేకంలో భాగంగా 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలు, 5న ఉదయం 8.20 నుంచి 10 గంటల మధ్య పరమహంస పరివ్రాజకాచార్య కంచి కామకోటి పీఠాధిపతి, జగద్గురువులు శంకర విజయేంద్రసరస్వతీస్వామి అమృత హస్తాలచే గంగమ్మ దేవతా యంత్రం, విగ్రహ, శిఖర కలశ, స్థిర ప్రతిష్ఠ మహా కుంభాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మే 9న శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర చాటింపు జరుగుతుందన్నారు. 10వ తేదీ నుంచి గంగమ్మ జాతర వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈవో మునికృష్ణయ్య పాల్గొన్నారు.

దేవుడి ఫొటో పక్కన జగన్ ఫొటో పెట్టుకున్నారు

- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



శ్రీశైలం టెంపుల్ : ఇటీవల రాయలసీమ యాత్రలో భాగంగా కొన్ని ఇళ్లను సందర్శిస్తే దేవుడి ఫొటో పక్కన ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫొటో పెట్టుకోవడం చూశానని.. దీన్ని బట్టి బడుగు, బలహీనవర్గాల వారిని ఆయన ఎంతలా చూసుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. శ్రీశైలం అతిథిగృహంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బలహీనవర్గాల వారు పాలకులుగా ఉండాలన్నది సీఎం జగన్ లక్ష్యమని, ఆ దిశగా సీఎం విశాల దృక్పథం కారణంగా వాస్తవ రాజ్యాధికార బదిలీ జరిగిందన్నారు.

అమెరికాలో కాల్పులు.. తెలుగు విద్యార్థి మృతి



పాలకొల్లు సెంట్రల్ : అమెరికాలో దుండగులు జరిపిన కాల్పుల్లో తెలుగు విద్యార్థి వీరా సాయేష్ (24) మృతిచెందాడు. సాయేష్ పినతండ్రి నరసింహారావు గురువారం రాత్రి తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు పట్టణానికి చెందిన వీరా రమణ నాలుగేళ్ల క్రితం మృతిచెందారు. ఆయన చిన్న కుమారుడైన సాయేష్ అమెరికాలోని ఓహియో స్టేట్ పిన్స్ యూనివర్సిటీలో ఎమ్మెస్ చదువుతున్నాడు. పార్ట్‌టైం జాబ్‌గా పెట్రోల్ బంక్‌లో పనిచేస్తుండగా గురువారం వేకువజామున ఇద్దరు దుండగులు వచ్చి కాల్పులు జరిపి నగదు తీసుకుపోయారు. ఈ ఘటనపై గురువారం రాత్రి 8 గంటలకు తమకు సమాచారం అందిందని మృతుడి కుటుంబసభ్యులు తెలిపారు.

రాజధాని పేరుతో మోసం

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్

కర్నూలు(అర్బన్) : రాజధాని పేరుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ ప్రజల్ని మోసం చేస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఆయన గురువారం ఆదోని నియోజకవర్గంలో పర్యటించారు. ఏపీలో రాజధాని ఎక్కడుందో జగన్ చెప్పగలడా.. అని ప్రశ్నించారు. మూడు ప్రాంతాల్లో ఒక్క ఇటుక పెట్టలేదన్నారు. విశాఖ, కర్నూలుని అభివృద్ధి చేసేందుకు ఒక్క కార్యక్రమమైనా చేపట్టారా? అని లోకేశ్ ప్రశ్నించారు.

రైలెక్కట్లేదు.. విమానం దిగట్లేదు

- కోవిడ్ తర్వాత రైలు ప్రయాణాల్లో పెద్దగా కనిపించని రద్దీ
- లాక్‌డౌన్ ముందు స్థితికి చేరుకున్న దేశీయ విమాన ప్రయాణాలు
- ద్రవ్యోల్బణమే కారణమంటున్న ఆర్థిక నిపుణులు
- సామాన్య, మధ్య తరగతి ప్రజలు ప్రయాణాలకు దూరంగా ఉంటున్నట్టు వెల్లడి



\- సాక్షి, అమరావతి

విమాన ప్రయాణికుల రద్దీపెరిగినంత వేగంగా రైలు ప్రయాణాల్లో రద్దీ పెరగటం లేదు. కోవిడ్-19 కారణంగా క్షీణించిన ప్రజా రవాణా నెమ్మదిగా పుంజుకుంటున్నా.. కోవిడ్ ముందు కాలంతో పోలిస్తే సామాన్య, మధ్య తరగతి ప్రజలు ప్రయాణాలకు దూరంగా ఉంటున్నారు. ఈ పరిస్థితికి ద్రవ్యోల్బణమే కారణమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. కోవిడ్ తర్వాత ప్రయాణాల రద్దీ పెరుగుదల ఆర్థిక వృద్ధికి ప్రత్యక్ష సూచికగా నిలుస్తుందని చెబుతున్నారు. కానీ.. కోవిడ్ ముందు సాగినన్ని ప్రయాణాలు ప్రస్తుతం కనిపించటం లేదని స్పష్టం చేస్తున్నారు.

కనిపించని మునుపటి మార్క్..

కరోనాకు ముందు 2019-20 ఆర్థిక సంవత్సరంలో 7,674 మిలియన్ల మంది రైళ్లలో ప్రయాణించగా.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 5,858 మిలియన్ల మంది మాత్రమే ప్రయాణించారు. అంటే ప్రయాణికుల బుకింగ్ 1,816 మిలియన్లు కంటే ఎక్కువ తగ్గింది. 2022-23తో పోలిస్తే.. 2019-20 కంటే 24 శాతం తక్కువ రద్దీని సూచిస్తోంది. సబర్బన్ ప్రాంతాల్లో 20 శాతం తగ్గుదల ఉండగా.. నాన్-సబర్బన్ ప్రాంతాల్లో 29 శాతం తగ్గుదల నమోదైంది. నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ నివేదిక ప్రకారం గత ఏడాదితో పోలిస్తే 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రయాణికుల విభాగంలో రైల్వే 73 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఏప్రిల్ నుంచి మార్చి (2022-23) వరకు రూ.54,733 కోట్ల రాబడి వస్తే.. గత ఆర్థిక ఏడాదిలో ఇది రూ.31,634 కోట్లుగా నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే రైలు ప్రయాణాల్లో వృద్ధి కనిపిస్తున్నా.. 2019-20 కాలం నాటి గణాంకాలతో పోలిస్తే మాత్రం తక్కువగానే ఉంది.

ద్రవ్యోల్బణమే కారణం

ద్రవ్యోల్బణం పెరిగిపోవడం వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారం పడుతోందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజల ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ పరిస్థితుల కారణంగా ఆయా వర్గాల ప్రజలు ప్రయాణాలకు దూరంగా ఉంటున్నట్టు విశ్లేషిస్తున్నారు. ఈ పరిస్థితి రైలు ప్రయాణాల్లో రద్దీ పెరగకపోవడానికి కారణమని స్పష్టం చేస్తున్నారు. ఎగువ, ఉన్నత ఆదాయ వర్గాల వారిపై ద్రవ్యోల్బణం పెద్దగా ప్రభావం చూపని కారణంగా.. ఆ వర్గాల వారు విమానాల్లో యథావిధిగా ప్రయాణించగలుగుతున్నారని చెబుతున్నారు.

విమానాలు ఎక్కేస్తున్నారు



మరోవైపు దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య అనూహ్యంగా వృద్ధి చెందుతూ కోవిడ్ ముందునాటి స్థితికి చేరింది. క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ (ఐసీఆర్ఏ) నివేదిక ప్రకారం 2022-23 ఆర్థిక సంవత్సరంలో దేశీయ విమాన సంస్థలు 1,360 లక్షల మంది ప్రయాణికులను తరలించాయి. ఇది 2021-22లో ప్రయాణించిన 852 లక్షల మంది ప్రయాణికులతో పోలిస్తే 60 శాతం పెరుగుదలను సూచిస్తోంది. అయితే, ప్రస్తుతం దేశీయ ప్రయాణికుల రద్దీ 2020-21 ఆర్థిక సంవ్సతరంలో 1,415 లక్షల కంటే 4 శాతం తక్కువ. ఈ ఏడాది మార్చిలో 130 లక్షల మంది దేశీయంగా విమానాల్లో ప్రయాణించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ సంఖ్య 121 లక్షలు కాగా.. మార్చి నెలలో 8 శాతం వృద్ధిని నమోదు చేయడం విశేషం. 2022 మార్చిలో ఇది 106 లక్షలు ఉండగా.. ప్రస్తుతం 22 శాతం వృద్ధిలో నడుస్తోంది. అదే 2019 మార్చిలో 116 లక్షలు ఉంటే ఇప్పటి మార్చి ప్రీకోవిడ్‌లో చూస్తే 12 శాతం పెరుగుదల కనిపిస్తోంది.

సరుకు రవాణా పెరుగుతోంది



దేశంలో అత్యధికంగా ఒక ఆర్థిక సంవత్సరంలో సరుకు రవాణా చేసిన సంస్థగా రైల్వే రికార్డు సృష్టించింది. జాతీయ రవాణా సంస్థ అధికారిక ప్రకటన ప్రకారం.. 2022-23లో 1,512 మిలియన్ టన్నుల సరుకును రైల్వే రవాణా చేసింది. 2021-22లో 1,418 మిలియన్ టన్నులు తరలించింది. ఇక్కడ 2022-23లో రైల్వే మొత్తం ఆదాయం రూ.2.44 లక్షల కోట్లు కాగా.. 2021-22లో రూ.1.91 లక్షల కోట్లుగా నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే మొత్తం ఆదాయంలో ఏకంగా 27.75 శాతం వృద్ధిని సూచిస్తోంది.



రాష్ట్రంలో 'ఈవీ' విప్లవం

- 250 చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు నెడ్‌క్యాప్ సన్నాహాలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి/భవానీపురం (విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలో విద్యుత్ వాహనాల (ఈవీల) విప్లవాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో న్యూ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (నెడ్‌క్యాప్) 250 ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. వీటిలో వంద ఏడాదిలోపే అందుబాటులోకి వస్తాయన్నారు. ఆయన గురువారం విజయవాడ భవానీపురంలోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో సోలార్ సిస్టమ్ ద్వారా పనిచేసే సైన్స్ ఎగ్జిబిట్స్‌ను, రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆవరణలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్‌ను, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సహకారంతో ఎస్ఆర్ఈడీసీఏపీ ఏర్పాటు చేసిన పునరుత్పాదక ఇంధన వనరుల కేంద్రాన్ని ప్రారంభించారు.

దశలవారీగా పెట్రోల్ వాహనాల తొలగింపు

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించే పాలసీ రూపకల్పన, ప్రభుత్వ ఉద్యోగులకు ఈఎంఐ ప్రాతిపదికన లక్ష ఎలక్ట్రిక్ వాహనాలను పంపిణీ చేయడం, రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు వంటి ప్రోత్సాహకాలు ఇవ్వడం వంటి ఈ-మొబిలిటీ కార్యకలాపాలను ప్రోత్సహించడంలో సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రియాశీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. 2030 నాటికి పెట్రోల్ వాహనాలను దశలవారీగా తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అందులో భాగంగా నగరాలు, పట్టణాల్లో ప్రతి మూడు కిలోమీటర్ల గ్రిడ్ పరిధిలో, జాతీయ, రాష్ట్ర రహదారుల వెంబడి 25 కిలోమీటర్ల పరిధిలో ఒక చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందించిందని చెప్పారు. కార్యక్రమాల్లో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



ఎలక్ట్రికల్ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

కోతలు లేకుండా కరెంట్

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండు పెరిగినప్పటికీ సీఎం వైఎస్ జగన్ మార్గదర్శకంలో పకడ్బందీ ప్రణాళికతో కోతలు లేకుండా కరెంటు సరఫరా చేస్తున్నామని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. ఎన్నడూలేని విధంగా ఈ ఏప్రిల్‌లో గురువారం 246.3 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండు నమోదైందన్నారు. వేసవిలో విద్యుత్ వినియోగం పెరుగుతుందనే అంచనాతో అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారని తెలిపారు. వేసవిలో పెరుగుతున్న విద్యుత్ డిమాండును అధిగమించేందుకు తీసుకుంటున్న చర్యలు, విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో కుదిరిన అవగాహన ఒప్పందాలకు అనుగుణంగా పరిశ్రమల ఏర్పాటుపై గురువారం వెలగపూడిలోని సచివాలయంలో ఆయన అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

ఆడిటర్‌ను నియమించే అధికారం ఉంది

- తెలంగాణ హైకోర్టులో ఏపీ సర్కార్ వాదనలు
- మార్గదర్శి బ్యాలెన్స్ షీట్‌ను ఫైల్ చేయడం లేదు
- మార్గదర్శి పిటిషన్‌పై తీర్పు రిజర్వు చేస్తున్నట్లు న్యాయస్థానం ప్రకటన

సాక్షి, హైదరాబాద్: 'చిట్‌ఫండ్స్‌కు సంబంధించిన అవకతవకలపై ప్రాథమిక ఆధారాలున్నప్పుడు నిశితంగా పరిశీలించి నిగ్గు తేల్చేందుకు ప్రైవేట్ ఆడిటర్‌ను నియమించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది. చిట్‌ఫండ్ చట్టంలోని సెక్షన్లు ఈ విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాయి. అసలు ఈ పిటిషన్‌పై విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు లేదు' అని తెలంగాణ హైకోర్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నివేదించింది. మార్చి 13, 15, 18న ఏపీ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్-ఐజీ ఇచ్చిన ఆదేశాలను కొట్టి వేయడంతోపాటు ఆడిటర్ వేములపాటి శ్రీధర్ నియామకాన్ని, తమ సంస్థలో ఆయన ద్వారా ఆడిటింగ్ చేపట్టడాన్ని రద్దు చేయాలంటూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై గురువారం విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ ముమ్మినేని సుధీర్ కుమార్ సుదీర్ఘంగా వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించారు. ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి, ఆడిటర్ శ్రీధర్ తరఫున సీనియర్ న్యాయవాది పట్టాభి, పిటిషనర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, దేవదత్ కామత్ వాదనలు వినిపించారు.

హైకోర్టుల పరిధిని సుప్రీం స్పష్టంగా చెప్పింది..

'తనిఖీలు నిర్వహించిన 37 బ్రాంచీలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయి. కేసులు అక్కడే నమోదయ్యాయి. విచారణ అధికారులు కూడా అక్కడివారే. అలాంటప్పుడు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేయడం సరికాదు. పరిధి కాకున్నా మార్గదర్శి ప్రతిసారి తెలంగాణ హైకోర్టులోనే పిటిషన్లు దాఖలు చేస్తోంది. వీటిపై విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు లేదు. మార్గదర్శి నుంచి స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు, రిజిస్టర్లను పరిశీలించగా అనేక అక్రమాలు వెలుగులోకొచ్చాయి. దీంతో వీటిపై క్షుణ్ణంగా పరిశీలన జరిపేందుకు ఆడిటర్‌ను నియమించాం. చిట్ ఫండ్స్ చట్టం సెక్షన్ 61 సబ్ సెక్షన్ 2 ప్రకారం ప్రైవేట్ ఆడిటర్‌ను నియమించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. సబ్ సెక్షన్ 4 ప్రకారం డాక్యుమెంట్లను ఆడిట్ చేసే అధికారం కూడా ఉంది. ఒకటి రెండు అంశాల్లో మినహా ఏపీ హైకోర్టు పరిధిలోని అంశాల్లో తెలంగాణ హైకోర్టు కలుగజేసుకునే అవకాశం లేదు. ఇది ఏపీ పునర్విభజన చట్టంలో స్పష్టంగా ఉంది. ప్రత్యేకంగా ఏపీకి హైకోర్టు ఏర్పడ్డాక తెలంగాణ హైకోర్టుకు అక్కడి అంశాలపై పరిధి ఉండదని చట్టం చెబుతోంది. డెట్ రిలీఫ్ ట్రిబ్యునల్(డీఆర్‌టీ)కి సంబంధించి డీఆర్‌టీ-2 రాయలసీమ పరిధి వరకే జోక్యం చేసుకోవచ్చని చట్టం చెబుతోంది. అయితే ఇందులో కూడా కలుగచేసుకోరాదని తెలంగాణ హైకోర్టు గతంలో పేర్కొంది. హైకోర్టుల పరిధికి సంబంధించి సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో స్పష్టంగా నిర్వచించింది. ద స్టేట్ ఆఫ్ గోవా వర్సెస్ సమ్మిట్ ఆన్‌లైన్ ట్రేడ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు దీనిపై కీలక తీర్పు వెలువరించింది. ఒక హైకోర్టు పరిధిలో మరో హైకోర్టు పరిధి దాటి కలుగజేసుకోరాదని ఆదేశించింది. 'కాజ్ ఆఫ్ యాక్షన్' ఏ రాష్ట్రంలో జరిగితే విచారణ కూడా అదే హైకోర్టు పరిధిలో జరగాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఏపీ హైకోర్టు పరిధిలో కలుగజేసుకోలేమని ఇదే హైకోర్టు పలు తీర్పులు కూడా ఇచ్చింది. మారుతి జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీ అండ్ అదర్స్ వర్సెస్ డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-2, హైదరాబాద్ అండ్ అదర్స్‌కు సంబంధించిన కేసులో జస్టిస్ ఉజ్జల్ భూయాన్ బెంచ్, జస్టిస్ వెంకటేశ్వరరెడ్డి ధర్మాసనం ఏపీ హైకోర్టు పరిధిలో కలుగజేసుకోలేమని స్పష్టం చేసింది' అని గోవిందరెడ్డి నివేదించారు.

60 దశాబ్దాలైనా తప్పు తప్పే అవుతుంది

'సేకరించిన నగదును అక్రమ మార్గాల్లో సొంత కంపెనీలకు, షేర్ మార్కెట్లకు, మ్యూచువల్ ఫండ్స్‌కు మార్గదర్శి మళ్లిస్తోంది. దాదాపు 46 రోజుల తర్వాత కోర్టును ఆశ్రయించడం సమర్థనీయంకాదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఒక చిట్‌ఫండ్ ఎక్కువ.. మరో చిట్ ఫండ్ తక్కువ కాదు.. అన్నీ సమానమే. అన్ని చిట్‌ఫండ్స్‌లోనూ తనిఖీలు చేస్తున్నాం. అవకతవకలు ఎక్కడ జరిగినా వదిలే ప్రసక్తే లేదు. దాదాపు 6 దశాబ్దాలుగా చిట్‌ఫండ్స్ నడుపుతున్నామని పిటిషనర్ చెబుతున్నారు. 60 దశాబ్దాలుగా నడుపుతున్నా.. తప్పు తప్పే అవుతుంది కానీ ఒప్పు కాదన్న విషయం గ్రహించాలి. చిట్ ఫండ్స్ చట్టం 1982 ప్రకారమే ఆడిటింగ్ జరుగుతోంది. కొన్ని సంవత్సరాలుగా మార్గదర్శి బ్యాలెన్స్ షీట్ ఫైల్ చేయడం లేదు. లాభ నష్టాలకు సంబంధించి దీన్ని ఏటా ప్రభుత్వానికి తప్పకుండా సమర్పించాలి. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీ వద్ద ఫైల్ చేస్తున్నామంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. ఇది చట్టాలను ఉల్లంఘించడమే. పత్రికల్లో ఇచ్చిన ప్రకటనలు చట్టబద్ధం కాదు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు కూడా చెప్పింది. ప్రభుత్వం దురుద్దేశంతో ఇదంతా చేస్తోందని ఆరోపించడం సరికాదు. అక్రమాలు తేలితే అన్ని చిట్‌ఫండ్స్‌పై చర్యలు తీసుకుంటాం. వీటిని పరిగణనలోకి తీసుకుని పిటిషన్‌ను కొట్టివేయాలి' అని స్పెషల్ జీపీ గోవిందరెడ్డి కోరారు.

మా వాదనలు వినకుండా ఉత్తర్వులివ్వొద్దు..

'ఈ కేసులో ప్రభుత్వం నియమించిన ఆడిటర్ కౌంటర్ దాఖలు చేయకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వవద్దు. ఆడిటర్ ఎవరికీ అనుకూలం కాదు.. ఎవరికీ వ్యతిరేకం కూడా కాదు. రికార్డుల పరిశీలనకు ప్రభుత్వం నియమించడంతో విధి నిర్వహణలో భాగంగా పరిశీలన చేస్తున్నాం' అని ఆడిటర్ తరఫు న్యాయవాది పట్టాభి పేర్కొన్నారు. 'ప్రభుత్వం దురుద్దేశంతోనే ఆడిటింగ్ చేపడుతోంది. దీనివల్ల సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. ఆడిటర్‌ను నియమిస్తూ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలి' అని రోహత్గీ అభ్యర్థించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై హత్యాయత్నం

తాడిపత్రి (అనంతపురం జిల్లా): వైఎస్సార్ జిల్లా తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి హరినారాయణరెడ్డి ప్రయాణిస్తున్న కారును వ్యాన్‌తో ఢీకొట్టి హత్యాయత్నం చేసిన ఘటన తాడిపత్రి మండలం బొందలదిన్నె గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. తాళ్లప్రొద్దుటూరుకు చెందిన హరినారాయణరెడ్డి బొందలదిన్నెలో నివాసం ఉంటున్నారు. రాత్రి 9.30 గంటల సమయంలో కారులో ఇంటికి చేరుకునే క్రమంలో ప్రధాన రహదారిపై నుంచి మలుపు తిరిగేచోట ఎదురుగా అతివేగంగా వచ్చిన క్యాంపర్ వాహనం ఢీకొంది. దీనిని పసిగట్టిన హరినారాయణరెడ్డి అప్రమత్తమై డ్రైవింగ్ సీటు నుంచి పక్క సీటులోకి దూకి.. కారు డోర్ తీసుకుని పరిగెత్తాడు. క్యాంపర్ డ్రైవర్ వెంటనే వాహనం దిగి పరారయ్యాడు. తాడిపత్రి రూరల్ ఎస్ఐ మహమ్మద్ గౌస్‌తో కలసి తాడిపత్రి డీఎస్పీ వీఎన్‌కే చైతన్య ఘటనా స్థలానికి చేరుకుని హరినారాయణరెడ్డితో మాట్లాడారు. జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ రవికుమార్ సైతం ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, హరినారాయణరెడ్డిపై హత్యాయత్నం జరిగిందనే విషయం తెలుసుకున్న జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి బొందలదిన్నెకు చేరుకుని హరినారాయణరెడ్డిని పరామర్శించారు.



హరినారాయణరెడ్డిని పరామర్శిస్తున్న జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

మెరుగుపడుతున్న శ్రీలంక ఆర్థిక పరిస్థితి

ఎంపీ రంజిత్ మద్దుమ బండర



ఆలయం వెలుపల ఎంపీ రంజిత్ మద్దుమ బండర

తిరుమల: శ్రీలంక ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ మెరుగవుతోందని శ్రీలంక ఎంపీ రంజిత్ మద్దుమ బండర తెలిపారు. గురువారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. శ్రీలంక పూర్తి స్థాయిలో కోలుకోవడానికి కొంత సమయం పడుతుందన్నారు. తమిళనాడు, శ్రీలంక మధ్య మంచి సంబంధాలే ఉన్నాయని చెప్పారు.

పట్టణ ప్రాంతాల్లోనూ వేగంగా భూ సర్వే

- జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్ష పై కేబినెట్ సబ్ కమిటీ భేటీ
- పట్టణ ప్రాంతాల్లో 15 లక్షల ఎకరాలు.. 38.19 లక్షల ఆస్తుల సర్వే
- తొలిదశలో 2 వేల గ్రామాల్లో భూహక్కు పత్రాల పంపిణీ
- వివాదాల పరిష్కారానికి కలెక్టర్లతో స్పెషల్ డ్రైవ్

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో భూముల సర్వే జోరుగా జరుగుతున్న నేపథ్యంలో పట్టణాల్లో కూడా వేగవంతం చేయాలని జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్షపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా 123 పట్టణ స్థానిక సంస్థల్లో 15 లక్షల ఎకరాలను సర్వే చేయాల్సి ఉందని సబ్ కమిటీ పేర్కొంది పట్టణ ప్రాంతాల్లో 5.5 లక్షల ఎకరాలు వ్యవసాయ భూమి కాగా మిగిలిన 9.44 లక్షల ఎకరాలు పట్టణ ప్రాంతంగా ఉన్నట్లు గుర్తించారు. వీటికి సంబంధించి 38.19 లక్షల ఆస్తుల సర్వేను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించింది. జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్ష పథకం అమలుపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో కేబినెట్ సబ్ కమిటీ సమావేశమై సమీక్షించింది. మంత్రులు ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ, ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లంతో పాటు పలువురు అధికారులు ఇందులో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తొలిదశలో 2 వేల గ్రామాల్లో మే 20వ తేదీలోగా సర్వే పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సబ్ కమిటీ స్పష్టం చేసింది. డ్రోన్ సర్వే, మ్యాపింగ్, గ్రౌండ్ ట్రూతింగ్, రికార్డుల వివాదాల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటివరకు సిద్ధమైన 1,94,571 భూహక్కు పత్రాలను ఈ కేవైసీ ద్వారా వివాదాలకు తావు లేకుండా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ యజమానుల నుంచి అందే ఫిర్యాదులను పరిష్కరించేందుకు కలెక్టర్లు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు.



10,409 గ్రామాల్లో డ్రోన్ ఫ్లై ప్రక్రియ పూర్తి

ఈ నెలాఖరు నాటికి 10,409 గ్రామాల్లో డ్రోన్ ఫ్లై ప్రక్రియ పూర్తి కానుంది. 7,158 గ్రామాల్లో డ్రోన్ ఫొటోలు తీసుకుని 3,758 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. 2,611 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, 2,391 గ్రామాల్లో రెవెన్యూ రికార్డుల పరిశీలన ముగిసిందని చెప్పారు. సర్వే ప్రక్రియలో జాప్యం లేకుండా ముందుగానే రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్నామని, 4 లక్షలకు పైగా రికార్డులకు మ్యుటేషన్ అవసరమని గుర్తించినట్లు వెల్లడించారు. జూన్ నాటికి రాష్ట్రంలో డ్రోన్ ఫ్లై ప్రక్రియ పూర్తి చేయాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు.

25.8 లక్షల సర్వే రాళ్లు

సర్వే పూర్తయిన గ్రామాల కోసం 25.8 లక్షల సర్వే రాళ్లు సిద్ధంగా ఉన్నట్లు మైనింగ్ అధికారులు తెలిపారు. 18.9 లక్షల సర్వే రాళ్లను ఇప్పటికే సరఫరా చేయగా మరో 12.3 లక్షల రాళ్లు ఆయా గ్రామాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. రోజుకు 50 వేల సర్వే రాళ్లను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సర్వే ముగిసిన గ్రామాల్లో రాళ్లను పాతే ప్రక్రియ మే 20వ తేదీలోగా పూర్తవుతుందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో 30.11 లక్షల ఆస్తులను వెరిఫై చేశామని, అందులో 36.32 లక్షల నిర్మాణాలు ఉన్నట్లు పురపాలక శాఖ అధికారులు పేర్కొన్నారు. సర్వే కోసం మాస్టర్ ట్రైనర్ల ద్వారా అన్ని జిల్లాల్లో సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. సమావేశంలో సీసీఎల్ఏ జి.సాయిప్రసాద్, అటవీ దళాల అధిపతి వై.మధుసూదన్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి, సర్వే అండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ సిద్ధార్థజైన్, ఎంఏయూడీ కమిషనర్ కోటేశ్వరరావు, డీఎంజీ వి.జి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

రెండోరోజూ 'మైత్రి మూవీస్'లో ఐటీ తనిఖీలు

డైరెక్టర్ సుకుమార్ ఇళ్లలోనూ కొనసాగిన సోదాలు

సాక్షి, హైదరాబాద్: అక్రమమార్గాల్లో పెట్టుబడులు తీసుకోవడం, పన్ను ఎగవేత వంటి ఆరోపణలపై మైత్రి మూవీ మేకర్స్ సంస్థ కార్యాలయం, ప్రముఖ సినీదర్శకుడు సుకుమార్ ఇళ్లలో గురువారం కూడా ఐటీ సోదాలు కొనసాగాయి. భారీ బడ్జెట్ సినిమాల పెట్టుబడుల కోసం విదేశాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా పెద్దమొత్తంలో డబ్బులు తీసుకున్నారన్నది ప్రధాన ఆరోపణ. జీఎస్టీ చెల్లింపులు సైతం సక్రమంగా చేయకపోవడంతోనే ఐటీ అధికారులు రంగంలోకి దిగినట్టు తెలిసింది. నగరంలో బుధవారం ఉదయం నుంచి ప్రారంభమైన సోదాలు గురువారం కూడా కొనసాగాయి. జూబ్లీహిల్స్‌లోని కార్పొరేట్ ఆఫీస్‌తోపాటు సుకుమార్ ఇల్లు, మైత్రి మూవీ మేకర్స్ సంస్థ ప్రతినిధులు రవిశంకర్, నవీన్ ఇళ్లలోనూ ఐటీ బృందాలు తనిఖీ చేసినట్టు తెలిసింది. ముంబైకి చెందిన ఓ ఫైనాన్సియర్ హవాలా మార్గంలో తెచ్చిన డబ్బులను సినిమారంగంలో పెట్టుబడులకు వినియోగిస్తున్నట్టు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఐటీ అధికారులు ముంబైలో తనిఖీ చేశారు. అందులో వెలుగుచూసిన కీలకపత్రాల ఆధారంగా హైదరాబాద్‌లోనూ ఈ సోదాలు మొదలుపెట్టినట్టు తెలుస్తోంది. రెండురోజులుగా జరుగుతున్న తనిఖీల్లో ముంబైకి చెందిన ఫైనాన్సియర్లతో చేసుకున్న ఇన్వెస్ట్‌మెంట్స్ డీల్స్ సైతం వెలుగులోకి వచ్చినట్టు తెలిసింది. టాలీవుడ్‌తోపాటు బాలీవుడ్‌లోనూ భారీ బడ్జెట్ సినిమాలు నిర్మించేందుకు హవాలా మార్గంలో రూ.వందల కోట్లు సేకరించినట్లు తెలుస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ సంస్థతో కలిసి దర్శకుడు సుకుమార్ పుష్ప-2 సినిమాను నిర్మిస్తున్నారు. దీంతో ఈ సంస్థకు, సదరు డైరెక్టర్‌కు మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీలపైనా ఐటీ అధికారులు దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. సినిమాల్లో వచ్చిన లాభాలు, పన్నుల ఎగవేత ఫలితంగా మిగిల్చిన సొమ్ముతో హైదరాబాద్ నగర శివారుల్లో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేసినట్టు ఆరోపణలున్నాయి. ఐటీ అధికారుల బృందాలు ఇప్పటికే పలు కీలకపత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. రెండురోజుల తనిఖీల్లో లభించిన ఆధారాలను విశ్లేషించిన తర్వాత ఐటీ అధికారులు తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

● సక్సెస్ స్టోరీ


అష్రఫ్

**స్టార్టప్ స్టార్ట్ చేయగానే 'సక్సెస్' అందరి దగ్గరికీ రాకపోవచ్చు.
చేదుఫలం మిగలవచ్చు.
'మన వల్ల కాదు' అని వచ్చిన దారినే
వేగంగా వెళ్లే వాళ్లు కొందరైతే...
'ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది. అదేమిటి?' అని
లోతుగా విశ్లేషించుకునేవారు కొందరు.
బిహార్‌లోని నలందా జిల్లాకు చెందిన అష్రఫ్
రెండో కోవకు చెందిన యువకుడు.
బ్యాక్-టు-బ్యాక్ ఫెయిల్డ్ వెంచర్స్ నుంచి
గుణపాఠాలు నేర్చుకొని 'జార్' అనే ఫిన్‌టెక్‌తో
తిరుగులేని విజయం సాధించాడు...**

జార్ స్టార్

మిస్‌బహ్ అష్రఫ్ తండ్రి టీచర్. ఆయనకు నెమ్మదిగా నడిచే అలవాటు ఉంది. ఒకరోజు తండ్రిని అడిగాడు...

'ఎందుకలా నెమ్మదిగా నడుస్తారు?' అని.

'వేగంగా నడిచి పడడం కంటే నెమ్మదిగా నడవడం మంచిదే కదా! ఉరుకులు పరుగులు లేకుండా నెమ్మదిగా ఉన్నప్పుడే తెలివైన ఆలోచనలు వస్తాయి' అని ఆయన సమాధానం ఇచ్చాడు.

చాలా సంవత్సరాలకు తండ్రి చెప్పిన మంచి మాటకు అష్రఫ్‌కు అర్థం తెలిసింది.

ఐఐటీ-దిల్లీ మిత్రులతో కలిసి 'సీబోల' అనే పేమెంట్ వెంచర్‌ని స్టార్ట్ చేశాడు అష్రఫ్. సంవత్సరం తిరగకుండానే 'ఇక సెలవా మరీ' అంటూ ఆ వెంచర్ మూతపడింది. మూతపడడానికి ఎన్నో కారణాలు ఉన్నా ప్రధాన కారణం మాత్రం కాలం కంటే ముందు ఉండడం. ఒక రకంగా చెప్పాలంటే తొందరపడి ఒక కోయిల ముందే కూసింది!

'మార్కెట్ తీరుతెన్నులు గమనించి జాగ్రత్తగానే వెంచర్ స్టార్ట్ చేశాము. అయితే స్పీడ్ ఆఫ్ చేంజ్ అంచనా వేయడంలో పొరపాటు జరిగింది' అని గతాన్ని గుర్తు చేసుకున్నాడు అష్రఫ్.

నాలుగు సంవత్సరాల విరామం తరువాత...

రెండో వెంచర్ స్టార్ట్ చేశాడు.

ఫ్యాషన్ అండ్ బ్యూటీకి సంబంధించి ఈ కమ్యూనిటీ కామర్స్ ప్లాట్‌ఫామ్ సక్సెస్‌కు దగ్గరలో ఉన్నప్పుడు కరోనా కోరలు తెరిచింది. డబ్బులకు ఇబ్బంది పడే పరిస్థితులలో ఈ కంపెనీని అమ్మకతప్పలేదు.

> కారణమంతా కరోనా మీద నెట్టకుండా ఈ ఫెయిల్యూర్‌ని కూడా లోతుగా విశ్లేషించుకున్నాడు అష్రఫ్. బ్యాక్-టు-బ్యాక్ ఫెయిల్డ్ వెంచర్స్ నుంచి ఎన్నో గుణపాఠాలు నేర్చుకున్నాడు.

కారణమంతా కరోనా మీద నెట్టకుండా ఈ ఫెయిల్యూర్‌ని కూడా లోతుగా విశ్లేషించుకున్నాడు అష్రఫ్.

బ్యాక్-టు-బ్యాక్ ఫెయిల్డ్ వెంచర్స్ నుంచి ఎన్నో గుణపాఠాలు నేర్చుకున్నాడు.

పరుగెత్తి పాలు తాగడం కంటే నిలబడి నీళ్లు తాగడమే బెటర్ అనుకున్నాడు.

కొంత విరామం తరువాత...

ఏజీ మిష్‌రెతో కలిసి 'జార్' అనే వెంచర్ స్టార్ట్ చేశాడు. యూజర్స్‌కు సేవ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ విషయంలో సహాయపడే ఈ ప్రాడక్ట్ తిరుగులేని సక్సెస్ అయింది. పద్దెనిమిది నెలల వ్యవధిలో పదకొండు మిలియన్‌ల యూజర్‌ల స్థాయికి చేరింది.

రోజుకు వేల సంఖ్యలో ట్రాన్సాక్షన్‌లు జరిగేవి. టైగర్ గ్లోబల్, రాకెట్‌షిప్, అర్కమ్ వెంచర్స్ లాంటి పెద్ద సంస్థలు 'జార్'కు ఫండింగ్ చేశాయి.

చాలామందికి ఇన్వెస్ట్ చేయాలని ఉంటుంది. అయితే ఎలా మొదలుపెట్టాలో తెలియదు. ఈలోపు రకరకాల సందేహాలు చుట్టుముడుతాయి. పెట్టుబడి గురించి ఆలోచిస్తున్నప్పుడు వందల సంఖ్యలో ఆప్షన్‌లు ముందుకు వచ్చి గందరగోళానికి గురిచేస్తుంటాయి.

ఆ గందరగోళం తప్పించి సేవ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ విషయంలో పారదర్శకమైన దారిని ఏర్పాటు చేయడంలో 'జార్' విజయం సాధించింది.

'అపజయం అనేది అంతిమం కాదు. అది నీ అడుగుల్లో ఒకటి మాత్రమే. ఇంకా ఎన్నో అడుగులు మిగిలే ఉన్నాయి' అనే సత్యాన్ని 'జార్' విజయం యువతరానికి చెప్పకనే చెప్పింది.

'ఆర్థిక ఇబ్బందులు ఉండే మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చాను. ఎందుకు రిస్క్ చేస్తున్నావు? చక్కగా ఏదో ఒక ఉద్యోగం చేసుకోవచ్చు కదా. స్టార్టప్‌లలో ఏ కొద్దిమందో సక్సెస్ అవుతారో... ఇలాంటి మాటలను ఎన్నోసార్లు విన్నాను. అయితే ఎప్పుడూ వెనకడుగు వేయాలనిపించలేదు. సక్సెస్ అయిన వాళ్లకు వరాలు ఇచ్చే అద్భుత దీపాలేవీ దొరకలేదు. వాళ్లు నాలాంటి వాళ్లే. వాళ్లు సక్సెస్ అయినప్పుడు నేనెందుకు కాలేను అని సీరియస్‌గా ఆలోచించాను. నా నమ్మకం వృథా పోలేదు. జార్ ద్వారా ఈతరంలో పొదుపు అలవాటు పెరిగేలా కృషి చేస్తాం' అంటున్నాడు 29 సంవత్సరాల అష్రఫ్.

● ఇంగ్లిష్ ఇడియమ్

సాట్ ఆన్ ది ఫెన్స్

ఏదీ నిర్ణయించుకోలేని, ఎటు వైపు మొగ్గుచూపని పరిస్థితుల్లో ఉపయోగిస్తారు.

కమ్ రెయిన్ ఆర్ షైన్

'ఎలాంటి పరిస్థితులలో అయినా జరిగితీరుతుంది' అని చెప్పే సందర్భంలో ఉపయోగిస్తారు.

ఉదా: ఐ విల్ బి ఎట్ యువర్ ఫుట్‌బాల్‌గేమ్. కమ్ రెయిన్ ఆర్ షైన్



జంప్ ఆన్ ది బ్యాండ్‌వ్యాగన్

పాపులర్ ట్రెండ్‌లో భాగం అయ్యే సందర్భంలో ఉపయోగించే మాట.

యాజ్ రైట్ యాజ్ రెయిన్

'పర్‌ఫెక్ట్' అని చెప్పే సందర్భంలో ఉపయోగిస్తారు.

యువర్స్

సాంగ్ ఈటర్

● మ్యూజిక్ వరల్డ్


దావనీ భానుశాలి

పాప్ ఆర్టిస్ట్‌గా దేశ, విదేశాల్లో గుర్తింపు పొందింది దావనీ భానుశాలీ. ఆమె పాట 'వాస్తే'కు యూట్యూబ్‌లో 'బిలియన్' వ్యూస్ వచ్చాయి. మరో విశేషం తన రెండో పాట 'దిల్బార్' ఒకే రోజులో 25 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది. పాప్, హిప్-హప్, రాక్... జానర్ ఏదైనా తనదైన గాన ప్రతిభతో ప్రేక్షకులను మెప్పిస్తోంది 25 సంవత్సరాల దావనీ భానుశాలీ.

చిన్న వయసులోనే సంగీతానికి దగ్గరైన దావనీని ఉపాధ్యాయులు ప్రోత్సహించి ఉత్సాహపరిచేవారు.


శాస్త్రీయ సంగీతం నేర్చుకున్న దావనీ వారి నుంచి నైపుణ్యాలను నేర్చుకోవడమే కాదు, వారిలోని అంకిత భావంతో స్ఫూర్తి పొందింది.

దావనికి పాటలు ఎంత ఇష్టమంటే, తనను తాను 'సాంగ్ ఈటర్'గా పిలుచుకుంటుంది. చిన్న వయసులోనే సింగర్‌గా పెద్ద సక్సెస్‌ను చూసిన దావనీ భానుశాలీ ఇలా అంటోంది...

'సక్సెస్‌ను సరదాగా ఎంజాయ్ చేయాలేగానీ సీరియస్‌గా తలకెక్కించుకుంటే ముందుకు అడుగు వేయలేము. ఇక ఔత్సాహిక గాయకుల విషయానికి వస్తే ఇతరుల నుంచి స్ఫూర్తి మాత్రమే పొందాలి. పాటపై మనదైన సంతకాన్ని ఎప్పుడూ మరచిపోవద్దు' అంటుంది.

● ఆర్ట్ అండ్ కల్చర్


అయ్‌బాబోయ్... ఇలా అయిపోనదేటీ!



ఆస్ట్రియన్ కార్టూనిస్ట్ క్లాస్ పీటర్ గీసిన కార్టూన్ ఇది. 74 సంవత్సరాల పీటర్ కార్టూన్ చిత్రాలు యూరప్‌లో ఎన్నో చోట్ల ప్రదర్శించబడ్డాయి. గ్రాఫిక్ డిజైన్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసిన పీటర్ పిల్లల కోసం ఎన్నో కామిక్‌బుక్స్ రూపొందించాడు. తన కళాయాత్రలో భాగంగా రెండు సంవత్సరాల క్రితం మన దేశానికి వచ్చాడు పీటర్. అతడి చిత్రప్రదర్శన కూడా జరిగింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆర్‌కె లక్ష్మణ్ నుంచి యువ ఆర్టిస్‌ల వరకు ఆయనకు ఎంతోమంది సుపరిచితమే.

టెక్.. టాక్

అసూస్ రోగ్ ఫోన్ 7



డిస్‌ప్లే: 6.78 అంగుళాలు
రిజల్యూషన్: 1080×2448 పిక్సెల్స్; మెమోరీ: 512 జీబి 16 జీబి ర్యామ్ బ్యాటరీ: 6000 ఎంఏహెచ్; బరువు: 239 గ్రా.
● ఫింగర్‌ప్రింట్ రీడర్ ● స్టీరియో స్పీకర్స్
● వోఎస్: ఆండ్రాయిడ్ 13

షావోమి బ్యాండ్ 8



ఫ్యాషన్ యాక్సెసరీగా ఆకట్టుకునే షావోమి బ్యాండ్‌లో ఉపయోగపడే ఫీచర్‌లు కూడా ఉన్నాయి. దీన్ని రెండు వైపులా ధరించవచ్చు. డిఫరెంట్ స్టైలిష్ స్ట్రాప్స్ ఉన్న ఈ బ్యాండ్‌ను నెక్లెస్‌లా మెడలో కూడా వేసుకోవచ్చు. ● ఇన్‌బిల్ట్ జీపీఎస్ ● ఆల్ డే-హార్ట్ ట్రాకింగ్ ఫీచర్స్, స్లీప్ ట్రాకింగ్, స్ట్రెస్ మానిటరింగ్, బ్లడ్ ఆక్సిజన్ మానిటరింగ్... మొదలైన యాక్టివేట్ ఫీచర్స్ ఉన్నాయి.

మెటా యానిమేషన్ టూల్

మనం గీసిన బొమ్మలు, డూడుల్స్‌ను మెటా వారి 'యానిమేషన్ డ్రాయింగ్' టూల్‌తో యానిమేట్ చేయవచ్చు. ఎలా అంటే ఇలా...
● స్కెచ్.మెటాడెమోల్యాబ్.కామ్ లోకి వెళ్లాలి.
● యానిమేట్ చేయాలనుకున్న ఇమేజ్‌లను అప్‌లోడ్ చేయాలి. ● అప్‌లోడ్ చేసిన తరువాత 'అప్‌లోడ్ ఫొటో' బటన్ నొక్కాలి. ● డ్రాయింగ్స్‌ను మెరుగుదిద్దడానికి పెన్ అండ్ ఎరేజర్ సదుపాయం ఉంది. ● వాకింగ్, డ్యాన్స్, జంపింగ్, ఫన్నీ అనే నాలుగు రకాల యానిమేషన్స్ ప్రీసెట్స్, ఎన్నో రకాల యాక్షన్స్ ఉన్నాయి.





'రీల్స్' కోసం కొత్త ఫీచర్

ఫొటో షేరింగ్ అప్లికేషన్ ఇన్‌స్టాగ్రామ్ తన 'రీల్స్' కోసం ఎక్సైటింగ్ ఫీచర్స్‌ను తీసుకురానుంది. అందులో ఒకటి... డెస్టినేషన్. ఈ ఫీచర్ సహాయంతో రీల్స్‌లో టాప్ ట్రెండింగ్ సాంగ్స్ చూడవచ్చు. సింగిల్ స్క్రీన్‌లో వీడియో క్లిప్‌లు, స్టిక్కర్లు, ఆడియో వీడియోలు ఎడిటింగ్ చేసుకోవచ్చు. 'రీల్స్'ను సులభంగా ఎడిట్ చేయవచ్చు. ప్రస్తుతం ఇది ఐవోఎస్, ఆండ్రాయిడ్ యూజర్‌లకు అందుబాటులో ఉంది. 'రీల్స్' ఇన్‌సైట్స్‌ను మెరుగుపరచడానికి రెండు మెట్రిక్‌లను జత చేశారు. టోటల్ వాచ్‌టైమ్, యావరేజ్ వాచ్ టైమ్‌లను సులభంగా తెలుసుకోవచ్చు.

సినిమా

గౌరవంగా భావిస్తున్నా

- సమంత


● సమంత, హాలీవుడ్ యాక్టర్ స్టాన్లీ టుటీ

''లండన్‌లో ఇటీవల జరిగిన 'సిటాడెల్' వరల్డ్ ప్రీమియర్‌కి హాజరవడం గౌరవంగా భావిస్తున్నాను. ఈ ఈవెంట్‌లో హాలీవుడ్ స్టార్స్‌ని కలవడం ఆనందంగా ఉంది'' అని సమంత అన్నారు. ప్రియాంకా చోప్రా, రిచర్డ్ మాడాన్ కీలక పాత్రల్లో నటించిన హాలీవుడ్ వెబ్ సిరీస్ 'సిటాడెల్'. రూసో బ్రదర్స్ సృష్టించిన ఈ ఫిక్షన్ డ్రామా సిరీస్ ఈ నెల 28నుంచి అమెజాన్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఈ నెల 18న లండన్‌లో 'సిటాడెల్' ప్రీమియర్ షో వేశారు. ఈ ప్రీమియర్‌కి ప్రియాంకా చోప్రా, రిచర్డ్ మాడాన్‌తో పాటు 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ (బాలీవుడ్) సిరీస్‌లో నటిస్తున్న సమంత, వరుణ్ ధావన్, దర్శకులు రాజ్-డీకే హాజరయ్యారు. బ్లాక్ డ్రెస్‌లో ట్రెండీ లుక్‌లో తళుక్కున మెరిసిన సమంత ఆ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ''రూసో బ్రదర్స్ విజన్‌కి వెన్నుదన్నుగా నిలిచిన అమెజాన్‌కి థ్యాంక్స్. భారతీయ వెర్షన్‌ని త్వరలో మీ ముందుకు తీసుకురావడానికి ఆసక్తిగా ఉన్నాం. 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్‌లో నటించడం సంతోషంగా ఉంది. ఆరోగ్యపరంగా కాస్త ఇబ్బందులు ఉన్నా ఈ షూటింగ్‌లో పాల్గొనడం హ్యాపీ. ఇందులో చాలా ఇంటెన్స్ యాక్షన్ సీన్స్ ఉన్నాయి. ఇప్పటికే కొంత షూటింగ్ చేశాం. త్వరగా పూర్తి చేసి ఈ సిరీస్‌ని ప్రపంచానికి చూపించేందుకు సంతోషంగా ఎదురు చూస్తున్నాను. నాతో ఓపికగా, దయతో వ్యవహరిస్తున్న యూనిట్‌కి ధన్యవాదాలు'' అని సమంత పోస్ట్ చేశారు.

ఏం చేయాలి?

శ్రీవిష్ణు హీరోగా 'వివాహ భోజనంబు' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సామజవరగమన'. రెబా మోనికా జాన్ హీరోయిన్. అనిల్ సుంకర సమర్పణలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి హాస్య మూవీస్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్న ఈ చిత్రం మే 18న విడుదల కానుంది. గోపీ సుందర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని తొలి పాట 'వాట్ టు డూ..' ని రిలీజ్ చేసి, మ్యూజికల్ జర్నీని స్టార్ట్ చేశారు మేకర్స్. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటను జెస్సీ గిఫ్ట్ పాడారు. ''పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'సామజవరగమన'. ఇప్పటికే విడుదలైన మా సినిమా ఫస్ట్ గ్లింప్స్‌కి అద్భుత స్పందన వచ్చింది. తనలోని ఫ్రస్ట్రేషన్‌ని చెబుతూ కథానాయకుడు పాడుకునే 'వాట్ టు డూ..' (ఏం చేయాలి?) పాటలో శ్రీవిష్ణు చేసిన మాస్ మూమెంట్స్ ప్రేక్షకుల్ని అలరిస్తాయి'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాత: బాలాజీ గుత్తా, కెమెరా: రాంరెడ్డి.


● శ్రీ విష్ణు

చిత్ర పరిశ్రమ సమస్యలను పరిష్కరిస్తాం

- కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాగూర్

''**చి**త్ర పరిశ్రమకు చెందిన చిన్న చిన్న సమస్యలను ఈ వేదికపై చెప్పారు. వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం. పైరసీని అరికట్టే విధంగా నూతన చట్టాన్ని తీసుకొచ్చాం. అదే విధంగా జీఎస్టీ విషయంలో ఒకే పన్ను విధానాన్ని చట్టం చేసే ప్రయత్నం చేస్తున్నాం. చిత్ర పరిశ్రమ సమస్యలను పరిష్కరిస్తాం'' అని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాగూర్ అన్నారు. సీఐఐ దక్షిణ్ సమ్మిట్ ముగింపు కార్యక్రమం గురువారం సాయంత్రం చెన్నైలోజరిగింది. సీఐఐ చైర్మన్ టీజీ త్యాగరాజన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, నటుడు ధనుష్, నటి శోభన, కమల్‌బాలి తదితరులు పాల్గొన్నారు. ఇందులో ముఖ్య అతిథిగా కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాగూర్ పాల్గొన్నారు. కాగా సీఐఐ దక్షిణ్ నిర్వాహకులు చిరంజీవికి ఐకాన్ అవార్డును, తమిళ నటుడు ధనుష్‌కు యూత్ ఐకాన్ అవార్డును ప్రకటించారు. చిరంజీవి హాజరు కాకపోవడంతో ఆయన అవార్డును సుహాసిని అందుకున్నారు. ఈ వేడుకలో పాల్గొనలేకపోయినందుకు క్షమాపణ తెలుపుతూ చిరంజీవి వీడియోను షేర్ చేశారు.


● చిరంజీవి అవార్డును అందుకుంటున్న సుహాసిని

కమల్‌కు జోడీ?

విలక్షణ నటుడు కమల్‌హాసన్‌కి జోడీగా దక్షిణాది స్టార్ హీరోయిన్స్‌లో ఒకరైన నయనతార నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. ప్రస్తుతం శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'ఇండియన్ 2' సినిమాతో బిజీగా ఉన్న కమల్‌హాసన్ ఆ తర్వాతి చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు మణిరత్నంతో చేయనున్నారు. మణిరత్నం-కమల్ కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'నాయగన్' 1987 అక్టోబర్ 21న విడుదలై, మంచి హిట్‌గా నిలిచింది. దాదాపు 36 ఏళ్ల తర్వాత వీరి కాంబినేషన్ రిపీట్ అవుతోంది. ఈ చిత్రానికి 'కేహెచ్ 234' అనే వర్కింగ్ టైటిల్ నిర్ణయించారు. ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా తొలుత త్రిష పేరు వినిపించింది. 'మన్మధన్ అంబు', 'తూంగావనం' చిత్రాల తర్వాత కమల్-త్రిష ముచ్చటగా మూడోసారి 'కేహెచ్ 234' కోసం పని చేయనున్నారంటూ తమిళ చిత్ర సీమలో వార్తలొచ్చాయి. తాజాగా నయనతార పేరు తెరపైకి వచ్చింది. కథానాయిక పాత్ర కోసం ఆమెతో చర్చలు జరుపుతున్నారట మేకర్స్. చర్చలు సఫలమైతే కమల్‌తో నయనతార నటించే తొలి చిత్రం ఇదే అవుతుంది. మరి 'కేహెచ్ 234'లో కమల్‌తో నటించే అవకాశం త్రిష, నయనతారలో ఎవర్ని వరిస్తుంది? వీరిద్దరూ కాకుండా వేరే కొత్త హీరోయిన్ తెరపైకి వస్తారా? అనే వివరాలు తెలియాలంటే వేచి చూడాలి. కాగా మణిరత్నం ప్రస్తుతం 'పొన్నియిన్ సెల్వన్ 2' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ నెల 28న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కానుంది. మరోవైపు కమల్‌హాసన్ కూడా 'ఇండియన్ 2' తో బిజీగా ఉన్నారు. ఇటీవల దక్షిణాఫ్రికా షెడ్యూల్‌ను పూర్తి చేసి, ఇండియాకి తిరిగొచ్చింది యూనిట్.


● నయనతార

హిట్ బోణీ

మంచి బోణీ కొట్టారు... ముగ్గురు దర్శకుల గురించి ఇటీవల వినిపిస్తున్న మాట ఇది. ఫస్ట్ హిట్ ఇచ్చిన ఆ ముగ్గురు దర్శకులు సెకండ్ హిట్ ఇచ్చే పని మీద కథ రెడీ చేసుకుంటున్నారు. ఈ ఏడాది (2023) ఆరంభంలో తొలి చిత్రంతోనే హిట్ బోణీ కొట్టారు దర్శకులు షణ్ముఖ ప్రశాంత్, వేణు ఎల్దండి, శ్రీకాంత్ ఓదెల. ఈ ముగ్గురి గురించి తెలుసుకుందాం.

షణ్ముఖ ప్రశాంత్

సినిమాపై ఉన్న ఇష్టంతో బీటెక్ పూర్తయిన తర్వాత హైదరాబాద్ వచ్చారు ప్రశాంత్. సొంతంగా రాసిన కథలతో షార్ట్ ఫిల్మ్స్ చేశారు. సుహాస్ నటించిన 'కలర్ ఫోటో' చిత్రంలో డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో కొద్ది రోజులు పని చేశారు. ఆ తర్వాత 'ఫ్యామిలీ డ్రామా' (సుహాస్ హీరో) చిత్రానికి రైటర్‌గా చేశారు. ఆ టైమ్‌లో 'రైటర్ పద్మభూషణ్' కథని సుహాస్‌కి చెప్పడం, ఆయనకి నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది. సుహాస్, టీనా శిల్పరాజ్ జంటగా నటించిన 'రైటర్ పద్మభూషణ్' ఫిబ్రవరి 3న విడుదలైంది. ఎప్పటికైనా పెద్ద రచయిత కావాలనుకునే పద్మభూషణ్ కథని, ఓ మధ్య తరగతి కుటుంబంలోని ప్రేమ, ఆప్యాయతలు, ఇబ్బందుల్ని చక్కగా తెరపై ఆవిష్కరించారు షణ్ముఖ. ఈ సినిమా హిట్‌తో ప్రస్తుతం రెండు మూడు పెద్ద బ్యానర్ల నుంచి అవకాశాలు అందుకున్నారు. అతి త్వరలో తన తర్వాతి ప్రాజెక్టులపై అధికారిక ప్రకటన వస్తుందని పేర్కొన్నారు షణ్ముఖ ప్రశాంత్.

వేణు ఎల్దండి

వెండితెరపై కామెడీ పాత్రలతో మెప్పించిన వేణు ఎల్దండిలో ఓ సీరియస్ డైరెక్టర్ ఉంటాడని 'బలగం' సినిమా చూసేవరకూ ఎవరూ ఊహించి ఉండరు. నిర్మాత 'దిల్' రాజు ప్రొడక్షన్ హౌస్‌లో దర్శకునిగా తొలి అవకాశం అందుకుని 'బలగం' సినిమాతో అనూహ్య విజయం అందుకున్నారు వేణు. వెండితెరపై నవ్వులు పంచిన ఆయన 'బలగం'తో ప్రేక్షకులను ఏడిపించారు. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్ రామ్ జంటగా నటించిన 'బలగం' సినిమా మార్చి 3న విడుదలైంది. ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజైన ఈ చిత్రం కేవలం మౌత్ టాక్‌తో అద్భుతమైన విజయం సాధించి, బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబట్టింది. కుటుంబ సమేతంగా ఈ చిత్రాన్ని చూసేందుకు జనాలు థియేటర్స్‌కి వచ్చారు. ఈ సినిమాలోని భావోద్వేగ సన్నివేశాలకు కంటతడి పెట్టని ప్రేక్షకులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. తొలి మూవీతో మంచి బోణీ కొట్టిన వేణు ఎల్దండి తన తర్వాతి చిత్రాన్ని కూడా 'దిల్' రాజు బ్యానర్‌లోనే చేయనుండటం విశేషం.


● షణ్ముఖ ప్రశాంత్ ● వేణు ఎల్దండి ● శ్రీకాంత్ ఓదెల

శ్రీకాంత్ ఓదెల

కథ నచ్చితే చాలు కొత్త దర్శకులకు చాన్స్ ఇవ్వడంలో హీరో నాని ఎప్పుడూ ముందుంటారు. అలా ఆయన అవకాశం ఇచ్చిన దర్శకుల్లో శ్రీకాంత్ ఓదెల ఒకరు. తొలి చిత్రం 'దసరా'తో నాని వంటి హీరోతో పని చేసే అవకాశం అందుకుని, సూపర్ హిట్ అందుకున్నారు శ్రీకాంత్ ఓదెల. సుకుమార్ దర్శకత్వం వహించిన 'జగడం' చూసి, సినిమాలపై ఆసక్తి పెంచుకున్నారు శ్రీకాంత్. ఇంజినీరింగ్ పూర్తయ్యాక సుకుమార్ వద్ద సహాయ దర్శకుడిగా చేరేందుకు నాలుగేళ్లు కష్టపడ్డారు. 'నాన్నకు ప్రేమతో', 'రంగస్థలం' సినిమాలకి సుకుమార్ వద్ద దర్శకత్వ శాఖలో పని చేశాక 'దసరా' కథ రాసుకున్నారు. అది నానీకి నచ్చడంతో ఈ మూవీ పట్టాలెక్కింది. ఎమోషనల్ డ్రామా, స్నేహం నేపథ్యంలో తెరకెక్కిన 'దసరా' మార్చి 30న విడుదలై హిట్ అందుకుంది. నాని నటించిన తొలి పాన్ ఇండియా సినిమా 'దసరా'నే కావడం విశేషం. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబట్టడంతో నిర్మాత సుధాకర్ చెరుకూరి ఖరీదైన ఓ లగ్జరీ కారుని శ్రీకాంత్ ఓదెలకి బహుమతిగా ఇవ్వడం విశేషం. తన తర్వాతి సినిమా కోసం రెండు మూడు కథలను సిద్ధం చేసుకున్నారు శ్రీకాంత్. ప్రస్తుతం ఆ ప్రాజెక్ట్స్ చర్చల దశలో ఉన్నాయి.

ఈ ఏడాది మూడు నెలలు ముగిశాయి.. 2023 ఇప్పటికి ముగ్గురు హిట్ డైరెక్టర్లను ఇచ్చింది. మరి ఈ ఏడాది ఇంకా ఎంతమంది కొత్త దర్శకులు వస్తారు? ఫస్ట్ హిట్‌తోనే టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా ఎవరు నిలుస్తారు? అనేది వేచి చూడాలి.

సాక్షి బిజినెస్
శుక్రవారం
21-4-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲ 66	59,632	
నిఫ్టీ ▲ 6	17,624	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,144	▽	12
డోజోన్స్	33,853	▽	44
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,903	▲	4
డాక్స్	15,776	▽	99
షాంఘై	3,367	▽	3
నికాయ్	28,658	▲	51

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై		
బంగారం (24 క్యారట్) 60,616	▲	695
బంగారం (22 క్యారట్) 60,373	▲	692
వెండి (కిలో) 75,419	▲	1,644

యాపిల్ ఢిల్లీ స్టోర్ ప్రారంభం

భారత్‌లో రెండోది



న్యూఢిల్లీ: అమెరికన్ టెక్ దిగ్గజం యాపిల్ తాజాగా ఢిల్లీలో తమ రిటైల్ స్టోర్‌ను గురువారం ప్రారంభించింది. భారత్‌లో యాపిల్‌కి ఇది రెండోది కాగా, ఢిల్లీలో మొదటిది. తొలి స్టోర్‌ను మంగళవారమే ముంబైలో ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఢిల్లీలోని సెలెక్ట్ సిటీవాక్ మాల్‌లో 'యాపిల్ సాకేత్' స్టోర్‌ను కంపెనీ సీఈవో టిమ్ కుక్ ప్రారంభించారు. ఇది ముంబై స్టోర్‌తో పోలిస్తే దాదాపు సగం ఉంటుంది. స్టోర్ విక్రయాల్లో నిర్దిష్ట భాగాన్ని లేదా నెలకు రూ. 40 లక్షలు (ఏది ఎక్కువైతే అది) అద్దె కింద కంపెనీ చెల్లించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సాకేత్ స్టోర్‌లో 18 రాష్ట్రాల నుంచి 70 మంది పైగా సుశిక్షితులైన సిబ్బంది ఉంటారు. వీరు 15 భాషల్లో సేవలు అందిస్తారు. భారత్‌లో తొలిసారిగా తమ స్టోర్స్‌ను ప్రారంభిస్తున్న సందర్భంగా దేశీయంగా పర్యటిస్తున్న టిమ్ కుక్ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులను కూడా కలిశారు. భారత్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన తెలిపారు.

ఇక్కడ తమ కాంట్రాక్టు తయారీ సంస్థల్లో ఉద్యోగాలను రెట్టింపు స్థాయి (2 లక్షలకు) పెంచాలని యాపిల్ భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. విడిభాగాల సరఫరా సంస్థల సంఖ్యను పెంచుకునేందుకు ప్రభుత్వపరమైన తోడ్పాటు అందించాలని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌లతో భేటీ సందర్భంగా కుక్ కోరినట్లు వివరించాయి. అలాగే, తయారీ కేంద్రాలు, బెంగళూరులో యాప్ డిజైన్, డెవలప్‌మెంట్ యాక్సిలరేటర్ తదితర అంశాలను కూడా చర్చించినట్లు పేర్కొన్నాయి.

హెచ్‌సీఎల్ టెక్ లాభం ప్లస్

- క్యూ4లో రూ. 3,983 కోట్లు
- రూ. లక్ష కోట్లను దాటిన ఆదాయం



న్యూఢిల్లీ: ఐటీ సేవల దేశీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 11 శాతం బలపడి రూ. 3,983 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021–22) క్యూ4లో రూ. 3,599 కోట్లు ఆర్జించింది. అయితే త్రైమాసికవారీగా అంటే గతేడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో సాధించిన రూ. 4,096 కోట్లతో పోలిస్తే నికర లాభం 3 శాతం తగ్గింది. కాగా.. ఈ క్యూ4లో మొత్తం ఆదాయం 18 శాతం ఎగసి రూ. 26,606 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది క్యూ4లో రూ. 22,597 కోట్ల ఆదాయం నమోదైంది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 10 శాతం మెరుగై రూ. 14,845 కోట్లను తాకింది. 2021–22లో రూ. 13,499 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. లక్ష కోట్లను దాటి రూ. 1,01,456 కోట్లకు చేరింది! అంతక్రితం ఏడాది రూ. 85,651 కోట్ల ఆదాయం అందుకుంది.

భారీ డీల్స్ అప్

క్యూ4లో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 13 భారీ డీల్స్ గెలుచుకుంది. వీటి విలువ 207.4 కోట్ల డాలర్లుకాగా.. వార్షికంగా 18 శాతం క్షీణించింది. ఈ కాలంలో కంపెనీ 3,674 మంది ఉద్యోగులను కొత్తగా నియమించుకుంది. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,25,944కు చేరింది. ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 19.5 శాతంగా నమోదైంది. డీల్ పైప్‌లైన్ దాదాపు కంపెనీ చరిత్రలోనే గరిష్టస్థాయికి చేరినట్లు కంపెనీ సీఈవో విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

గైడెన్స్ గుడ్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24)లో ఆదాయం 6–8 శాతం వృద్ధి చెందగలదని హెచ్‌సీఎల్ టెక్ తాజాగా అంచనా(గైడెన్స్) వేసింది. వాటాదారులకు షేరుకి రూ. 18 చొప్పున డివిడెండును ప్రకటించింది. వరుసగా 81వ త్రైమాసికంలోనూ డివిడెండును చెల్లిస్తున్నట్లు తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్ షేరు నామమాత్ర నష్టంతో రూ. 1,037 వద్ద ముగిసింది.

టీటీకే ప్రెస్టీజ్ ఎనీథింగ్ ఫర్ ఎనీథింగ్ ఎక్స్ఛేంజీ ఆఫర్



ముంబై: వంటగది ఉపకరణాల తయారీ సంస్థ టీటీకే ప్రెస్టీజ్ 'ఎనీథింగ్ ఫర్ ఎనీథింగ్' ఎక్స్ఛేంజ్ ఆఫర్‌ను మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రెస్టీజ్ ఉత్పత్తుల ధరపై 24–66% వరకు తగ్గింపుతో ఈ ఆకర్షణీయమైన ఎక్స్ఛేంజీ ఆఫర్‌ను పొందేందుకు కస్టమర్లు తమ పాత వంట సామాగ్రిని తీసుకొచ్చి వాటిని మార్పిడి చేసుకోవచ్చు. ఇప్పటికే ప్రారంభమైన ఈ అద్భుతమైన ఆఫర్ జూన్ 30 వరకు కొనసాగుతుంది. "మా కస్టమర్లు బ్రాండ్‌కు విధేయులు. ఈ బంపర్ ఆఫర్ ద్వారా వారితో బంధాన్ని బలోపేతం చేసుకునేందుకు ఆకర్షణీయమైన డీల్స్‌లో అత్యుత్తమ ఉత్పత్తులు అందిస్తున్నాము" అని కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ దినేష్ గార్గ్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-4-2023	
విశాఖ	375-00
చిత్తూరు	408-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	345-00
విజయవాడ	345-00
రిటైల్ ధర (డజను)	60.00
20-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	353-00
వరంగల్	355-00
రిటైల్ ధర	4.10

'అక్షయ'కు పుత్తడి మెరిసేనా?

- అమ్మకాలపై అధిక ధరల ప్రభావం
- అక్షయ విక్రయాల్లో క్షీణతకు చాన్స్



ముంబై: ఈ అక్షయకు పుత్తడి వెలుగులు విరజిమ్మేనా? ప్రస్తుత ధరలు అమ్మకాలను ప్రభావితం చేస్తాయా? అవుననే అంటున్నాయి పరిశ్రమ వర్గాలు. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే పరిమాణం పరంగా విక్రయాలు 20 శాతం తగ్గే అవకాశం ఉందని చెబుతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లో గురువారం 10 గ్రాముల పుత్తడి ధర 24 క్యారెట్లు రూ.60,930, అలాగే 22 క్యారెట్లు అయితే రూ.55,850 పలికింది. 'ఇటీవల 10 గ్రాములకు రూ.60 వేలు దాటడంతో వినియోగదార్లు పుత్తడి కొనుగోలు చేయకుండా జాగ్రత్త పడుతున్నారు. ఆ తర్వాత ధర స్వల్పంగా తగ్గినప్పటికీ.. ధరలు మాత్రం బుల్లిష్‌గానే ఉన్నాయి. విలువైన లోహాలను కొనుగోలు చేయడం శుభప్రదంగా భావించే అక్షయ తృతీయ సమయంలో ఇది అమ్మకాలపై ప్రభావం చూపుతుంది' అని ఆల్ ఇండియా జెమ్, జ్యువెల్లరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) చైర్మన్ సైయమ్ మెహ్రా తెలిపారు. ఈ ఏడాది అక్షయ తృతీయ ఏప్రిల్ 22న వస్తోంది.

దక్షిణాది వాటాయే అధికం..

అక్షయ విక్రయాల్లో దక్షిణాది రాష్ట్రాల వాటా ఏకంగా 40 శాతం ఉంది. పశ్చిమ భారత్ 25 శాతం, తూర్పు 20, ఉత్తరాది రాష్ట్రాలు 15 శాతం వాటా కైవసం చేసుకున్నాయి. ధరలు అధికంగా ఉండడం డిమాండ్‌పై ప్రభావం చూపనుందని జీజేసీ మాజీ చైర్మన్, ఎస్‌పీసీ జ్యువెల్లర్స్ ఎండీ అనంత పద్మనాభన్ తెలిపారు. ధరలు పెరిగిన ప్రభావం ఇప్పటికే కనపడుతోంది. 2022తో పోలిస్తే విలువ పరంగా అక్షయ అమ్మకాల్లో ఈ ఏడాది 10 శాతం తగ్గుదల నమోదు కావొచ్చని చెప్పారు. పరిమాణం పరంగా 20 శాతం క్షీణతకు చాన్స్ ఉందన్నారు. అకస్మాత్తుగా పుత్తడి ధర తగ్గితే అమ్మకాలకు బూస్టనిస్తుందని వివరించారు.

స్థిరంగా పసిడి ధర..

ప్రస్తుతం కొనసాగుతున్న బంగారం ధరలు బుల్లిష్‌గా ఉన్నప్పటికీ.. కొంతకాలం స్థిరంగా ఉండే అవకాశం ఉందని కామ్‌ట్రెండ్జ్ రిస్క్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ సీఈవో జ్ఞానశేఖర్ త్యాగరాజన్ తెలిపారు. 'ప్రస్తుతం యూఎస్ ఆర్థిక పరిస్థితుల మాదిరిగా పసిడి ధరలను అస్థిరంగా మార్చడానికి కారణాలేవీ లేవు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, చమురు ధరల వంటి ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులు కూడా ఇటీవల పుత్తడి ధరలను ప్రభావితం చేయలేదు. భారత్‌లోని వినియోగదార్లకు బంగారం ధరల పెరుగుదలకు అలవాటుపడటానికి ఎల్లప్పుడూ సమయం పడుతుంది. కాబట్టి ఈ సవత్సరం అక్షయ తృతీయ సమయంలో డిమాండ్ తక్కువగా ఉండే అవకాశం ఉంది' అని వివరించారు.

విడదీయలేని బంధం..

లక్షలాది మంది భారతీయులకు అక్షయ తృతీయ వేడుకల్లో బంగారం కొనుగోళ్లు విడదీయరాని భాగం అని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ భారత్ సీఈవో సోమసుందరం పీఆర్ వివరించారు. 'పుత్తడిని సంపద చిహ్నంగా భావిస్తారు. అక్షయకు కాలానుగుణ కొనుగోలు ప్రారంభాన్ని సూచిస్తుంది. ప్రధాన బంగారం కొనుగోలు పండుగ అయినప్పటికీ.. ఈ సంవత్సరం అక్షయ తృతీయ పసిడి జీవితకాల అధిక ధరలను ఎదుర్కొంటోంది. గత కొన్ని వారాలుగా వినియోగదారుల నుండి మోస్తరు స్పందన ఉంది' అని తెలిపారు. మహమ్మారి కారణంగా రెండేళ్ల మందకొడి పనితీరు తర్వాత బంగారు పరిశ్రమకు తిరిగి మెరుపు వచ్చిందని కామా జ్యువెల్లరీ ఎండీ కోలిన్ షా అన్నారు. 'కొంతకాలంగా పసిడి ధరలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఈ సంవత్సరంలో పెరుగుతున్న ధరలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో వినియోగదారులు తమ కొనుగోళ్లతో మరింత జాగ్రత్తగా ఉండాలని భావిస్తున్నారు. అయితే పెట్టుబడిదారుల వర్గం రాబోయే కాలంలో పుత్తడి ధరలు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు' అని చెప్పారు.

ఆఖరి గంటలో కొనుగోళ్లు

- రాణించిన ఇంధన, టెలికం షేర్లు
- సెన్సెక్స్ లాభం 66 పాయింట్లు



ముంబై: ట్రేడింగ్ చివర్లో ఇంధన, టెలికాం, వినిమయ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు గురువారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ట్రేడింగ్ ప్రారంభం తర్వాత కొద్దిసేపు ఒడిదుడుకులను ఎదుర్కొన్న సూచీలు మిడ్ సెషన్ తర్వాత సానుకూలంగా కదిలాయి. అమ్మకాల ఒత్తిడితో చివరి గంట వరకు ఊగిసలాట ధోరణి ప్రదర్శించి పరిమిత లాభాలతో ట్రేడింగ్‌ను ముగించాయి. ఉదయం సెన్సెక్స్ 19 పాయింట్ల స్వల్ప లాభంతో 59,587 వద్ద, నిఫ్టీ 20 పాయింట్లు బలపడి 17,653 వద్ద మొదలయ్యాయి. రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 347 పాయింట్ల పరిధిలో 59,490 వద్ద కనిష్టాన్ని, 59,837 గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 66 పాయింట్లు లాభపడి 59,632 వద్ద నిలిచింది. నిఫ్టీ 17,584 – 17,684 శ్రేణిలో ట్రేడైంది. ఆఖరికి ఆరు పాయింట్లు స్వల్ప లాభంతో 17,624 వద్ద నిలిచింది. రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ, మెటల్, కమోడిటీ, ఐటీ, షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 11 పైసలు బలపడి 82.14 వద్ద స్థిరపడింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,169 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.833 కోట్ల షేర్లను అమ్మేశారు. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- మ్యూచువల్ ఫండ్ నిర్వహణకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి సూత్రప్రాయ ఆమోదం లభించడంతో బ్రోకరేజ్ దిగ్గజం ఎంకే గ్లోబల్ ఫైనాన్స్ సర్వీసెస్ షేరు 20 శాతం అప్పర్ సర్క్యూట్‌తో రూ.80 వద్ద లాకయ్యింది.
- క్యూ4 ఫలితాలు మెప్పించకపోవడంతో ఐసీఐసీఐ సెక్యూరిటీస్ 5% పడి రూ. 439 వద్ద స్థిరపడింది.

సైయంట్ లాభం 14 శాతం జంప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మార్చి త్రైమాసికంలో సైయంట్ నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 14 శాతం ఎగసి రూ.176 కోట్లు సాధించింది. ఎబిటా రూ.249 కోట్లు, ఎబిటా మార్జిన్ 14.2 శాతం నమోదైంది. గ్రూప్ ఆదాయం 48 శాతం అధికమై రూ.1,751 కోట్లకు చేరుకుంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో నికరలాభం 8.2 శాతం పెరిగి రూ.565 కోట్లు దక్కించుకుంది. గ్రూప్ టర్నోవర్ 32.7 శాతం దూసుకెళ్లి రూ.6,016 కోట్లను తాకింది. మొత్తం డివిడెండ్ ఇప్పటి వరకు అత్యధికంగా ఒక్కో షేరుకు రూ.26కు చేరడం విశేషం.



సెమీస్‌లో సాకేత్ జోడీ

జీఎండబ్ల్యూ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని–యూకీ బాంబ్రీ (భారత్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. మ్యూనిక్‌లో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సాకేత్, యూకీ తొలి సెట్‌లో 5–2తో ఆధిక్యంలో నిలిచింది. ఈ దశలో ప్రత్యర్థి జంట డస్టిన్ బ్రౌన్ (జమైకా)–పావ్లాసెక్ (చెక్ రిపబ్లిక్) గాయం కారణంగా వైదొలిగింది. దాంతో సాకేత్–యూకీ జోడీని విజేతగా ప్రకటించారు.

కేఎల్ రాహుల్‌పై రూ. 12 లక్షల జరిమానా



స్లో ఓవర్ రేట్ కారణంగా లక్నో సూపర్ జెయింట్స్ జట్టు కెప్టెన్ కేఎల్ రాహుల్‌పై ఐపీఎల్ నిర్వాహకులు రూ. 12 లక్షలు జరిమానా విధించారు. జైపూర్‌లో బుధవారం రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో పది పరుగుల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో లక్నో బౌలర్లు నిర్ణీత సమయంలో పూర్తి ఓవర్ల కోటా పూర్తి చేయలేకపోయారు.

ఫైనల్లో భారత్


ప్రపంచకప్ స్టేజ్–1 ఆర్చరీ టోర్నీ



తరుణ్‌దీప్ రాయ్, అతాను దాస్, ధీరజ్

అంటాల్యా (తుర్కియే): తొమ్మిదేళ్ల విరామం తర్వాత భారత పురుషుల రికర్వ్ జట్టు ప్రపంచకప్ టోర్నీలో తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. వరల్డ్ కప్ స్టేజ్–1 ఆర్చరీ టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొమ్మదేవర ధీరజ్, ఒలింపియన్స్ అతాను దాస్, తరుణ్‌దీప్ రాయ్‌లతో కూడిన భారత జట్టు స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించింది. గురువారం జరిగిన టీమ్ ఎలిమినేషన్ మ్యాచ్‌ల్లో భారత జట్టు విశేషంగా రాణించింది. తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా రెండో రౌండ్ ఆడిన భారత్ 5–4తో జపాన్‌పై గెలిచింది. అనంతరం క్వార్టర్ ఫైనల్లో 6–2తో చైనీస్ తైపీపై, సెమీఫైనల్లో 6–2తో నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. ఆదివారం జరిగే ఫైనల్లో చైనాతో భారత్ తలపడుతుంది. చివరిసారి భారత్ 2014లో రెండు ప్రపంచకప్ టోర్నీలలో ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచింది. 2010లో షాంఘైలో ఆఖరిసారి భారత జట్టు వరల్డ్‌కప్‌లో స్వర్ణ పతకం సాధించింది.

సెమీస్‌లో జ్యోతి సురేఖ



మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. టాప్ సీడ్ హోదాలో బరిలోకి దిగిన జ్యోతి సురేఖ తొలి రౌండ్‌లో 145– 137తో మిరియం హస్లెర్ (స్విట్జర్లాండ్)పై, రెండో రౌండ్‌లో 145–141తో డానిలి లుట్జ్ (అమెరికా)పై, మూడో రౌండ్‌లో 145–138తో సోఫియా (మెక్సికో)పై, క్వార్టర్ ఫైనల్లో 147–142తో టాంజా జెలెనథీన్ (డెన్మార్క్)పై గెలిచింది. భారత్‌కే చెందిన అవ్‌నీత్ కౌర్ మూడో రౌండ్‌లో 'షూట్ ఆఫ్'లో 9–10తో సారా లోపెజ్ (కొలంబియా) చేతిలో... సాక్షి రెండో రౌండ్‌లో 137–142తో ఆండ్రియా మునోజ్ (స్పెయిన్) చేతిలో... అదితి 146–147తో ఎలీసా రోనెర్ (ఇటలీ) చేతిలో ఓడిపోయారు.

సిరాజ్ సూపర్ షో...

సిరాజ్ గెలిపించిన మ్యాచ్ ఇది! నిప్పులు చెరిగే బౌలింగ్, కళ్లు చెదిరే ఫీల్డింగ్‌తో పంజాబ్ కింగ్స్‌పై స్పీడ్‌స్టర్ పంజా విసిరాడు. పంజాబ్ కుదురుకోకుండా దెబ్బ మీద దెబ్బ వేయడంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు ఈ సీజన్‌లో మూడో విజయాన్ని సాధించింది.

- 4 వికెట్లతో హడలెత్తించిన ఆర్‌సీబీ పేసర్
- మెరిసిన డుప్లెసిస్, కోహ్లి
- 24 పరుగులతో బెంగళూరు గెలుపు
- పంజాబ్‌కు ఆల్‌రౌండ్ దెబ్బ



సిరాజ్

మొహాలీ: మెరుపులతో డుప్లెసిస్, కోహ్లి బెంగళూరును నడిపిస్తే... బౌలింగ్‌తో గెలిపించిన ఘనత మాత్రం సిరాజ్‌దే! దీంతో ఐపీఎల్‌లో గురువారం జరిగిన పోరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు 24 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై విజయం సాధించింది. మొదట బెంగళూరు 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. 'ఇంపాక్ట్ ప్లేయర్'గా దిగిన రెగ్యులర్ కెప్టెన్ డుప్లెసిస్ (56 బంతుల్లో 84; 5 ఫోర్లు, 5 సిక్సర్లు), ఈ మ్యాచ్‌లో సారథ్యం వహించిన విరాట్ కోహ్లి (47 బంతుల్లో 59; 5 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగారు. హర్‌ప్రీత్ బ్రార్‌కు 2 వికెట్లు దక్కాయి. తర్వాత పంజాబ్ 18.2 ఓవర్లలో 150 పరుగులకే కుప్పకూలింది. ప్రభ్‌సిమ్రన్ (30 బంతుల్లో 46; 3 ఫోర్లు, 4 సిక్సర్లు), జితేశ్ శర్మ (27 బంతుల్లో 41; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' సిరాజ్ (4/21) కీలకమైన వికెట్లు తీశాడు.

డుప్లెసిస్ ధనాధన్ 'ఇంపాక్ట్'



కోహ్లి, డుప్లెసిస్‌ల ఓపెనింగ్ మైదానంలోని ప్రేక్షకుల్ని మెరుపులతో మురిపించింది. దూసుకొచ్చే బంతిని కాచుకొని, గతి తప్పిన బంతిని బౌండరీలవైపు శిక్షిస్తూ బెంగళూరు ఇన్నింగ్స్‌ను ఏకంగా 16 ఓవర్ల పాటు నడిపించారు. 137 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యాన్ని జోడించారు. ఈ క్రమంలో ముందుగా డుప్లెసిస్ 31 బంతుల్లో, తర్వాత కోహ్లి 40 బంతుల్లో ఫిఫ్టీలను పూర్తి చేసుకున్నారు. వీరిద్దరి పరుగుల పంజా 'కింగ్స్'ను ఉక్కిరిబిక్కిరి చేయగా, స్వల్ప వ్యవధిలో వీళ్లిద్దరితో పాటు హిట్టర్ మ్యాక్స్‌వెల్ (0) అవుటవడంతో 200 మార్క్‌ను దాటకుండా పంజాబ్ అడ్డుకుంది. అనంతరం కష్టపడితే ఛేదించే లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్‌ను సిరాజ్ తన తొలి ఓవర్ నుంచే కష్టాలపాలు చేశాడు. అథర్వ (4)ను ఎల్బీగా అవుట్ చేశాడు. సిక్స్, ఫోర్ కొట్టి జోరు మీదున్న హర్‌ప్రీత్ సింగ్ (13)ను డైరెక్ట్ హిట్‌తో రనౌట్ చేశాడు. ప్రభ్‌సిమ్రన్ రాణింపు తర్వాత జితేశ్ శర్మ మెరుపులతో లక్ష్యం దిశగా సాగుతుంటే మళ్లీ సిరాజ్ నిప్పులు చెరిగాడు. హర్‌ప్రీత్ బ్రార్ (13), ఎలిస్ (1)లను క్లీన్‌బౌల్డ్ చేసి పరాజయాన్ని ఖాయం చేశాడు.



స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) జితేశ్ శర్మ (బి) హర్‌ప్రీత్ 59; డుప్లెసిస్ (సి) స్యామ్ కరన్ (బి) ఎలిస్ 84; మ్యాక్స్‌వెల్ (సి) అథర్వ (బి) హర్‌ప్రీత్ 0; దినేశ్ కార్తీక్ (సి) అథర్వ (బి) అర్ష్‌దీప్ 7; మహిపాల్ (నాటౌట్) 7; షహబాజ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 174. వికెట్ల పతనం:** 1–137, 2–137, 3–151, 4–163. **బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 4–0–34–1, హర్‌ప్రీత్ 3–0–31–2, ఎలిస్ 4–0–41–1, స్యామ్ కరన్ 4–0–27–0, రాహుల్ చహర్ 4–0–24–0, లివింగ్‌స్టోన్ 1–0–9–0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: అథర్వ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 4; ప్రభ్‌సిమ్రన్ (బి) పార్నెల్ 46; షార్ట్ (బి) హసరంగ 8; లివింగ్‌స్టోన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 2; హర్‌ప్రీత్ సింగ్ (రనౌట్) 13; స్యామ్ కరన్ (రనౌట్) 10; జితేశ్ శర్మ (సి) షహబాజ్ (బి) హర్షల్ పటేల్ 41; షారుఖ్ (స్టంప్డ్) దినేశ్ కార్తీక్ (బి) హసరంగ 7; హర్‌ప్రీత్ బ్రార్ (బి) సిరాజ్ 13; ఎలిస్ (బి) సిరాజ్ 0; అర్ష్‌దీప్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (18.2 ఓవర్లలో ఆలౌట్) 150. వికెట్ల పతనం:** 1–4, 2–20, 3–27, 4–43, 5–76, 6–97, 7–106, 8–147, 9–149, 10–150. **బౌలింగ్:** సిరాజ్ 4–0–21–4, పార్నెల్ 3–0–32–1, హసరంగ 4–0–39–2, వైశాక్ 3–0–29–0, మ్యాక్స్‌వెల్ 1–0–5–0, హర్షల్ పటేల్ 3.2–0–22–1.

ఢిల్లీకి తొలి విజయం

రాణించిన వార్నర్, అక్షర్



న్యూఢిల్లీ: ఈ ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ ఐదు మ్యాచ్‌లాడినా... అందని విజయం ఆరో మ్యాచ్‌లో అతికష్టమ్మీద దక్కింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 4 వికెట్ల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై గెలిచింది. తొలుత కోల్‌కతా 20 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ జేసన్ రాయ్ (39 బంతుల్లో 43; 5 ఫోర్లు, 1 సిక్స్), రసెల్ (31 బంతుల్లో 38 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్సర్లు) నైట్‌రైడర్స్ పరువునిలిపే స్కోరు చేశారు. అక్షర్ పటేల్ (2/13), కుల్దీప్ యాదవ్ (2/15), ఇషాంత్ శర్మ (2/19), నోర్జే (2/20) సమష్టిగా కూల్చారు. అనంతరం సులువైన లక్ష్యాన్ని ఛేదించేందుకు ఢిల్లీ ఆఖరి దాకా తెగ కష్టపడింది. చివరకు 19.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ డేవిడ్ వార్నర్ (41 బంతుల్లో 57; 11 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించాడు. అక్షర్ పటేల్ (22 బంతుల్లో 19 నాటౌట్; 1 ఫోర్) కీలక పరుగులు చేశాడు. వరుణ్ చక్రవర్తి, అనుకూల్ రాయ్ చెరో 2 వికెట్లు తీశారు.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: రాయ్ (సి) అమన్ హకీమ్ (బి) కుల్దీప్ 43; లిటన్‌దాస్ (సి) లలిత్ (బి) ముకేశ్ 4; వెంకటేశ్ అయ్యర్ (సి) మార్ష్ (బి) నోర్జే 0; నితీశ్ రాణా (సి) ముకేశ్ (బి) ఇషాంత్ 4; మన్‌దీప్ (బి) అక్షర్ 12; రింకూ సింగ్ (సి) లలిత్ (బి) అక్షర్ 6; నరైన్ (సి) వార్నర్ (బి) ఇషాంత్ 4; రసెల్ (నాటౌట్) 38; అనుకూల్ రాయ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 0; ఉమేశ్ (సి అండ్ బి) నోర్జే 3; వరుణ్ చక్రవర్తి (రనౌట్) 1; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 127. వికెట్ల పతనం:** 1–15, 2–25, 3–32, 4–50, 5–64, 6–70, 7–93, 8–93, 9–96, 10–127. **బౌలింగ్:** ఇషాంత్ శర్మ 4–0–19–2, ముకేశ్ 4–0–34–1, నోర్జే 4–0–20–2, అక్షర్ 3–0–13–2, మిచెల్ మార్ష్ 2–0–25–0, కుల్దీప్ 3–0–15–2.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వరుణ్ 57; పృథ్వీషా (బి) వరుణ్ 13; మార్ష్ (సి) సబ్-వీస్ (బి) నితీశ్ రాణా 2; సాల్ట్ (సి అండ్ బి) అనుకూల్ 5; మనీశ్ పాండే (సి) రింకూ (బి) అనుకూల్ 21; అక్షర్ పటేల్ (నాటౌట్) 19; అమన్ హకీమ్ (బి) రాణా 0; లలిత్ యాదవ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.2 ఓవర్లలో 6 వికెట్లకు) 128. వికెట్ల పతనం:** 1–38, 2–62, 3–67, 4–93, 5–110, 6–111. **బౌలింగ్:** ఉమేశ్ యాదవ్ 1–0–6–0, కుల్వంత్ 1.2–0–20–0, రసెల్ 1–0–12–0, నరైన్ 4–0–36–0, వరుణ్ 4–1–16–2, అనుకూల్ 4–0–19–2, నితీశ్ రాణా 4–0–17–2.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	1.043
లక్నో	6	4	2	8	0.709
చెన్నై	5	3	2	6	0.265
గుజరాత్	5	3	2	6	0.192
బెంగళూరు	6	3	3	6	-0.068
ముంబై	5	3	2	6	-0.164
పంజాబ్	6	3	3	6	-0.298
కోల్‌కతా	6	2	4	4	0.214
హైదరాబాద్	5	2	3	4	-0.798
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

చెన్నై x హైదరాబాద్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

మాడ్రిడ్ ఓపెన్ టోర్నీకీ నాదల్ దూరం



బార్సిలోనా: స్పెయిన్ టెన్నిస్ స్టార్ రాఫెల్ నాదల్ తుంటి గాయం నుంచి ఇంకా కోలుకోలేదు. దాంతో అతను ఈ సీజన్‌లో మరో టోర్నీకి దూరమయ్యాడు. ఇప్పటికే ఇండియన్ వెల్స్, మయామి, మోంటెకార్లో మాస్టర్స్ సిరీస్ టోర్నీలతోపాటు బార్సిలోనా ఓపెన్‌లో నాదల్ ఆడలేదు. వచ్చే సోమవారం మొదలయ్యే మాడ్రిడ్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ నుంచి కూడా నాదల్ వైదొలిగాడు. ఈ టోర్నీలో నాదల్ ఐదుసార్లు విజేతగా నిలిచాడు. జనవరిలో ఆస్ట్రేలియా ఓపెన్ తర్వాత నాదల్ మరే టోర్నీలోనూ బరిలోకి దిగలేదు. మే 28న మొదలయ్యే ఫ్రెంచ్ ఓపెన్‌గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆడేది లేనిది ఇప్పుడే చెప్పలేనని 22 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించిన నాదల్ వ్యాఖ్యానించాడు.

క్లుప్తంగా...

ఐసీయూలోకి తోపుడు బండ్లు

- అత్యవసర సేవల విభాగంలో టీడీపీ జెండాలతో హడావుడి
- చంద్రబాబు పుట్టిన రోజు నాడు చింతమనేని వింత ప్రవర్తన


ఏలూరు ఆస్పత్రిలోకి వందలాది మందితో వెళ్లి రోగులకు తీవ్ర అసౌకర్యం కలిగించిన చింతమనేని

ఏలూరు టౌన్: తన విపరీత ధోరణితో నిత్యం వార్తల్లో నిలిచేందుకు ప్రయత్నించే ఏలూరు జిల్లా దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మరోసారి తన పైత్యాన్ని ప్రదర్శించారు. ఏలూరు ప్రభుత్వాస్పత్రి ఎమర్జెన్సీ వార్డులో వందలాది మందితో లోనికి వెళ్లి వైద్య సేవలకు తీవ్ర అసౌకర్యం కలిగించారు. ఐసీయూలోకి ఏకంగా తోపుడు బండ్లపై మామిడి పండ్లను తీసుకెళ్లి రోగులకు పంచే కార్యక్రమం చేపట్టడంతో సిబ్బంది, రోగుల బంధువులు ముక్కున వేలేసుకున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని చింతమనేని తనదైన శైలిలో రెచ్చిపోయారు. బ్యాక్టీరియా, వైరస్‌లు రాకుండా ప్రత్యేక జాగ్రత్తలు పాటించే ఐసీయూలోకి తోపుడు బండ్లు తీసుకుని వెళ్లడంపై వైద్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సేవా కార్యక్రమాల పేరుతో పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు వేసుకుని మరీ ఆస్పత్రిలో హడావుడి చేయడంపై వైద్యులు, రోగుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెట్ల నరికివేతపై నిషేధం విధించండి

- హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా చెట్ల నరికివేతపై నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. చెట్ల నరికివేత విషయంలో అటవీ పరిరక్షణ, వాల్టా చట్టాలను కఠినంగా అమలు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ సామాజిక కార్యకర్త అయ్యల సోమయాజుల రామగణపతిశాస్త్రి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఇందులో కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి, పలు జిల్లాల కలెక్టర్‌లను ప్రతివాదులుగా పేర్కొన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో విచక్షణారహితంగా చెట్లను నరికేస్తూ టింబర్ డిపోలకు తరలిస్తున్నారని పిటిషనర్ తన వ్యాజ్యంలో వివరించారు. టింబర్ డిపోలపై దాడులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోర్టును కోరారు. ఈ వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వచ్చే వారం విచారణ జరపనుంది.

ప్రజా సంక్షేమం కోసమే మహాయజ్ఞం

- దీనిపై తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరికాదు
- శ్రీనివాసానంద సరస్వతికి ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ హితవు

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసమే విజయవాడలో మహాయజ్ఞం నిర్వహించేందుకు సంకల్పించామని, ఈ విషయాన్ని ఆనంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి తెలుసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ కోసమే మహాయజ్ఞమంటూ తప్పుడు వ్యాఖ్యలు చేయడం శ్రీనివాసానంద సరస్వతికి సబబు కాదన్నారు. ఇంద్రకీలాద్రిపై యజ్ఞం చేయిస్తున్నట్టు తాను చెప్పలేదన్నారు. ఈ విషయాన్ని ఆయన అవగాహన చేసుకుని మాట్లాడాలని సూచించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలు, ఐశ్వర్యాభివృద్ధితో జీవించేందుకే యజ్ఞం చేయిస్తున్నామని చెప్పారు. దీనిని విజయవంతంగా పూర్తి చేసేందుకు దేవదాయ శాఖ చర్యలు చేపట్టిందన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని వసతులూ కల్పిస్తున్నామన్నారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు పదేళ్ల జైలుశిక్ష

- మహిళను మోసగించిన కేసులో..

ఒంగోలు టౌన్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతిని మోసం చేసిన కేసులో ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి గురువారం తీర్పు ఇచ్చారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం రాచవారిపాలెం గ్రామానికి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ మేకల శ్రీనివాసరావు పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి మోసం చేసినట్లు 2016 ఏప్రిల్‌లో సింగరాయకొండ పోలీసుస్టేషన్‌లో ఓ యువతి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న అప్పటి సీఐ ఎం.భీమానాయక్ సమగ్ర దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ మేరకు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో ఒంగోలు రెండో అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి జడ్జి ఎంఏ సోమశేఖర్ నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

జేఈఈ మెయిన్ ప్రిలిమినరీ ఆన్సర్ కీ విడుదల

నేటి సాయంత్రం వరకు అభ్యంతరాల స్వీకరణ


ఈ నెలాఖరున ఫైనల్ కీ, తుది ఫలితాలు

ఏప్రిల్ 30 నుంచి మే 7 వరకు జేఈఈ అడ్వాన్స్‌డ్ రిజిస్ట్రేషన్

మెయిన్ నుంచి 2.5 లక్షల మందికి అవకాశం

జూన్ 4న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష

జూన్ 18న ఫలితాలు.. జూన్ 19 నుంచి ఐఐటీలు, ఎన్ఐటీల్లో సీట్ల కేటాయింపు



సాక్షి, అమరావతి: జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్- 2023 సెకండ్ సెషన్ పరీక్షల ప్రిలిమినరీ ఆన్సర్ కీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) బుధవారం రాత్రి విడుదల చేసింది. ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకు ఈ పరీక్షలు కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. పేపర్-1 బీఈ, బీటెక్, పేపర్-2ఏ బీ.ఆర్కిటెక్చర్, పేపర్-2బీ బీ.ప్లానింగ్ ప్రాథమిక ఆన్సర్ కీలను ప్రశ్నలతో, రికార్డెడ్ రెస్పాన్స్‌లతో విడుదల చేసినట్లు ఎన్‌టీఏ పేర్కొంది. వీటిని https://jeemain.nta.nic.in లో పొందుపరిచినట్లు తెలిపింది. అభ్యర్థులు వీటిపై అభ్యంతరాలు ఉంటే శుక్రవారం సాయంత్రం వరకు ఛాలెంజ్ చేయవచ్చని సూచించింది. ప్రతి ప్రశ్నకు రూ.200 చొప్పున రుసుము చెల్లించి అభ్యంతరాలు నమోదు చేయవచ్చు. ఈ రుసుము తిరిగి రాదు. ఈ ప్రశ్నలకు రుసుమును డెబిట్, క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించవచ్చు. అభ్యంతరాలను ఎన్‌టీఏ నిపుణుల కమిటీ పరిశీలిస్తుంది. అభ్యంతరం కరెక్టు అయితే ఆ మేరకు కీలో మార్పులు చేస్తారు. అభ్యంతరాలపై నిర్ణయాలను వ్యక్తిగతంగా అభ్యర్థులకు తెలియచేయరు. నిపుణుల కమిటీ నిర్ణయమే ఫైనల్ అవుతుంది. అభ్యర్థులు అదనపు సమాచారం కోసం 011-40759000ను లేదా jeemain@nta.ac.in ద్వారా తెలుసుకోవచ్చు. అభ్యంతరాలకు సంబంధించి అభ్యర్థులు తగిన డాక్యుమెంట్లను ఎన్‌టీఏ వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయాలి. అభ్యంతరాల పరిశీలన అనంతరం తుదికీని, ర్యాంకులతో ఫలితాలను ఈ నెలాఖరునాటికి ప్రకటిస్తారు.

అడ్వాన్స్‌డ్ షెడ్యూలు..

- ఏప్రిల్ 30 నుంచి మే 7వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు
- రిజిస్ట్రేషన్ల ఫీజు మే 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు చెల్లించాలి
- మే 29 నుంచి అడ్మిట్ కార్డుల విడుదల
- దివ్యాంగులకు స్క్రయిబ్ ఎంపికకు జూన్ 3న అవకాశం
- జూన్ 4న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష. పేపర్-1 ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, పేపర్-2 పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరుగుతుంది.
- జూన్ 9 నుంచి అభ్యర్థులవారీగా రెస్పాన్స్ షీట్లను అందుబాటులో ఉంచుతారు
- జూన్ 11న ప్రిలిమినరీ కీ విడుదల
- జూన్ 12 వరకు అభ్యంతరాల స్వీకరణ
- జూన్ 18న ఫైనల్ కీ, తుది ఫలితాల ప్రకటన
- ఆర్కిటెక్టు సబ్జెక్టుకు సంబంధించిన ఆర్కిటెక్టు ఆప్టిట్యూడ్ టెస్టుకు (ఏఏటీ) జూన్ 19 వరకు రిజిస్ట్రేషన్
- జూన్ 21న ఏఏటీ పరీక్ష, జూన్ 24న ఫలితాలు
- ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశానికి జాయింట్ సీట్ అలకేషన్ ప్రక్రియ జూన్ 19 నుంచి ప్రారంభం

ఏప్రిల్ 30 నుంచి అడ్వాన్స్‌డ్ రిజిస్ట్రేషన్లు

ఏప్రిల్ 30వ తేదీ నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్-2023 రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు అడ్వాన్స్‌డ్ నిర్వహణ సంస్థ ఐఐటీ గౌహతి ఇప్పటికే షెడ్యూల్‌ను ప్రకటించింది. జేఈఈలో అర్హత సాధించిన వారిలో 2.5 లక్షల మందికి అడ్వాన్స్‌డ్ రాయడానికి అవకాశం కల్పిస్తారు. కటాఫ్ మార్కులను నిర్ణయించి అనంతరం అడ్వాన్సుడ్ రిజిస్ట్రేషన్లకు అనుమతిస్తారు.

ఎర్ర గంగిరెడ్డిదే కీలక పాత్ర

- వైఎస్ వివేకా హత్యకు అతనే సూత్రదారి
- గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలి
- తెలంగాణ హైకోర్టులో సీబీఐ వాదనలు
- హత్యతో గంగిరెడ్డికి సంబంధం లేదన్న సీనియర్ న్యాయవాది
- బెయిల్ రద్దు చేయాల్సిన అవసరం లేదని స్పష్టీకరణ.. విచారణ 25కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు కుట్ర పన్నింది ఎర్ర గంగిరెడ్డేనని, దాన్ని అమలు చేయడంలోనూ అతనిది కీలక పాత్ర అని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) తెలంగాణ హైకోర్టులో వాదనలు వినిపించింది. సాక్ష్యాలు తారుమారు చేయడంలోనూ అతను కీలకంగా వ్యవహరించాడని పేర్కొంది. వివేకా హత్య కేసులో ప్రధాన నిందితుడు (ఏ-1) ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ చిల్లకూర్ సుమలత గురువారం విచారణ జరిపారు. సీబీఐ తరఫున పీపీ నాగేంద్రన్ వాదనలు వినిపిస్తూ.. 'గంగిరెడ్డి బయట ఉంటే సాక్షులను ప్రభావితం చేస్తారు. వివేకా వద్ద డ్రైవర్‌గా పనిచేస్తానని, హత్య చేయలేనని చెప్పినా గంగిరెడ్డి రూ.40 కోట్లు ఇస్తానని ఆశ చూపాడని దస్తగిరి (ఏ-2) వాంగ్మూలంలో వెల్లడించాడు. పథకం ప్రకారం ముందుగా వివేకా ఇంటికి వెళ్లిన గంగిరెడ్డి.. ఆ తర్వాత ముగ్గురు నిందితులు లోపలికి వచ్చేందుకు సహకరించాడు. గంగిరెడ్డి ఆదేశాలతోనే హత్యను వేరేవాళ్లపై నెట్టేలా చావుబతుకుల్లో ఉన్న వివేకా లేఖ రాశారు. అతని విచారణ తప్పనిసరి. వివేకా హత్య జరిగిన రోజు వాచ్‌మెన్ రంగన్న ఇతర నిందితులతో పాటు గంగిరెడ్డిని కూడా గుర్తించాడు. హత్య తర్వాత గంగిరెడ్డి, శివశంకర్‌రెడ్డి సాక్ష్యాలను చెరిపివేశారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలి' అని వాదించారు. డీఫాల్ట్ బెయిల్‌ను మెరిట్ ఆధారంగా పరిశీలించి రద్దు చేయవచ్చని వివేకా కుమార్తె సునీతారెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదనలు వినిపించారు. గంగిరెడ్డి డీఫాల్ట్ బెయిల్‌ను రద్దు చేయించాలని సీబీఐ పలుమార్లు ప్రయత్నించి విఫలమైందని గంగిరెడ్డి తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది శేషాద్రి నాయుడు వెల్లడించారు. సీబీఐ దాఖలు చేసిన బెయిల్ రద్దు పిటిషన్లను కడప కోర్టు, ఏపీ హైకోర్టు కొట్టివేశాయని చెప్పారు. బెయిల్ రద్దు చేయాలని సుప్రీంకోర్టు కూడా చెప్పలేదన్నారు. ఈ హత్యతో గంగిరెడ్డికి సంబంధం లేదని, బెయిల్‌ను రద్దు చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణను ఈనెల 25కి వాయిదా వేశారు.

అన్ని ప్రశ్నలకు అవినాశ్‌రెడ్డి సమాధానాలు

- రెండో రోజు సీబీఐ విచారణకు హాజరైన ఎంపీ
- నేడు మరోమారు విచారణ

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఎంపీ అవినాశ్‌రెడ్డిని గురువారమూ విచారించారు. అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు ఎంపీ అవినాశ్‌రెడ్డి సమాధానాలు ఇచ్చినట్టు సమాచారం. హైకోర్టు ఆదేశాల మేరకు వరుసగా రెండో రోజు సీబీఐ అధికారుల దర్యాప్తునకు ఎంపీ అవినాశ్‌రెడ్డి హాజరయ్యారు. ఉదయం 9-30 గంటలకు సీబీఐ కార్యాలయానికి చేరుకున్న ఆయన్ని ఉదయం 10 గంటల నుంచి అధికారులు ప్రశ్నించడం ప్రారంభించినట్టు సమాచారం. హైకోర్టు ఆదేశాల ప్రకారం అధికారులు ఆయనకు లిఖితపూర్వకంగా ప్రశ్నలు అందించారు. వాటన్నింటికీ ఎంపీ సమాధానాలు ఇచ్చినట్టు తెలిసింది. ఈ ప్రక్రియ మొత్తాన్ని ఆడియో, వీడియో రికార్డు చేశారు. భోజన విరామం తర్వాత కూడా విచారణ కొనసాగింది. అవినాశ్‌రెడ్డి ఇచ్చిన అన్ని సమాధానాలపై సీబీఐ అధికారులు స్టేట్‌మెంట్ రికార్డ్ చేసినట్టు తెలిసింది. విచారణ అనంతరం సాయంత్రం 6-30 గంటలకు అవినాశ్‌రెడ్డి సీబీఐ కార్యాలయం నుంచి బయటికి వచ్చారు. శుక్రవారం సైతం ఆయన సీబీఐ ఎదుట విచారణకు హాజరుకానున్నట్టు సమాచారం.

భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలను 6 గంటలు ప్రశ్నించిన సీబీఐ అధికారులు

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలను గురువారం రెండో రోజు ఆరు గంటల పాటు ప్రశ్నించారు. కోర్టు కస్టడీ మేరకు గురువారం ఉదయం 10 గంటలకు చంచల్‌గూడ జైలు నుంచి కోఠిలోని సీబీఐ కార్యాలయానికి ఇద్దరినీ తీసుకువచ్చారు. బుధవారం నాటి దర్యాప్తునకు కొనసాగింపుగా మరికొన్ని అంశాలపై సీబీఐ అధికారులు వారిద్దరినీ ప్రశ్నించినట్టు తెలిసింది.



దర్యాప్తు సందర్భంగా న్యాయవాదిని అనుమతించి, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఆడియో, వీడియో రికార్డింగ్‌పై హైకోర్టు గురువారం జారీ చేసిన ఆదేశాల మేరకు సీబీఐ అధికారులు చర్యలు తీసుకున్నట్టు తెలిసింది. భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డిని ప్రశ్నించే సమయంలో న్యాయవాదికి కనిపించేలా ఉంచడంతోపాటు వారిని అడిగిన ప్రతి ప్రశ్నను, వారు ఇచ్చిన ప్రతి సమాధానాన్ని ఆడియో, వీడియో రికార్డింగ్ చేసినట్టు సమాచారం. బుధవారం మాదిరిగానే గురువారం సైతం సీబీఐ అధికారులు సాయంత్రం 4-20 గంటలకల్లా విచారణ పూర్తి చేశారు. అనంతరం భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

విచారణ పూర్తయ్యే వరకు న్యాయవాదులను అనుమతించాలి: హైకోర్టు

వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి విచారణ పూర్తయ్యే వరకు వారి న్యాయవాదులను అనుమతించాలని తెలంగాణ హైకోర్టు సీబీఐని ఆదేశించింది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు విచారణ జరపాలని, ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలని స్పష్టం చేసింది. న్యాయవాదిని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే సీబీఐ అనుమతించిందని, విచారణ ముగిసే దాకా ఉండేలా ఆదేశాలివ్వాలని భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.సురేందర్ గురువారం విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. న్యాయవాదిని మధ్యాహ్నం తర్వాత అనుమతించడంలేదని తెలిపారు. న్యాయవాదులకు పిటిషనర్లు కనిపించేలా ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అవినాశ్ ముందస్తు బెయిల్‌పై సుప్రీంకోర్టుకు సునీత

- నేడు విచారిస్తామన్న సీజేఐ

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ నర్రెడ్డి సునీతారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారణ త్వరగా చేపట్టాలని గురువారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనాన్ని సునీత తరఫు న్యాయవాది కోరారు. శుక్రవారం విచారణ జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశిస్తామని సీజేఐ తెలిపారు. ఈ నెల 25 వరకు అవినాశ్‌ను అరెస్టు చేయొద్దని సీబీఐకి తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే.

దస్తగిరికి తెలంగాణ హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు (ఏ-4) షేక్ దస్తగిరికి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. దస్తగిరిని అప్రూవర్‌గా పేర్కొంటూ సీబీఐ కోర్టు ఉత్తర్వులు జారీ చేయడాన్ని కొట్టివేయాలంటూ ఎంపీ కృష్ణారెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.సురేందర్ గురువారం మరోసారి విచారణ చేపట్టారు. భాస్కర్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిస్తూ.. హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న కిరాయి హంతకుడు దస్తగిరికి క్షమాబిక్ష చెల్లదని అన్నారు. ఈ పిటిషన్లలో ప్రతివాది అయిన దస్తగిరికి ఇప్పటివరకు ఎలాంటి నోటీసులు జారీ చేయలేదని నివేదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఈ కేసులో నిందితుడు దస్తగిరికి నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను జూన్‌కు వాయిదా వేశారు.

ప్రైవేట్ పాఠశాలల ఆగడాలపై ప్రత్యేక దృష్టి

సాక్షి, అమరావతి: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అనుమతులు లేకుండా అడ్మిషన్లు, తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఆర్‌జేడీలకు, డీఈవోలకు ఆదేశాలు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపుతోపాటు, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ అనుబంధంగా అనుమతులు ఉన్నట్టు ప్రచారం చేసుకుంటూ పలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు అక్రమంగా విద్యార్థుల్ని చేర్చుకుంటున్నట్టు సమాచారం అందుతుండటంతో పాఠశాల విద్యాశాఖ చర్యలకు ఉపక్రమించింది. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వంతోపాటు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ బోర్డులు గుర్తింపు ప్రక్రియ పూర్తయి అన్ని అనుమతులు వచ్చాకే ఆయా స్కూళ్లలో ప్రవేశాలు, తరగతుల నిర్వహణ చేపట్టాలి. కానీ.. కొన్ని యాజమాన్యాలు కేవలం అనుమతులకు దరఖాస్తు చేసి విద్యార్థుల్ని చేర్చుకుంటూ తరగతులు కూడా నిర్వహిస్తున్నాయని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.ఇటువంటి వాటికి ఆస్కారం లేకుండా ముందునుంచే తగిన చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి అధికారులను పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది.

రాగిజావ బదులు చిక్కీలు

- ఒంటిపూట బడులతో విద్యాశాఖ సూచన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఒంటిపూట బడులు, పరీక్షల నిర్వహణ నేపథ్యంలో స్కూళ్లు ఉ.11.15 గంటల వరకు మాత్రమే ఉంటున్నందున విద్యార్థులకు రాగి జావకు బదులు చిక్కీలు అందించాలని విద్యాశాఖ నిర్ణయించింది. పాఠశాలల్లో తరగతులు ముగిసే 11 గంటలకే ఇళ్లకు వెళ్లే ముందు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నందున వేరేగా రాగిజావను అందించే బదులు వారికి చిక్కీలను ప్రతిరోజూ ఇవ్వాలని మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ డాక్టర్ నిధి మీనా సూచనలు జారీచేశారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రాగిజావను వారంలో మూడ్రోజులు మాత్రమే ఇస్తుండగా ఇప్పుడు ఈ విద్యాసంవత్సరం ముగిసేవరకు ప్రతిరోజూ చిక్కీలు పంపిణీ చేయాలన్నారు. రాగి జావ పంపిణీని తిరిగి వచ్చే విద్యాసంవత్సరం ఆరంభం నుంచి చేపట్టనున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.